www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మానేరులో ఇసుక తవ్వకాలు తప్పు



సంచలన తీర్పు వెలువరించిన చెన్నై ఎన్జీటీ కోర్టు
పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు
మైనింగ్, ఇరిగేషన్ శాఖలకు 25 కోట్ల చొప్పున ఫైన్
గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెల్లించాలి..
మూడు నెలల క్రితం రిజర్వు చేసిన తీర్పు వెల్లడి
ఫలించిన మానేరు పరిరక్షణ సమితి పోరాటం

3

బుధవారం | 22-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 53
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 6.48 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: స్వాతి ఉ. 7.46 తదుపరి విశాఖ; వర్జ్యం: మ. 1.42-3.24; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: రా. 11.53-1.35; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.38
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ప్రపంచంతోనే పోటీ

ఆ దిశగా తెలంగాణ పారిశ్రామిక విధానం ఉండాలి

పరిశ్రమలకు అత్యుత్తమ గమ్యస్థానం కావాలి.. విదేశాల్లో అధ్యయనం చేసి రూపొందించండి
పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం ఆదేశం.. 6 విధానాలు రూపొందిస్తున్నామన్న అధికారులు
టెక్స్‌టైల్ పాలసీని సిద్ధం చేయాలన్న రేవంత్.. కోడ్ ముగిసిన వెంటనే ఏడు కొత్త పాలసీలు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచంలోనే తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానం కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రాన్నే ఎంపిక చేసుకోవాలని, పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. ఆ దిశగా నూతన పారిశ్రామిక విధానం ఉండాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ)పై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన నూతన విధానాలపై సీఎం పలు సూచనలు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను రూపొందించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లో అమల్లో ఉన్న అత్యుత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు. కాగా, కొత్తగా ఆరు విధానాలు సిద్ధం చేస్తున్నామని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీ, రాష్ట్రంలోని ఉత్పత్తులకు ఎగుమతులు పెంచి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ సాధించేందుకు ఎక్స్‌పోర్ట్ పాలసీ, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఫార్మా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు న్యూ లైఫ్‌సైన్సెస్ పాలసీ, ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ఈవీ పాలసీ, సహజ విద్యుత్తు ఉత్పత్తి పెంచేందుకు గ్రీన్ ఎనర్జీ పాలసీ, వైద్య పర్యాటకాన్ని పెంచేందుకు మెడికల్ టూరిజం పాలసీలను రూపొందిస్తున్నామని వివరించారు. కాగా, రాష్ట్రంలో చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొత్త టెక్స్‌టైల్ పాలసీ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చేనేత రంగంపై ఆధారపడ్డ కుటుంబాలు రాష్ట్రంలో

మిగతా 13వ పేజీలో...



మనవడిని ఎత్తుకొని తిరుమలలో అతిథిగృహంలోకి వెళ్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎం భార్య గీత

తిరుమలకు సీఎం రేవంత్

కుటుంబంతో కలిసి నేడు శ్రీవారి దర్శనం

13



మేడిగడ్డపై జియోట్యూబ్ వాల్!

జియోట్యూబ్ చుట్టూ గ్యాబియన్ బాక్సుల ఏర్పాటు
500 మీటర్ల పొడవు.. 2.5 మీటర్ల ఎత్తుతో తాత్కాలిక కట్ట
కన్నెపల్లి వద్ద నిర్మాణం.. రూ.10 కోట్ల అంచనా వ్యయం
నవంబరులో నిర్మాణం ప్రారంభం.. నెలలో పూర్తి

14



దొడ్డు బియ్యం.. దొడ్డ భారం!

వాడకం లేదు.. పేరుకుపోతున్న నిల్వలు
సన్నాలకు డిమాండ్.. దిగుబడి తక్కువ
దీంతో సాగుకు అన్నదాతల వెనుకంజ
రూ.500 బోనస్‌తో ప్రోత్సాహం..
సన్నాలకే సై అంటారంటున్న ప్రభుత్వం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): దొడ్డు బియ్యం పెద్ద భారంగా మారుతోంది. రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనూ దొడ్డు బియ్యం నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయి. తెలంగాణలో గడిచిన రెండేళ్లుగా సన్నాల సాగు తగ్గుతూ వస్తోంది. అదే సమయంలో దొడ్డు బియ్యం సాగు భారీస్థాయిలో పెరుగుతోంది. ఎంతలా అంటే.. మూడేళ్ల క్రితంతో పోలిస్తే.. దొడ్డు ధాన్యం దిగుబడి దాదాపుగా రెట్టింపైంది. సన్న ధాన్యం దిగుబడి తక్కువగా ఉండడం.. నూక సమస్యలు ఎక్కువ కావడంతో రైతులు దొడ్డు బియ్యం

మిగతా 12వ పేజీలో...

బోనస్.. సన్నాలతో మొదలు

ఎక్కడో ఒకచోట ప్రారంభించాలి కదా!
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
బోనస్ ఎగ్గొట్టేందుకు సర్కారు కుట్ర
దొడ్డు వడ్లకు ఎందుకివ్వరు?: హరీశ్

12

సీబీఐకి చిక్కిన సీబీఐ

మధ్యప్రదేశ్‌లో 'నర్సింగ్ స్కాం'

హైకోర్టు ఆదేశాలతో కాలేజీల్లో తనిఖీలు
యాజమాన్యాల నుంచి భారీగా వసూళ్లు
రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఓ ఇన్‌స్పెక్టర్
విస్తృత సోదాలు, అక్రమ సొమ్ము పట్టివేత
మరో ఇన్‌స్పెక్టర్ సహా 13 మంది అరెస్ట్
కాలేజీల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, మధ్యవర్తులు సహా 23 మందిపై ఎఫ్ఐఆర్

భోపాల్, మే 21: సాధారణంగా ఏదైనా అవినీతి కుంభకోణం జరిగితే సీబీఐ దర్యాప్తు జరుపుతుంది. కానీ, స్వయంగా సీబీఐ అధికారుల అవినీతిపైనే సీబీఐ దర్యాప్తు జరుపుతున్న విచిత్ర పరిస్థితి మధ్యప్రదేశ్‌లో నెలకొంది. ఆ రాష్ట్రంలోని నర్సింగ్ కాలేజీల్లో అవకతవకలను గుర్తించి నివేదిక ఇమ్మని ఆ రాష్ట్ర హైకోర్టు సీబీఐని ఆదేశిస్తే.. అక్రమాలను గుర్తించటం మాట అటుంచి, స్వయంగా సీబీఐ అధికారులే అవినీతికి పాల్పడ్డారు. కాలేజీల్లో సౌకర్యాలు లేకపోయినా అంతా బాగానే ఉందంటూ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇందుకోసం ఒక్కో కాలేజీ నుంచి రూ.2-10 లక్షల వరకూ వసూలు చేశారు. ఈ బాగోతం బట్టబయలై 13 మందిని సీబీఐ అరెస్టు చేసింది. వీరిలో ఇద్దరు స్వయంగా సీబీఐకే చెందిన ఇన్‌స్పెక్టర్లున్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం ఈ 'నర్సింగ్ స్కాం' సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రంలోని పలు నర్సింగ్ కళాశాలలు కనీస సదుపాయాలు లేకపోయినా నడుస్తున్నాయని దాఖలైన ఓ పిటిషన్‌పై 2022 డిసెంబరులో ఆ రాష్ట్ర హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు నర్సింగ్

మిగతా 2వ పేజీలో...



కీరవాణి రాగంలో జయజయహే

రాష్ట్ర గేయానికి ప్రముఖ సంగీత దర్శకుడి స్వరకల్పన
సీఎంను కలిసి సూచనలు తీసుకున్న అందెశ్రీ, కీరవాణి


13



విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి, 30 మందికి గాయాలు
లండన్ నుంచి వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో ఘటన
బ్యాంకాక్‌లో అత్యవసర ల్యాండింగ్

2



ఏసీబీ వలలో ఏసీపీ!

ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలు.. సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు అరెస్టు



ఏసీపీ ఉమామహేశ్వరరావు ఇంట్లో దొరికిన నగదు, బంగారం, పత్రాలు



తెలంగాణలో 11 చోట్ల.. ఏపీలోని మూడు ప్రాంతాల్లో..
ఏసీపీ, ఆయన బంధువుల ఇళ్లపై ఏకకాలంలో సోదాలు
రూ.37.50 లక్షల నగదు.. 60 తులాల బంగారం సీజ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో విలువైన ఆస్తులున్నట్టు గుర్తింపు
17 డాక్యుమెంట్ల స్వాధీనం.. విలువ రూ. 3.46 కోట్లు
మార్కెట్ విలువ రూ.25 కోట్లకు పైగానే అని అంచనా
విచారణ అనంతరం నేడు కోర్టులో ప్రవేశపెట్టే చాన్స్
1500 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా మోసంలో విచారణాధికారి


హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలకు పెద్ద అవినీతి తిమింగలం చిక్కింది! ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో.. హైదరాబాద్ కమిషనరేట్ సీసీఎస్‌లో ఏసీపీ (టీమ్-3)గా పని చేస్తున్న ఉమామహేశ్వరరావు ఇంటిపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని ఆయన ఇంటితో పాటు.. ఆయన సంబంధీకుల ఇల్లు సహా.. తెలంగాణలో 11 చోట్ల, ఆంధ్రాలో మూడు చోట్ల (విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెం, అనకాపల్లి జిల్లా రోలుగుంట, చోడవరం).. కలిపి మొత్తం 14 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ప్రారంభమైన ఈ దాడులు

మిగతా 12వ పేజీలో...

కేసు వచ్చిందంటే కాసులు పడాల్సిందే

లేదంటే బూతు పురాణం..
బూటుకాలితో తన్నుడు
బాధితుల్ని భయపెట్టుడు..
నేరగాళ్ల కొమ్ముకాసుడు
సంపన్నులే ఆయన లక్ష్యం..
డబ్బులు దండుకోవడమే నైజం

12



ఆర్ఆర్ఆర్‌కు ఆగస్టులో టెండర్లు!

కసరత్తు చేస్తున్న అధికారులు

6 ప్యాకేజీలుగా 161 కి.మీ పనులు
2 చోట్ల మినహా భూసేకరణ పూర్తి
పరిహారం చెల్లింపు దిశలో చర్యలు
హడ్కో రుణానికి ప్రభుత్వ ప్రయత్నం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఉత్తర భాగానికి సంబంధించి ఒకట్రెండు చోట్ల వినహా.. భూసేకరణలో కీలక దశలు పూర్తయిన నేపథ్యంలో టెండర్లను ఆహ్వానించి, పనులను ప్రారంభించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కసరత్తు ప్రారంభించింది. ఆగస్టు రెండో వారంలో టెండర్లను ఆహ్వానించి.. ఓవైపు పనులను చేపడుతూనే, మరోవైపు పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై దృష్టి సారించాలని నిర్ణయించింది.

ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఉత్తర-దక్షిణ భాగాలుగా మొత్తం 350 కిలోమీటర్ల మేర జరగనుంది. సంగారెడ్డి నుంచి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 161 కిలోమీటర్లు ఉత్తర భాగం పరిధిలో ఉన్నాయి. చౌటుప్పల్ నుంచి ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల మీదుగా తిరిగి సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్లు దక్షిణ భాగంలో ఉన్నాయి. తొలుత ఉత్తర భాగంలో భూసేకరణ దాదాపుగా పూర్తయింది. ఒక్క నర్సాపూర్, భువనగిరిలో మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉంది. గజ్వేల్ సమీపంలోని నర్సాపూర్‌లో అటవీ భూములు ఉన్నాయి. దీంతోపాటు.. అక్కడ కొందరు భూయజమానులు తమ భూములను ఇవ్వడానికి ముందుకు

మిగతా 13వ పేజీలో...

మృత్యువు మీద పడింది

బొల్లారం ఆస్పత్రి ఆవరణలో దంపతులపై కూలిన చెట్టు
అక్కడికక్కడే భర్త మృతి
భార్యకు తీవ్ర గాయాలు
చికిత్సకు వెళ్లగా దుర్ఘటన
ఉపాధికూలీలపై విరిగిపడ్డ మట్టిపెళ్లలు.. ఒకరి మృతి
ఆరుగురికి తీవ్ర గాయాలు
సిరిసిల్ల జిల్లాలో ప్రమాదం

3



రవీందర్, సరళాదేవిపై కూలిన చెట్టు

పిన్నెల్లి అరాచకం


పోలింగ్ కేంద్రంపై దండయాత్ర

పల్నాడు జిల్లా పాల్వాయి గేటులో ఈవీఎంను స్వయంగా ధ్వంసం చేసిన వైసీపీ ఎమ్మెల్యే
ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియో
రామకృష్ణారెడ్డిపై కేసు పెట్టని అధికారులు
గృహనిర్బంధం చేసినా పరారైన పిన్నెల్లి
చోద్యం చూసిన పోలీసులపైనా చర్యల్లేవ్

14



పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేసి, అడ్డుకోబోయిన ఏజెంటును బెదిరిస్తున్న పిన్నెల్లి



2

హెచ్ఐవీ టీకా.. ట్రయల్ సక్సెస్!

ప్రయోగాత్మక వ్యాక్సిన్‌తో యాంటీబాడీలు
డ్యూక్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల ఘనత
మరిన్ని పరిశోధనలు చేయాలని వెల్లడి
40 ఏళ్లుగా సవాల్‌గా మారిన మహమ్మారి

ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో హానికర రసాయనాలు లేవు

న్యూఢిల్లీ, మే 21: ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీల మసాలాలు, ఇతర ఉత్పత్తుల్లో హానికర రసాయనాలు లేవని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రకటించింది. వీటి శాంపుల్స్‌లో ఇథిలీన్ ఆక్సైడ్ (ఈటీవో)గానీ, కాన్సర్ కారక రసాయనాలుగానీ లేవని తెలిపింది. ఈ రెండు కంపెనీలు విక్రయించే ఉత్పత్తుల శాంపుల్స్‌ను విస్తృతంగా సేకరించి పరీక్షలు జరపగా ఈ విషయం వెల్లడైనట్టు పేర్కొంది. ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో అనుమతులకు మించి రసాయనాలున్నట్టు హాంకాగ్ ఫుడ్ అథారిటీ ఆరోపించిన నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ పరీక్షలు జరిపింది. మసాలాల్లో సూక్ష్మక్రిములు నశించేలా స్టెరిలైజ్ చేసేందుకు ఇథిలీన్ ఆక్సైడ్‌ను ఉపయోగిస్తుంటారు. ఇది పరిమితికి మించితే క్యాన్సర్ సహా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఒక్కో దశకు విజయం మరింత చేరువ

» జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం : కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మే 21 : ఒక్కో దశ పోలింగ్ ముగిసేకొద్దీ ఇండియా కూటవి విజయానికి మరింత చేరువ అవుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. "మోదీ పతనం ఖాయం. ఈ విషయం జూన్ 4వ తేదీన తేలిపోతుంది. ఇండియా కూటమి సుస్థిరమైన, పూర్తి కాలపు ప్రభుత్వాన్ని అందిస్తుంది" అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేవారు. ఢిల్లీ వాసులను పాకిస్థానీయులుగా పేర్కొంటే సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఉద్దేశించి కేజ్రీవాల్ హెచ్చరించారు. రాహుల్, కేజ్రీవాల్‌లకు ఇండియాలో మద్దతు లేదని, వారి మద్దతుదారులు పాకిస్థాన్‌లో ఉన్నారని అమిత్‌షా అనడాన్ని కేజ్రీవాల్ ఆక్షేపించారు. "62 సీట్లు, 56 శాతం ఓట్లు ఆప్‌కు ఇచ్చి ఢిల్లీ ప్రజలు అందించారు. 117 సీట్లకు 92 సీట్లు ఆప్‌కు పంజాబీలు అందించారు. గోవా ప్రజలు ఆప్ పట్ల ప్రేమను, విశ్వాసాన్ని ప్రకటించారు. గుజరాతీలు ఆప్‌కు 14 శాతం ఓట్లు అందించారు. మరి.. ఢిల్లీ వాసులు, పంజాబీలు, గోవావాసులు, గుజరాతీలు అంతా పాకిస్థానీయులేనా?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాగా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మరోసారి అరవింద్ కేజ్రీవాల్‌పై విరుచుకుపడ్డారు. ఆప్ ఎంపీ స్వాతీ మాలివాల్ వంటి మహిళల పట్ల ఆయన వైఖరి ఏమిటనేది కేజ్రీవాల్ మౌనమే చెప్తోందని సక్సేనా విమర్శించారు. కాగా, స్వాతీ మాలివాల్ బీజేపీ కోసం పని చేస్తున్నారన్న తమ వాదనను సక్సేనా విమర్శలు బలపరుస్తున్నాయని ఆప్ ఆరోపించింది.

చైనా కమ్యూనిస్టు పార్టీతో బీజేపీ 13 సార్లు భేటీ

న్యూఢిల్లీ, మే 21: చైనా కమ్యూనిస్టు పార్టీతో బీజేపీ జరిపిన సమావేశాలకు సంబంధించిన వివరాలను బహిర్గత పరచాలని మంగళవారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 2008 నుంచి ఇప్పటి వరకు దాదాపు 13 సార్లు బీజేపీ నేతలు చైనా కమ్యూనిస్టు పార్టీ నేతలతో సమావేశమయ్యారని, చాలా వరకు భేటీలు చైనాలోనే జరిగాయని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పవన్ ఖేరా ఆరోపించారు. ఈ సమావేశాల వెనుక ఉద్దేశాన్ని తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. 2017లో డోక్లాం ఘర్షణ తర్వాత ఇరు దేశాల నేతలు నెలలోపే భేటీ అయ్యారని, దానికి సంబంధించిన వివరాలు ఇప్పటివరకు బయటపెట్టలేదని ఆ వివరాలను ఇప్పటికైనా తెలపాలని ఆయన కోరారు. లద్దాఖ్ చర్యలపై చైనాకు మోదీ క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాత బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు చైనా కమ్యూనిస్టు నేతలను తరుచుగా కలుస్తున్నారని ఆరోపించారు.

126 ఏళ్ల వృద్ధురాలి మృతి

» మెట్టూరు డ్యాం నిర్మాణానికి ప్రత్యక్ష సాక్షి



చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో ఒకటైన మెట్టూరు డ్యామ్ నిర్మాణంలో పాలు పంచుకున్న శతాధిక వృద్ధురాలు పళనియమ్మాళ్ (126) సోమవారం రాత్రి కన్ను మూశారు. తిరుపూరు జిల్లా గాంగేయం, తిరువిక నగర్‌కు చెందిన రామన్ భార్య పళనియమ్మాళ్ (126). వీరికి 12 మంది మగ పిల్లలు. రామన్ యాభై ఏళ్ల క్రితమే కన్నుమూశారు. సంతానంలో 11 మంది కుమారులు వయోభారం కారణంగా ఇప్పటికే చనిపోగా మారిముత్తు (85) అనే కుమారుడు మాత్రమే జీవించివున్నారు. పళనియమ్మాళ్ కుటుంబంలో కుమారుడు, మనుమలు, మనుమరాళ్లు, కోడళ్లు, బంధువులు ఇలా అంతా కలిసి ఏకంగా 152 మంది వరకు సభ్యులున్నారు. ఎళనియమ్మాళ్ తన 13 యేట మెట్టూరు డ్యామ్ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. డ్యాంకు కూలీగా, ముఠా మేస్త్రీగా కూడా వ్యవహరించారు. పళనియమ్మాళ్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి.

శాక్రమెంటో కౌంటీ సుపీరియర్ జడ్జిగా జయ

» అమెరికాలో విజయవాడ మహిళ ఘనత



విజయవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో విజయవాడ మహిళకు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ, ప్రేమలత దంపతుల కుమార్తె.. జయ బాడిగ కాలిఫోర్నియాలోని శాక్రమెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. 2022 నుంచి ఇదే కోర్టులో జయ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. జయ తండ్రి బాడిగ రామకృష్ణ 2004-09 వరకు మచిలీపట్నం ఎంపీగా చేశారు. రామకృష్ణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జయ మూడో కుమార్తె. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే సాగింది. ఉస్మానియా యూనివర్సిటీలో సైకాలజీ, పొలిటికల్ సైన్స్‌లో బీఏ పూర్తిచేసిన అనంతరం అమెరికా వెళ్లారు. శాంటాక్లారా విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా (జూరిస్ డాక్టర్ డిగ్రీ) పొందారు. 10 ఏళ్లకుపైగా న్యాయవాద వృత్తిలో ప్రైవేట్ ప్రాక్టీస్ కొనసాగించారు. జయతోపాటు మరో భారత సంతతి న్యాయమూర్తి రాజ్ సింగ్ బధేషా సహా 18 మందిని జడ్జిలుగా నియమిస్తూ గవర్నర్ న్యూసోమ్ ప్రకటన చేశారు.

షెంజెన్ వీసా ఫీజును పెంచిన ఐరోపా కమిషన్

లండన్, మే 21: పర్యాటకులు అధికంగా వచ్చే వేసవి ముంగిట షెంజెన్ వీసా రుసుమును పెంచుతూ యూరోపియన్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్దలకు ప్రస్తుతం 80 యూరోలు(రూ.7,232)గా ఉన్న వీసా ఫీజును 12% పెంచి 90 యూరోలు (రూ.8,136) చేయనుంది. ఆరేళ్ల నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు 40 యూరోల (రూ.3,616) నుంచి 45 యూరోలు (రూ.4,068) వసూలు చేయనుంది. ఈ నిర్ణయం జూన్ 11 నుంచి అమల్లోకి రానుంది. 29ఐరోపా దేశాలతో కూడిన షెంజెన్ సమాఖ్యలో.. ఏదేని ఒక దేశం వీసా పొందితే మిగతావాటిలో 90రోజుల దాకా పర్యటించవచ్చు.

ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయండి: సిద్దూ

బెంగళూరు, మే 21(ఆంధ్రజ్యోతి): రాసలీలల వివాదంలో చిక్కుకుని విదేశాలకు పరారయిన జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ డిప్లమాటిక్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య కేంద్రప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రజ్వల్ రేవణ్ణకు ఇప్పటికే కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని అన్నారు. పాస్‌పోర్ట్ రద్దు అయితే ప్రజ్వల్ దేశానికి వెనుతిరిగి రావాల్సి ఉంటుందని అన్నారు. ప్రజ్వల్ ఆచూకీ కోసం సిట్ వివిధ కోణాల్లో దర్యాప్తు సాగిస్తోందని అన్నారు.

అదో మోసగాళ్ల ముఠా!

వాళ్లు రూ.20 లక్షల కోట్ల అవినీతిలో భాగస్వాములు!

» ఇండియా కూటమిపై మోదీ ఫైర్



వారాణసీలో నారీశక్తి వందన్ కార్యక్రమంలో మోదీకి నమస్కరిస్తున్న యోగి ఆదిత్యనాథ్

మహరాజ్‌గంజ్/మోతిహారి, మే 21: విపక్ష ఇండియా కూటమిపై ప్రధాని మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. దానిని స్కామ్‌స్టర్ల(మోసగాళ్ల) కూటమిగా అభివర్ణించారు. ఆ పార్టీల నేతలంతా వంద శాతం కులవాదులు, మతవాదులు, కుటుంబవాదులని ధ్వజమెత్తారు. బిహార్‌లోని మహరాజ్‌గంజ్, పూర్వీచంపారన్ లోక్‌సభ నియోజకవర్గాల్లో మంగళవారం జరిగిన ఎన్నికల సభల్లో ఆయన మాట్లాడారు. ఈ కూటమి అవినీతి, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయిందని.. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇదసలు రాజకీయ కూటమిగానే కనబడడం లేదని.. ఇందులోని స్కామ్‌స్టర్లు దేశంలో రూ.20 లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలకు బాధ్యులని విరుచుకుపడ్డారు. 'టుకడే టుకడే గ్యాంగ్ చేసిన పాపాలతో దేశం ముందుకు వెళ్లదన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో తొలి దశలోనే కూటమి పనైపోయిందని.. తర్వాత నాలుగు విడతల్లో కూడా చావుదెబ్బ తిన్నదని.. మిగిలిన రెండు విడతల్లోనూ ఇదే కొనసాగుతుందని స్పష్టం చేశారు. జూన్ 4న ఓట్లు లెక్కించే రోజు ఎదురయ్యే ఫలితాలతో కూటమి ఆశలు, ఉద్దేశాలకు గట్టి షాక్ తగులుతుందని జోస్యం చెప్పారు. ఆగర్భ శ్రీమంతులైన రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వి యాదవ్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని నాకు సలహా ఇస్తామని జంగిల్ రాజ్ వారసుడు (తేజస్వి) అంటున్నారు.. మోదీ ఏడవడం తాను చూడాలనుకుంటున్నానని కాంగ్రెస్ యువరాజు (రాహుల్) చెబుతున్నారు. నా సమాధి తవ్వుతానని ఆయన బహిరంగంగానే నినాదాలు ఇస్తున్నారు. వీరిద్దరితో సారూప్యం గల వ్యక్తి (అఖిలేశ్) యూపీలో ఉన్నారు. నేను జీవిత చరమాంకానికి వచ్చానని.. అందుకే వారాణసీలో పోటీచేస్తున్నానని అన్నారు. జూన్ 4 సమీపించేకొద్దీ ఇండీ కూటమి నేతలు నన్ను మరింత దూషిస్తున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. మోదీని ప్రజలు మూడోసారి ఎన్నుకోబోతున్నారన్న వాస్తవాన్ని వారు అంగీకరించలేకపోతున్నారు' అని తెలిపారు. తనకెవరూ వారసులు లేరని.. దేశ ప్రజలందరినీ తన వారసులుగా భావిస్తున్నానని చెప్పారు. 'మీరు, మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం నేను బాగా కష్టపడాలి. మీరు ఎదుర్కొన్న సమస్యలను మీ తర్వాతి తరం ఎదుర్కోకూడదని నేను భావిస్తున్నా' అని తెలిపారు. చంపారన్ గాంధీజీ కర్మభూమి అని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బాపూజీ ఆశయాలను తుంగలో తొక్కిందని.. ఒక కుటుంబ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ వస్తోందని విమర్శించారు. మహరాజ్‌గంజ్ సభలో పలువురు యువకులు తనను చూసేందుకు స్తంభాలు ఎక్కడాన్ని మోదీ గమనించి వారిని హెచ్చరించారు. 'మీరంతా కిందకు దిగాలి. దేశానికి మీలాంటి యువత అవసరం. మీరు కింద పడి గాయపడితే నేనెంతో మనస్తాపానికి గురవుతాను. మీరు దిగేదాకా ప్రసంగించను. నా మందలింపుతో మీకు కష్టం కలిగించి ఉంటే క్షమించండి' అని వ్యాఖ్యానించారు.

పూరీ జగన్నాథుడు మోదీకి భక్తుడు

నోరు జారిన బీజేపీ నేత సంబిత్ పాత్రా



భువనేశ్వర్, మే 21: "పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీకి భక్తుడు" అంటూ నోరు జారిన బీజేపీ నేత, పూరీ నుంచి ఆ పార్టీ తరపున లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన సంబిత్ పాత్రా చిక్కుల్లో పడ్డారు. ఈ వ్యాఖ్యపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. సోమవారం పూరీలో ప్రధాని మోదీ రోడ్‌షో సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సంబిత్ పాత్రా.. మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్య చేశారు. దీనిపై ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ తీవ్రంగా స్పందించారు. "ఈ విశ్వానికే జగన్నాథుడు ప్రభువు. అలాంటి మహా ప్రభువును ఓ మానవుడికి భక్తుడు అనడం దేవుణ్ని అవమానించినట్లు" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పూరీ అభ్యర్థి జయనారాయణ్ పట్నాయక్ ఈ అంశంపై పూరీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబిత్ వ్యాఖ్యకు గాను ప్రధాని నరేంద్ర మోదీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు తమనుతాము దేవుడికంటే గొప్పగా భావిస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో సంబిత్ పాత్రా క్షమాపణలు చెప్పారు. నోరు జారినట్లు వివరణ ఇచ్చుకున్నారు. ఈ తప్పునకు ప్రాయశ్చిత్తంగా మూడ్రోజుల పాటు ఉపవాసం ఉంటానని పేర్కొన్నారు.

నేను ఆరెస్సెస్ సభ్యుడ్నే

» పిలిస్తే మళ్లీ అక్కడికే వెళ్తా

» పదవీ విరమణ రోజున కలకత్తా హైకోర్టు జడ్జి



కోల్‌కతా, మే 21: తాను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) జీవితకాల సభ్యుడినని, తాను మళ్లీ అక్కడికి వెళ్లి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ చిత్తరంజన్ దాస్ చెప్పారు. సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆరెస్సెస్‌తో తనకు చిన్నప్పటి నుంచే అనుబంధం ఉందని, ఈ విషయం చెప్పడానికి భయపడడం లేదని అన్నారు. వీడ్కోలు సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ "నేను ఓ సంస్థకు రుణ పడి ఉన్నా. చిన్నప్పుడే అందులో చేరా. యవ్వన దశలోనూ అందులోనే కొనసాగా. ధైర్యంగా, నిజాయితీగా మెలగడాన్ని నేర్చుకున్నా. కొందరికి నచ్చకపోవొచ్చేమోగానీ నేను అప్పుడు...ఇప్పుడు ఆరెస్సెస్ సభ్యుడినే" అంటూ తన నేపథ్యాన్ని వివరించారు. "ఏ సాయం కావాలని పిలిచినా, తాను చేయగలిగే ఏ పని అప్పగించినా మళ్లీ ఆ సంస్థలో చేరుతా. అయితే ఆ సంస్థ పేరు చెప్పుకొని వృత్తిలో ఉన్నత స్థానాలు పొందలేదు. జడ్జిగా పనిచేసిన సమయంలో ఆ సంస్థకు దూరంగానే ఉంటూ వచ్చా"నని చెప్పారు. 'ఒడిశాకు చెందిన జస్టిస్ చిత్తరంజన్ దాస్ 2009లో ఒడిశా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022లో కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. కాగా, మార్చి నెలలో పదవీ విరమణ చేసిన కలకత్తా హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ వెంటనే బీజేపీలో చేరారు. ప్రస్తుతం తామ్‌లుక్ నియోజవర్గం నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు.

ఆర్టికల్ 370 రద్దు తీర్పుపై సమీక్షకు సుప్రీం నో

న్యూఢిల్లీ, మే 21: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కలిగించిన ఆర్టికల్ 370ను రద్దును సమర్థిస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్షించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆర్టికల్ 370 రద్దు సబబేనని గత ఏడాది డిసెంబరులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చింది. దీనిని సమీక్షించాలని కోరుతూ పలు దరఖాస్తులు వచ్చాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లోనే అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల పరిశీలించింది. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదంటూ వాటిని తిరస్కరించింది. తమ పిటిషన్లపై ఓపెన్ కోర్టులో విచారణ జరపాలని, వాదనలకు అవకాశం కల్పించాలన్న వినతులను కూడా నిరాకరించింది. అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ అండ్ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, సీపీఎం నాయకుడు మహ్మద్ యూసుఫ్ తారిగామి ఈ రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు.

హిందూ-ముస్లింల మధ్య మోదీ చిచ్చు

» ఆయన ప్రజా జీవితం నుంచి తప్పుకోవాలి: ఖర్గే



జగ్‌ధారి(హరియాణ)/న్యూఢిల్లీ, మే 21: హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెట్టేలా నిత్యం వ్యాఖ్యలు చేస్తూ, సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రధాని మోదీ ప్రజా జీవితం నుంచి వైదొలగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న మోదీ ఉద్దేశాలు స్వచ్ఛంగా లేవని మంగళవారం పీటీఐ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజల ఆస్తులు లాగేసుకుంటుందని, ముస్లింలకు 15 శాతం బడ్జెట్ అంటూ ప్రధాని మాట్లాడుతున్నారని, ఇలాంటి వ్యాఖ్యలతో ఆయనే సమాజంలో విభజన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 'ఓవైపు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూనే మరోవైపు హిందూ-ముస్లింల గురించి మాట్లాడితే తాను ప్రజా జీవితంలో ఉండటానికి అర్హుడిని కాదని మోదీ చెప్తుంటారు' అని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నది బీజేపీయేనని ఆరోపించారు. మోదీ వన్ మ్యాన్ షో చేయాలని అనుకుంటున్నారని, ఒక్క నాయకుడే ఈ దేశం మొత్తాన్ని నడపగలడనేది ఆయన ఆలోచనగా పేర్కొన్నారు. 'పేదలకు సాయం చేయడం, ఏ సామాజిక వర్గానికైనా అన్యాయం జరగకుండా ఆపడం బుజ్జగింపు రాజకీయం కాబోదని ఖర్గే స్పష్టం చేశారు. మోదీ అబద్ధాలకోరని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టోపై అబద్ధాలు చెబుతున్నారని ఖర్గే ఆరోపించారు. గత పదేళ్లలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తదుపరి ప్రధాని ఎవరనేది ఎన్నికల తర్వాత మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయిస్తామని ఖర్గే చెప్పారు.



సీబీఐకి చిక్కిన సీబీఐ

(మొదటి పేజీ తరువాయి)

కాలేజీల్లో తనిఖీలు జరిపిన సమయంలో.. సదుపాయాలు లేని కళాశాలలకు కూడా డబ్బులు తీసుకొని వాటికి అనుకూలంగా సర్టిఫికేట్లు ఇచ్చినట్లు సీబీఐకి ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సీబీఐ విజిలెన్స్ విభాగం అధికారులు.. ఆదివారం ఓ నర్సింగ్ కాలేజీ యాజమాన్యం నుంచి రూ.10 లక్షల లంచం తీసుకుంటున్న సీబీఐ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌రాజ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే క్రమంలో ఢిల్లీ నుంచి నుంచి వచ్చిన సీబీఐ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల సోదాలు జరిపి.. రూ.2.33 కోట్ల సొమ్మును, 4 బంగారం కడ్డీలను, 36 డిజిటల్ ఉపకరణాలను, 150కి పైగా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సోమ, మంగళవారాల్లో సీబీఐకి అనుబంధంగా విధులు నిర్వహిస్తున్న మధ్యప్రదేశ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్ మజోకాను, సీబీఐకి సమాచారం అందించటానికి నియమితులైన ముగ్గురు వ్యక్తులను, ఇతర నిందితులను మొత్తం 13 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఒక నర్సింగ్ కాలేజీ చైర్మన్, మరో నర్సింగ్ కాలేజీ డైరెక్టర్, రెండు కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నారు. వీరందరినీ స్థానిక కోర్టు మే 29వ తేదీ వరకు సీబీఐ కస్టడీకి అప్పగించింది. వీరితోపాటు మొత్తం 23 మందిపై కేసు నమోదైంది. ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలైంది. నిందితుల జాబితాలో పలు కాలేజీల యజమానులు, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నారు. లంచాలు తీసుకుంటూ పట్టుబడిన ఇన్‌స్పెక్టర్లపై శాఖపరమైన చర్యలకు సీబీఐ ఆదేశించింది. అవినీతిపై సీబీఐ ఎంతమాత్రం రాజీ పడదని, దీంట్లో భాగంగానే సొంత అధికారులపైనా చర్యలు చేపట్టామని సీబీఐ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ టీకా.. ట్రయల్ సక్సెస్!

ప్రయోగాత్మక వ్యాక్సిన్‌తో మనుషుల్లో యాంటీబాడీలు.. 'డ్యూక్ హ్యూమన్ వ్యాక్సిన్' శాస్త్రజ్ఞుల ఘనత



హెచ్ఐవీ.. హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్! 1980ల నుంచి మానవాళికి సవాలుగా మారిన ఈ మహమ్మారి పని పట్టే టీకాను తయారు చేశామని డ్యూక్ హ్యూమన్ వ్యాక్సిన్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా) శాస్త్రజ్ఞులు ప్రకటించారు. తాము అభివృద్ధి చేసిన హెచ్ఐవీ టీకా.. ట్రయల్‌లో పాల్గొన్నవారిలో విజయవంతంగా సమర్థమైన యాంటీబాడీలు ఉత్పత్తి అయ్యేలా చేసిందని వెల్లడించారు. మూడేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనాకు కొన్ని నెలల వ్యవధిలోనే టీకాను తయారుచేయగలిగిన శాస్త్రజ్ఞులకు.. హెచ్ఐవీకి టీకా అభివృద్ధి చేయడానికి ఇంత కాలం ఎందుకు పట్టింది? అంటే.. దానికి కారణం ఆ వైరస్‌కున్న ఒక ప్రత్యేకత. సాధారణంగా ఏదైనా వైరస్ మన శరీరంలోకి ప్రవేశించాక రోగనిరోధక శక్తి అప్రమత్తమై దాన్ని నిర్వీర్యం చేసే యాంటీబాడీలను రూపొందిస్తుంది. కానీ, హ్యూమన్ ఇమ్యూనో వైరస్.. పోలీసుల కన్నా వేగంగా పరిగెత్తే దొంగలాగా.. మన రోగనిరోధక వ్యవస్థ దానికి యాంటీబాడీలను తయారుచేసేలోపే ఉత్పరివర్తనం చెందుతూ (మ్యుటేషన్) తన రూపును మార్చేసుకుంటుంది. అయితే.. హెచ్ఐవీ బారిన పడినవారిలో కేవలం 10-15 శాతం మందిలో దాన్ని నిర్వీర్యం చేయగలిగే 'బ్రాడ్‌లీ న్యూట్రలైజింగ్ యాంటీబాడీస్ (బ్నాబ్స్)' ఉత్పత్తి అవుతాయి. హెచ్ఐవీ ఎన్ని రూపాలు మార్చుకున్నా వాటి పని పట్టే యాంటీబాడీలు ఇవి. హెచ్ఐవీ సోకనివారిలో కూడా టీకా ద్వారా యాంటీబాడీలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పరిశోధకులు 1985 నుంచి కృషి చేస్తున్నారు. ఈ టీకా తయారీలో భాగంగా వారు హెచ్ఐవీ పైభాగం(ఔటర్ కోట్/ఎన్వలప్)లోని 'మెంబ్రేన్ ప్రాక్సిమల్ ఎక్స్‌టర్నల్ రీజియన్'ను లక్ష్యంగా చేసుకున్నారు. హెచ్ఐవీ ఎన్నిసార్లు ఉత్పరివర్తనం చెందినా.. ఆ వైరస్‌లో అస్సలు తేడా రాదు. ఆ భాగాన్ని టార్గెట్ చేసి తాము రూపొందించిన ఈ వ్యాక్సిన్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు స్ట్రెయిన్ల హ్యూమన్ ఇమ్యూనో వైరస్‌లను నిర్వీర్యం చేయగలదని వారు చెబుతున్నారు. హెచ్ఐవీలో అనేక ఉపజాతులు ఉన్నాయి. వాటిలో హెచ్ఐవీ-1 ప్రపంచమంతా విస్తరించగా.. హెచ్ఐవీ-2 రకం కేవలం పశ్చిమ ఆఫ్రికాలో మాత్రమే ఉంది. టీకా హెచ్ఐవీ-1లోని ఉపజాతులపై పనిచేస్తుందని రూపకర్తలు వెల్లడించారు. అయితే, దీనిపై మరిన్ని ప్రయోగాలు చేయాల్సి ఉందన్నారు.

ట్రయల్ ఇలా..

ఫేజ్ 1 క్లినికల్ ట్రయల్‌లో భాగంగా 2019లో 24 మందిని ఎంపిక చేసుకుని వారిలో నలుగురికి ప్లాసిబో (ఉత్తుత్తి మాత్రలు), మిగతావారికి టీకా నాలుగు డోసులు వేయాలని నిర్ణయించారు. కానీ, టీకా వేసుకున్నవారిలో మూడు డోసుల తర్వాత ఒకరికి అందులో ఉన్న 'పాలీఇథిలీన్ గ్లైకాల్ కట తీవ్రమైన ఎలర్జీ రావడంతో ట్రయల్స్‌ను నిలిపివేశారు. 24 మందిలో ఐదుగురికి 4 డోసులూ వేయగా.. 15 మందికి 2 డోసులే వేశారు. 2 డోసుల టీకా వేయించుకున్నవారిలో న్యూట్రలైజింగ్ యాంటీబాడీస్ ఉత్పత్తి అయినట్టు పరిశోధకులు గుర్తించారు.

-సెంట్రల్ డెస్క్

సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి, 30 మందికి గాయాలు



విమానంలో చెల్లాచెదురుగా పడిన వస్తువులు

బ్యాంకాక్, మే 21 : లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానానికి తీవ్రమైన కుదుపులు(టర్బులెన్స్) రావడంతో ఒక ప్రయాణికుడు మృతి చెందగా... 30 మంది గాయాలపాలయ్యారు. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి సింగపూర్ వెళ్తున్న ఎస్ క్యూ321 విమానం అండమాన్ సముద్రంపై 37వేల అడుగుల ఎత్తులో ఉండగా... కేవలం మూడు నిమిషాల్లోనే 31వేల అడుగులకు దిగిపోయింది. దీంతో, విమానాన్ని అత్యవసరంగా బ్యాంకాక్‌లోని సువర్ణభూమి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ బోయింగ్ 777-300ఈఆర్ విమానంలో 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు. మృతి చెందిన 73 ఏళ్ల బ్రిటీషు ప్రయాణికుడి కుటుంబానికి సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంతాపం తెలియజేసింది. వాతావరణ మార్పులు, రాడార్ నుంచి దీనికి సంబంధించి ఎటువంటి సూచనలు లేకపోవడంతో పైలెట్ ముందుగా ప్రయాణికులను హెచ్చరించలేకపోయినట్లు నిపుణులు చెబుతున్నారు. విమానంలో కుదుపుల ఘటనలు సాధారణమే అయినప్పటికీ ప్రయాణికులు మరణించిన ఘటనలు అత్యంత అరుదు. 1997 డిసెంబరులో యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టోక్యో నుంచి హోనొలులుకు వెళుతుండగా కుదుపులు చోటు చేసుకుని ఒక ప్రయాణికుడు మరణించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ ఇటువంటి అనుకోని కుదుపుల నుంచి విమాన ప్రయాణికులు క్షేమంగా ఉండేందుకు అన్ని వేళలా సీటుబెల్ట్ ధరించి ఉండాలని సూచిస్తోంది.

ఓ తల్లిని బలిగొన్న ట్రోలింగ్!

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చెన్నైలో ఓ ఏడేళ్ల బాలుడు రెండంతస్తుల భవనం బాల్కనీ నుంచి పడిన ఘటనలో సోషల్ మీడియాలో జరిగిన ట్రోలింగ్.. ఆ బాలుడి తల్లిని బలిగొంది. తల్లి నిర్లక్ష్యం వల్లే బాలుడు పడిపోయాడని నెటిజన్లు, చుట్టు పక్కల వాళ్ల సూటిపోటి మాటలనడంతో ఆ తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై శివారు ప్రాంతం తిరుముల్లైవాయిల్‌లోని ఓ ఫ్లాట్‌లో ఐటీ ఉద్యోగులు వెంకటేశ్, రంభ దంపతులు నివసిస్తున్నారు. వారికి 7 మాసాల పసిబిడ్డ ఉన్నాడు. నెల రోజుల క్రితం ఆ చిన్నారి ప్రమాదవశాత్తు ఇంటి బాల్కనీ నుంచి జారి కింది ఫ్లాట్ సన్‌షేడ్‌పై పడ్డాడు. ఇది గమనించిన స్థానిక యువకులు ఆ బిడ్డను కాపాడారు. ఈ దృశ్యాలు వైరలయ్యాయి. అయితే, తల్లి రంభ నిర్లక్ష్యం వల్లే చిన్నారి జారిపడ్డాడని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రంభ మానసికంగా కుంగిపోయింది. దీన్ని గమనించిన వెంకటేశ్ భార్యకు వైద్యులతో కౌన్సిలింగ్ కూడా ఇప్పించాడు. అయినా కోలుకోని రంభ.. ఇటీవల ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

బెయిల్‌కు ముందు పోలీస్ స్టేషన్‌లో

బర్గర్లు, పిజ్జాలు.. రాచమర్యాదలు!


పుణెలో మద్యం మత్తులో ఇద్దర్ని బలిగొన్న బాలుడికి వీఐపీ ట్రీట్‌మెంట్

ముంబై/పుణె, మే 21: పుణెలో ఓ బాలుడు (17) మద్యం మత్తులో లగ్జరీ కారును అతి వేగంగా నడిపి.. బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను బలిగొన్న ఘటన, రోడ్డు ప్రమాదాలపై 300 పదాల్లో వ్యాసం రాయమంటూ ఆ బాలుడికి 15 గంటల్లోనే స్థానిక కోర్టు బెయిల్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా.. పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లి పిజ్జాలు, బర్గర్లు తినిపించారని, రాచమర్యాదలు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిందితుడు బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొడుకు కావడంతో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొంచారన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పుణె పోలీసు కమిషనర్ అమితేష్ కుమార్ వివరణ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో నిందితుడికి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టు తేలితే సంబంధిత సిబ్బందిపై వేటు తప్పదని పేర్కొన్నారు. ఈ కేసులో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, హోం మంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఐపీసీ 304, 304(ఏ) సెక్షన్ల కింద నమోదు చేశామన్నారు. నిందితుడిని మేజర్‌గా పరిగణించేందుకు అనుమతి కోరగా కింది కోర్టు తిరస్కరించిందని, దీనిపై జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించామన్నారు. నిందితుడి రక్త పరీక్ష నివేదిక రావలసి ఉందన్నారు. అయితే ప్రమాదానికి ముందు నిందితుడు వెళ్లిన రెండు బార్లకు మంగళవారం పోలీసులు సీల్ వేశారు. నిందితుడి తండ్రి, ఆ బార్ల యజమానులు, మేనేజర్లు(మొత్తం ఏడుగుర్ని) అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 24 ఏళ్ల అనీశ్ అవధీయా, అశ్వనీ కోష్టా మధ్యప్రదేశ్‌కు చెందిన వారు. కాగా, నిందితుడైన బాలుడి తండ్రి అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. అతను ఎప్పుడూ వాడే కార్లను వివిధ మార్గాలవైపు పంపాడు. తాను మాత్రం స్నేహితుడి కారు తీసుకొని పారిపోయే ప్రయత్నం చేశాడు. కాని జీపీఎస్ ఆధారంగా పోలీసులు ఆ కారును గుర్తించారు.

గ్లోబల్ సిటీ సూచీలో.. హైదరాబాద్‌కు 564వ స్థానం

లండన్, మే 21: ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీ ఇండెక్స్-2024లో భారతీయ నగరాలు పేలవమైన ర్యాంకులను సాధించాయి. 163 దేశాలకు చెందిన వెయ్యి నగరాలకు ఎకనామిక్స్, హ్యూమన్ క్యాపిటల్, జీవన నాణ్యత, పర్యావరణం, గవర్నెన్స్ కేటగిరీల్లో ఇచ్చిన ర్యాంకులు మంగళవారం విడుదలయ్యాయి. గవర్నెన్స్ కేటగిరీలో జాబితాలోని భారతీయ నగరాలన్నింటికీ 380వ ర్యాంకు వచ్చింది. హైదరాబాద్ నగరం 564వ ర్యాంకును సాధించింది. కేటగిరీల వారీగా చూస్తే.. హైదరాబాద్ నగరం ఎకనామిక్స్‌లో 253, హ్యూమన్ క్యాపిటల్‌లో 524, జీవన నాణ్యతలో 882, పర్యావరణంలో 674, గవర్నెన్స్‌లో 380వ స్థానాల్లో నిలిచింది. ఎకనామిక్స్‌లో దేశ ఆర్థిక రాజధాని ముంబై(గ్లోబల్ ర్యాంకు-427)ని ఢిల్లీ అధిగమించింది. ఎకనామిక్స్‌లో ఢిల్లీకి 51, ముంబైకి 126.. హ్యూమన్ క్యాపిటల్‌లో వరుసగా 51, 126 ర్యాంకులను సాధించాయి. పర్యావరణంలో ఢిల్లీ పేలవమైన ర్యాంకు(973)ను పొందింది. ఈ జాబితాలో చిట్టచివరి స్థానాన్ని(1000వ ర్యాంకు) ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ సాధించింది.

లోకం తీరు



కాళీయ మర్ధనుడిగా నారసింహుడు

» వైభవంగా యాదగిరీశుడి జయంత్యుత్సవాలు



కాళీయ మర్దనుడి అలంకరణలో నరసింహ స్వామిని ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు, అధికారులు

భువనగిరి అర్బన్, మే 21: యాదగిరిక్షేత్రంలో కాళీయమర్ధనుడి అలంకారంలో నర్సింహుడు భక్తులకు దర్శనమిచ్చాడు. మంగళవారం రెండో రోజు నృసింహ జయంతి వైదిక పర్వాలు వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులకు వివిధ రకాల పుష్పాలతో ఆచార్యులు లక్షపుష్పార్చన పూజలు నిర్వహించారు. అలంకార సేవల్లో భాగంగా స్వామిని కాళీయమర్ధనుడిగా అలంకరించారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని క్షేత్రపాలకుడు హనుమంత వాహనంపై శ్రీరాముడిగా దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధుల్లో విహరింపజేశారు. పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో నారసింహుడి జయంతి మహోత్సవాల్లో భాగంగా స్నపన తిరుమంజనాలు, లక్షపుష్పార్చనలు, యాగశాలలో నిత్య హవన పూజలు వైభవంగా జరిగాయి.

విత్తనాల కోసం రైతుల వెతలు!

» ఎండకు తాళలేక క్యూలో పాస్ పుస్తకాలు



రైతులు క్యూలో ఉంచిన పట్టాదారు పాసుపుస్తకాలు

జోగిపేట, మే 21: పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గంలో మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయానికి భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఎండ ఎక్కువగా ఉండటంతో పాస్‌పుస్తకాలను క్యూలో ఉంచారు. జోగిపేట వ్యవసాయ శాఖ డివిజన్ పరిధికి 650 క్వింటాళ్ల జీలుగు, 80 క్వింటాళ్ల జనుము కేటాయించారు. కానీ, కేవలం 138 క్వింటాళ్ల జీలుగ, 40 క్వింటాళ్ల జనుము విత్తనాలు మాత్రమే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చాయి. దీంతో ఉదయం వచ్చిన రైతులకు వాటిని పంపిణీ చేశారు. ఆ తర్వాత కూడా పెద్ద ఎత్తున రైతులు క్యూ కట్టారు. ఎండకు తాళలేక తమ వెంట తెచ్చుకున్న పట్టాదారు పాస్ పుస్తకాలను, వాటి జిరాక్స్ కాపీలను క్యూలో ఉంచి నీడలో నిలబడ్డారు. విసుగెత్తిన రైతులు అధికారులను నిలదీశారు. దీంతో బుధవారం మిగిలిన రైతులకు విత్తనాలు సరఫరా చేస్తామని, టోకెన్లు తీసుకెళ్లాలని ఏడీఏ అరుణ వారికి సూచించారు.

మృత్యువు మీద పడింది

» భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

» చికిత్సకు వచ్చినప్పుడు దుర్ఘటన



రవీందర్ గుప్తా, సరళాదేవి దంపతులు (ఫైల్)

తిరుమలగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో విషాద ఘటన చోటుచేసుకుంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన ఉపాధ్యాయ దంపతుల్లో భర్తను చెట్టు రూపంలో మృత్యువు కబళించింది. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంజాపురం రవీందర్(54), సరళాదేవి భార్యాభర్తలు. సిద్దిపేటకు చెందిన వీరు తూంకుంటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడబిడ్డలున్నారు. సరళాదేవి 2018నుంచి బొల్లారంలోని త్రిశూల్ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం ఇంజెక్షన్ తీసుకోవడానికి భర్త రవీందర్‌తో కలిసి స్కూటర్‌పై ఆస్పత్రికి వచ్చారు. పార్కింగ్ ప్రదేశం వద్దకు వెళ్తుండగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న భారీ వృక్షం కూలి వారిపై పడింది. దీంతో రవీందర్ మృతిచెందగా సరళాదేవి తలకు తీవ్ర గాయమైంది. కాలు విరిగింది. ఆస్పత్రి సిబ్బంది, కంటోన్మెంట్ సిబ్బంది చెట్టును తొలగించి ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. ఆమెను, రవీందర్ మృతదేహాన్ని ఒకే అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. అయితే భర్త చనిపోయిన విషయం ఆమెకు తెలియదు. కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచారు. ఆమె పనిచేస్తున్న పాఠశాలకు కొద్ది దూరంలోనే ఈ ఆస్పత్రి ఉంది. లోబీపీ, మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న ఆమె చికిత్సకు ఈ ఆస్పత్రికే వస్తుంటారని సహోద్యోగులు తెలిపారు. చెట్టు సుమారు 30 ఏళ్ల నాటిదని, కూలుతుందని గమనించలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. బొల్లారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూలీలపై పడ్డ మట్టిపెళ్లలు

» ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు



రాజవ్వ (ఫైల్)

కోనరావుపేట, మే 21: ఉపాధి కూలీలపై మట్టి పెళ్లలు విరిగిపడి ఒకరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో జరిగింది. వెంకట్రావుపేటలోని ఊర చెరువులో మంగళవారం కూలీలు మట్టి తీస్తున్నారు. ఎండ వేడికి తాళలేక మట్టి తీసిన ప్రాంతంలో నీడ ఉండడంతో సేద తీరేందుకు అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా పైనుంచి మట్టి పెళ్లలు కూలడంతో ఏడుగురు కూలీలు కూరుకుపోయారు. పక్కనే ఉన్న కూలీలు వారిని బయటకు తీశారు. మారుపాక రాజవ్వ(50) అనే కూలీ అప్పటికే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన మరో ఆరుగురిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యులతోపాటు గాయపడినవారిని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పరామర్శించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

» ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురి దుర్మరణం

వరంగల్‌సిటీ, బయ్యారం మే 21: ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు, ఈత నేర్చుకునేందుకు వెళ్లి మరో బాలుడు మృతి చెందిన ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్నాయి. వరంగల్ దేశాయిపేటకు చెందిన జన్ను విజయ్ అలియాస్ ఏసు(38), జన్ను ఆదాం(34) పెయింటర్లు. వీరి కుటుంబాలు ఇరుగు పొరుగున ఉంటాయి. విజయ్, ఆదాంలు మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండడంతో వారి పిల్లలతో కలిసి ఈత కొట్టేందుకు సమీపంలో ఉన్న మునసలమ్మకుంట వద్దకు చేరుకున్నారు. కుంటలో దిగి ఈత కొడుతుండగా విజయ్, ఆదాం బురద గుంతలో చిక్కుకుని ఎంతకీ పైకి తేలలేదు. గట్టుపైనున్న వారి పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు చేరుకొని వారిని వెలికితీయగా అప్పటికే మృతిచెందారు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జినుక లక్ష్మీనారాయణ, రేణుకల కుమారుడు గౌతమ్(14).. తమ ఇంటి సమీపంలోని దామరచెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. లోతుగా ఉన్న ప్రాంతంలో నీటిలో మునిగి మృతి చెందాడు.

మానేరులో ఇసుక తవ్వకాలు తప్పు

పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు.. సంచలన తీర్పు వెలువరించిన చెన్నై ఎన్జీటీ కోర్టు

» మైనింగ్, ఇరిగేషన్ శాఖలకు రూ.25 కోట్ల చొప్పున జరిమానా

» గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెల్లించాలని ఆదేశం

» ఫలించిన మానేరు పరిరక్షణ సమితి పోరాటం



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి వద్ద లారీలో మానేరు నది ఇసుక లోడింగ్(ఫైల్)

పెద్దపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మానేరు నదిలో ఇసుక తవ్వకాలపై చెన్నై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ సౌత్ బెంచ్ సంచలన తీర్పునిచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడం తప్పు అని స్పష్టం చేసింది. ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కొనసాగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మైనింగ్, ఇరిగేషన్ శాఖలకు రూ.25 కోట్ల చొప్పున జరిమానా విధించింది. ఈ జరిమానాను మూడు నెలల్లోగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెల్లించాలని ఆదేశించింది. పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ జిల్లాల మీదుగా ప్రవహిస్తున్న మానేరు నదిలో ఇసుక తవ్వకాలు జరపడం చట్ట విరుద్ధమని, పర్యావరణ విధ్వంసానికి కారణమవుతుందని, పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారంటూ మానేరు పరిరక్షణ సమితికి చెందిన వారితోపాటు ఇతరులు మొత్తం ఐదు పిటిషన్లను ఎన్జీటీలో దాఖలు చేశారు. వీటిపై విచారించిన నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ చెన్నై సౌత్ బెంచ్ మూడు నెలల క్రితమే తీర్పును రిజర్వు చేసింది. మంగళవారం ఆ తీర్పును వెలువరించింది. కాగా, మానేరు నదిపై నిర్మిస్తున్న చెక్ డ్యాముల్లో ఇసుక నిల్వలు ఉన్నాయని, వాటిని తొలగించాల్సి ఉంటుందని సంబంధిత అధికారుల కమిటీ గత ప్రభుత్వ హయాంలో నివేదిక సమర్పించింది. పెద్దపల్లి జిల్లాలో 25 ఇసుక రీచులను గుర్తించారు. ఈ రీచుల్లో రెండు మీటర్ల లోతు వరకు 1,32,67,620 క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడేందుకు 2022 జనవరి 11న టీఎస్ఎండీసీ టెండర్లను ఆహ్వానించింది. పలువురు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ఇసుక రీచులను దక్కించుకోగా 2023 డిసెంబరు నెలాఖరు వరకు ఇసుక తవ్వకాలకు డిస్ట్రిక్ట్ లెవల్ శాండ్ కమిటీ(డీఎల్ఎస్సీ) అనుమతి ఇచ్చింది. ఆ మేరకు గడువు పూర్తయిన తర్వాత కూడా డంపుల్లో ఉన్న ఇసుకను తరలించారు. కరీంనగర్, జయశంకర్ భూపాపల్లి జిల్లాల్లోనూ క్వారీలను గుర్తించి ఇసుక తవ్వకాలు చేపట్టారు.

క్వారీలను రద్దు చేయాలని కోరినా..

ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, ఓవర్ లోడ్‌తో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, దుమ్ము, ధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇసుక లారీలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, క్వారీలను రద్దు చేయాలని మానేరు పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. అప్పటి ప్రభుత్వానికి పలుసార్లు మొరపెట్టుకున్నా వినకపోవడంతో మానేరు పరిరక్షణ సమితికి చెందిన సభ్యులతో పాటు కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు చెన్నై ఎన్జీటీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు పర్యావరణ అనుమతులపై పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించినప్పటికీ ఇందుకు సంబంధించిన ఆధారాలను మాత్రం ప్రవేశపెట్టలేదు. గతంలోనే మానేరు ఇసుక తరలింపును నిలిపివేయాలని ఎన్జీటీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ గత ప్రభుత్వం ఇసుక మాఫియాకు అనుకూలంగా వ్యవహరించి తవ్వకాలకు సానుకూలంగా వ్యవహరించింది. దీనిపై తాజాగా తీర్పు వెలువరించిన కోర్టు.. మానేరులో ఇసుక తవ్వకాలను నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. అమలు నివేదికను సమర్పించేందుకు ఈ కేసు విచారణను సెప్టెంబరు 23కు వాయిదా వేసింది.

అర్ధరాత్రి నడిరోడ్డుపై ప్రయాణికులను బస్సులో వదిలేసి డ్రైవర్ జంప్

» పిల్లాపాపలతో రాత్రంతా రోడ్డుపైనే ప్రయాణికులు

» గోవాలో ఇంటర్వ్యూకు చేరుకోలేకపోయిన నిరుద్యోగి

రామచంద్రాపురం, మే 21: ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ నిర్వాకంతో పిల్లాపాపలతో ప్రయాణికులు రాత్రంతా రోడ్డుపై జాగరణ చేయాల్సి వచ్చింది. ఓ నిరుద్యోగి ఇంటర్వ్యూకు హాజరుకాలేకపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ నుంచి గోవాకు వెళ్లే ఓంశ్రీ ట్రావెల్ బస్సులో పలువురు సీట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. ఈ బస్సు పలు కూడళ్ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవాల్సి ఉండగా.. బస్సు డ్రైవర్ ప్రయాణికులకు ఫోన్ చేసి అందరిని మియాపూర్‌కు రావాలని చెప్పి ఫోన్‌కట్ చేశాడు. తిరిగి ప్రయాణికులు ఫోన్ చేసినా స్పందించలేదు. దాంతో ప్రయాణికులు ఎలాగోలా డ్రైవర్ చెప్పిన సమయానికి మియాపూర్‌కు వచ్చారు. అయినా బస్సు అక్కడ లేదు. గంటసేపు ఎదురు చూసిన తర్వాత బస్సు వచ్చింది. అప్పటికే ఆలస్యం కావడం, రావాల్సిన స్టాప్ దగ్గరికి రాకపోవడం, దానికి తోడు బస్సులో సదుపాయాలు సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు డ్రైవర్‌ను ప్రశ్నించారు. అతడు దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు ధూమపానం చేస్తూ ప్రయాణికులపైకి పొగ ఊదాడు. ఆగ్రహానికి గురైన ప్రయాణికులు అతడితో గొడవ పడ్డారు. దాంతో ప్రయాణం మొదలయ్యాక అర్ధరాత్రివేళ రామచంద్రాపురం పట్టణం ఆశోక్‌నగర్ వద్ద 65వ జాతీయ రహదారిపై బస్సును నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. దాంతో బస్సులోని ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాత్రంతా పిల్లలతో రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. బస్సులో మొత్తం 24 మంది ఉండగా కొంతమంది అందుబాటులోని వాహనాల ద్వారా తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే డ్రైవర్ నిర్వాకం కారణంగా చరణ్‌వర్మ అనే నిరుద్యోగి ఇండియన్ కోస్ట్ గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగం కోసం మంగళవారం గోవాలో ఇంటర్వ్యూకు వెళ్లాల్సి ఉండగా వెళ్లలేకపోయాడు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్‌తో పాటు యాజమాని కూడా పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. బస్సును పోలీసు స్టేషనుకు తరలించారు.

ఎంజీఎంలో నిలిచిన విద్యుత్ సరఫరా

» 6 గంటల పాటు రోగుల అవస్థలు

వరంగల్ మెడికల్, మే 21: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం సుమారు ఆరు గంటలకుపైగా విద్యుత్ సరాఫరా నిలిచిపోడంతో రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. సాయంత్రం 4.30 గంటలకు పోయిన కరెంటు.. రాత్రి 9.30 గంటలకు వచ్చింది. వార్డుల్లో కరెంట్ లేకపోవడంతో వేసవి ఉక్కపోతకు రోగులు ఇబ్బంది పడ్డారు. ఎమర్జెన్సీ వార్డులకు ఆస్పత్రిలోని జనరేటర్ల ద్వారా కరెంటు అందించారు. గతంలోనూ ఇలాగే జరిగినా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలేదని, వచ్చే వర్షకాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇన్‌స్టా రీల్‌తో ఎర.. 33 లక్షల దోపిడీ!

స్టాక్ మార్కెట్‌లో లాభాల పేరుతో కేటుగాళ్ల వల.. లింక్ పంపి యాప్ డౌన్‌లోడ్ చేయించిన వైనం

» నెలలో 30 లక్షల లాభం చూపించి.. భారీ పెట్టుబడి పెట్టించి మోసం

» సైబర్ క్రైంకు బాధితుడి ఫిర్యాదు



హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): అతనో ప్రైవేటు ఉద్యోగి. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుంటే స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన రీల్ ఒకటి కనిపించింది. వెయ్యి శాతం కచ్చితమైన లాభాలు వచ్చేలా స్టాక్ మార్కెట్‌లో ఎలా పెట్టుబడులు పెట్టాలో ఆ రీల్‌లో చూపించారు. దాంతో అతను అక్కడి లింక్‌ను క్లిక్ చేశాడు. అంతే.. గుర్తు తెలియని వ్యక్తులు పెట్టుబడులు అతని నుంచి నెల రోజుల్లో రూ.33.26 లక్షలు దోచేశారు. మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. గుర్తుతెలియని వ్యక్తులు బాధితుడిని మొదట వాన్‌గార్డు ఇన్వెస్ట్‌మెంట్ క్లబ్ (141)లో చేర్చారు. అందులో 220 మంది వరకు ఉన్నారు. 'యాప్.వైస్పాయి.కామ్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఒక లింక్ పంపారు. ముందు తక్కువ పెట్టుబడులు పెట్టించి ఆ యాప్ ద్వారానే షేర్లు కొనిపించేవారు. మొదట్లో 7 నుంచి 50 శాతం వరకు లాభాలు పెరిగినట్టు చూపించేవారు. మొదట తక్కువ సొమ్ము కావడంతో లాభాలను విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఒక్కరోజే 15 స్టాక్స్‌లో రూ.25 వేలు పెట్టుబడి పెట్టించారు. 15 రోజుల్లోనే రూ.10 లక్షల లాభం వచ్చినట్టు, మరో 15 రోజుల్లో ఆ లాభాలు రూ.30 లక్షలకు పెరిగినట్టు చూపించారు. తర్వాత ఐపీవో షేర్లు కొంటే రూ.కోట్లలో లాభాలు వస్తాయని నమ్మించారు. విన్‌సోల్ ఇంజనీర్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.54 లక్షల విలువైన ఐపీవో షేర్లు తీసుకోవాలని సూచించారు. దాంతో వారి వద్ద ఉన్న తన సొమ్ము రూ.30 లక్షలతో షేర్లు కొనాలని బాధితుడు కోరాడు. అందుకు వారు నిరాకరించారు. కచ్చితంగా రూ.54 లక్షలు పెట్టి కొనాల్సిందేనని, మిగతా రూ.24 లక్షలు చెల్లించాలని పట్టుబట్టారు. దాంతో బాధితుడు ఆ రూ.30 లక్షలు వదులుకోలేక.. అప్పు చేసి, బంగారం, ప్లాట్స్ తాకట్టు పెట్టి రూ.24 లక్షలు చెల్లించాడు. ఆపై షేర్లు ఒక్కసారిగా 404 శాతం పెరిగాయని, మొత్తం రాబడి రూ.2 కోట్లు దాటిందని చూపించారు. చివరిగా నేషనల్ ఆక్సిజన్ లిమిటెడ్ బ్లాక్ ట్రేడింగ్‌లో పాల్గొనాలని, రూ.4 కోట్ల వరకు లాభాలు వస్తాయని నమ్మించారు. తన వద్ద అంత సొమ్ము లేదని, వారి వద్ద ఉన్న తన సొమ్ముకు సరిపడా షేర్లు కేటాయించి, వచ్చిన లాభాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరాడు. పెట్టుబడి పెట్టకపోతే ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు జరిమానా కింద రూ.24 లక్షలు చెల్లించాలని బెదిరించారు. దాంతో బాధితుడు మరికొంత డబ్బు చెల్లించాడు. అప్పటికే అతను నెల రోజుల్లో చెల్లించిన సొమ్ము రూ.33.26 లక్షలు అయింది. లాభాల సంగతి దేవుడెరుగు అతని అసలు సొమ్మును కూడా కేటుగాళ్లు దోచేశారు.



కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు కన్నుమూత

» అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి



కొవ్వూరు, మే 21: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమీందార్ పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)(71) కన్నుమూశారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ది ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణ రంగారావు, అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడవ సంతానం. 1953 మే 31వ తేదీన ఆయన జన్మించారు. భార్య నాగమణి కొన్నేళ్ల క్రితం మరణించారు. కాగా కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు(ఎండీ, విభాస్ పోలిమర్స్), కుమార్తె అర్చన ఉన్నారు. అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా కొనసాగుతున్నారు. ఎన్టీఆర్ పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణబాబు కొవ్వూరు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో ఓటమిపాలైనా 2004లో విజయం సాధించారు. 2012లో వైసీపీలో చేరిన ఆయన ఆ పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు.

చంద్రబాబు సంతాపం

కృష్ణబాబు మృతి పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు సంతాపం తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు విశేష సేవలు అందించారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మరోసారి.. మరచిపోయి..

» అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మతిమరపు పాట్లు

» కరోనా వచ్చినప్పుడు ఉపాధ్యక్షుడిగా ఉన్నట్టు వ్యాఖ్య



న్యూయార్క్, మే 21: వయసు పైబడడం వల్లనో ఏమో.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) మరోసారి తన 'మతిమరపు'తో వార్తల్లోకెక్కారు! కొవిడ్ సమయంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా.. తాను ఉపాధ్యక్షుడిగా ఉన్నామంటూ ఏదేదో మాట్లాడేసి అభాసుపాలయ్యారు. "కరోనా మహమ్మారి విజృంభించిన ఆ రోజులు ఎంతో చెడ్డవి. అప్పట్లో నేను ఉపాధ్యక్షుడిగా ఉన్నాను. అధ్యక్షుడు బరాక్ ఒబామా నన్ను డెట్రాయిట్‌కు వెళ్లి సహాయం చేయమన్నారు" అని ఆయన వ్యాఖ్యానించడం వైరల్ అయ్యింది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని చుట్టుముట్టే సమయానికి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్, ఉపాధ్యక్షుడిగా మైక్ పెన్స్ ఉన్న సంగతి తెలిసిందే. అమెరికా వైస్‌ప్రెసిడెంట్‌గా బైడెన్ 2009 జనవరి నుంచి 2017 జనవరి దాకా ఉన్నారు. మతిమరపు కారణంగా ఆయన కరోనా గురించి ప్రస్తావించినప్పటికీ.. ఆయన అసలు ఉద్దేశం 2011 నాటికి సంక్షోభంలో ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ గురించి అయి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బైడెన్ ఇలాగే పొరపాటున.. పాలస్తీనా ఉగ్రవాద గ్రూపు 'హమాస్'ను ప్రతిపక్షంగా పేర్కొని నవ్వులపాలయ్యారు. మరో సందర్భంలో.. తాను అమెరికా అధ్యక్షుడు కాగానే ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు ఫ్రాన్సో మిటరాండ్‌ను కలిసినట్టు చెప్పారు. కానీ, ఆయన 1996లోనే మరణించడం గమనార్హం. ఇంకో సందర్భంలో.. ఇరాక్‌తో యుద్ధంలో పుతిన్ ఓడిపోతున్నట్టు వ్యాఖ్యానించారు. ఇవే కాదు.. తన పెద్ద కుమారుడు చనిపోయిన తేదీ కూడా ఆయనకు గుర్తు లేదని రాబర్ట్ హర్ అనే ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు.

మనీష్ సిసోడియా కస్టడీ 31 వరకు పొడిగింపు

» ప్రత్యేక కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 21: ఢిల్లీ ఎక్సయిజ్ విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆప్ నాయకుడు మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 31 వరకు పొడిగిస్తూ రౌజ్ అవెన్యూలోని ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను కూడా అదే రోజున చేపట్టనున్నట్టు తెలిపింది. సిసోడియా ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మద్యం విధానంలో అవినీతికి పాల్పడ్డారంటూ సీబీఐ, మనీలాండరింగ్ చేశారంటూ ఈడీ వేర్వేరుగా కేసులు పెట్టాయి. ఈ కేసుల్లో ఆయన గతేడాది ఫిబ్రవరి నుంచి జైలులో ఉన్నారు. కాగా, తనపై నమోదైన అన్ని కేసుల్లోనూ బెయిల్ ఇవ్వాలంటూ సిసోడియా చేసిన వినతిని మంగళవారం హైకోర్టు నిరాకరించింది. అయితే అనారోగ్యంతో బాధపడుతున్న భార్య సీమాను వారానికి ఒకసారి పరామర్శించేందుకు మాత్రం అనుమతి ఇచ్చింది. ట్రయల్ కోర్టుకు పత్రాలు సమర్పించడంలోను, చార్జిషీటు దాఖలు చేయడంలోనూ ప్రాసిక్యూషన్ ఎలాంటి జాప్యం చేయలేదని హైకోర్టు అభిప్రాయపడింది.

nqa. ISO 9001 Registered

జాతీయ బుద్ధిమాంద్యుల (దివ్యాంగజన్) సాధికారిక సంస్థ
పూర్వం జాతీయ మానసిక దివ్యాంగుల సంస్థ
దివ్యాంగుల (దివ్యాంగజన్) సాధికారత శాఖ
(సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
(ఒక ISO 9001:2015 సంస్థ)
మనోవికాస్‌నగర్, సికింద్రాబాద్-500009
టెలి నం.:27751741-745; ఫ్యాక్స్ నం.040-27750198; వెబ్‌సైట్: www.niepid.nic.in

అడ్మిషన్ ప్రకటన 2024-25

NIEPID మరియు దాని ప్రాంతీయ కేంద్రాలు/సంయుక్త ప్రాంతీయ కేంద్రాలు 2024-25 విద్యా సంవత్సరానికి స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా, UG మరియు PG కోర్సుల కొరకు దరఖాస్తులను కోరుచున్నారు. NIEPID సికింద్రాబాద్, రీజినల్ సెంటర్ (ఆర్‌సి), నవీ ముంబై, నోయిడా, కోల్‌కతా, కాంపోజిట్ రీజినల్ సెంటర్ (సిఆర్‌సి) దావణగిరి, రాజనంద్‌గావ్ మరియు నెల్లూరు వద్ద కోర్సులు అందించబడతాయి.

దిగువ కోర్సులు ఇక్కడ అందించబడతాయి:

NIEPID సికింద్రాబాద్	:D.Ed. SE (IDD), DECSE (ID), DVR (ID), B.Ed. SE (ID), M.Ed. SE (ID), PGDEI, M.Phil రిహాబిలిటేషన్ సైకాలజీలో.
ఆర్‌సి, నోయిడా	: D.Ed. SE (IDD)
ఆర్‌సి, కోల్‌కతా	: M.Ed. SE (ID), B.Ed. SE (ID), D.Ed. SE (IDD), DVR (ID)
ఆర్‌సి, నవీ ముంబై	: M.Ed. SE (ID), B.Ed. SE (ID), D.Ed. SE (IDD), DECSE (ID), DVR (ID)
సిఆర్‌సి, దావణగిరి	: D.Ed. SE (IDD), D.Ed. SE (HI)
సిఆర్‌సి, రాజనంద్‌గావ్	: D.Ed. SE (IDD)
సిఆర్‌సి, నెల్లూరు	: D.Ed. SE (HI)

సవివర ప్రకటన, అప్లికేషన్-కమ్-ప్రాస్పెక్టస్, అర్హత ప్రమాణాలు, ఫీజు వివరాలు మరియు తేదిల కొరకు మా వెబ్‌సైట్ www.niepid.nic.in ను సందర్శించండి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అందరూ నేరస్థులే!

మహారాష్ట్రలోని పూణేలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోరాన్ని రోడ్డుప్రమాదంగా కాక, హత్యగా పేర్కొనడం సముచితంగా ఉంటుంది. ఖరీదైన లగ్జరీ కారును మద్యం మత్తులో రెండు వందలయాభై కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఒక మైనర్ బాలుడు చేసిన ఈ అకృత్యానికి ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దుర్మరణం పాలైనారు. హత్యాకాండకు అతడు ఒక్కడే బాధ్యుడు కాదు. పిల్లవాడికి రెండుకోట్ల ఖరీదైన కారిచ్చి, నచ్చినట్టుగా నడుపుకోమన్న తండ్రితో పాటు అనేకమంది వ్యక్తులు, వ్యవస్థలు ఈ పాపంలో భాగస్వాములు. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేట్టు చేయాల్సినవారు నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా వ్యవహరించి ఈ హత్యలో సూత్రధారులైనారు.

పద్దెనిమిదేళ్ళ యువకుడు కావడానికి ఇంకా నాలుగునెలలు ఉన్నదంటూ జువెనైల్ బోర్డు రియలెస్టేట్ వ్యాపారి విశాల్ అగర్వాల్ పుత్రరత్నానికి వెంటనే బెయిల్ ఇచ్చింది. ఇద్దర్ని చంపినా, పిల్లవాడు కనుక పక్షంరోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలసిపనిచేయడం, మూడు వందల పదాల్లో ఓ వ్యాసం రాయడం వంటివి షరతులుగా విధించడం సమాజాన్ని ఆగ్రహానికి గురిచేశాయి. జూనియర్ అగర్వాల్‌ను అంతా కలిసికాపాడుతున్నారన్న విమర్శలు అధికమై, వ్యవహారం రాజకీయరంగు కూడా పులుముకోవడంతో పోలీసులు అయిష్టంగానైనా లోతుల్లోకి పోక తప్పలేదు. నిందితుడిని మేజర్‌గా పరిగణించాలని విన్నవించామనీ, బోర్డు అంగీకరించలేదని పోలీసులు అంటున్నారు కానీ, బెయిల్ వచ్చేలోగా ఆ కుర్రవాడికి వారు చేసిన రాచమర్యాదలు చూసినప్పుడు అది నమ్మశక్యంగా అనిపించడం లేదు.

పూణే వీధుల్లో ఈ ఖరీదైన కారు రిజిస్ట్రేషన్ కాకుండా మార్చినుంచి తిరుగుతోంది. నలభైఐదులక్షల రిజిస్ట్రేషన్ ఫీజు కట్టకుండా, నెంబరు ప్లేటు తీసుకోకుండా దానిని వాడుతున్నారు. మైనర్ కనుక ఆ బాలుడికి కారు డ్రైవింగ్ లైసెన్సు కూడా వచ్చి ఉండదు. అయినా, ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు చూసీచూడనట్టు ఇన్నాళ్ళూ వదిలేశారు. ఇక, ఆ పిల్లవాడికీ, దాదాపు అదే వయసులో ఉన్న అతడి మిత్రబృందానికీ నిత్యం మద్యం అందించే రెండు బార్ల యజమానులూ ఈ పాపంలో భాగస్వాములే. మహారాష్ట్రలో పాతికేళ్ళు వచ్చేవరకూ మద్యం ముట్టరాదని అక్కడి చట్టం చెబుతోంది. కుర్రాడు కొత్త కారులో పోయి, మద్యం సేవించివస్తాడని తండ్రికే తెలిసినప్పుడు, పోలీసులకు ఇంతవరకూ చిక్కకుండా ఉంటాడా? మద్యం, లైసెన్సు, రిజిస్ట్రేషన్, అమిత వేగం ఇత్యాది విషయాల్లో అతడికి ఈ పాటికే చాలా మినహాయింపులు దక్కివుంటాయి. కఠిన శిక్షలు సామాన్యులకే కానీ, ధనికులు దండనకు అతీతులు.

రెండు కుటుంబాలవారికి తీవ్ర విషాదాన్ని మిగల్చి, భవిష్యత్తును చీకటిమయం చేసిన ఈ ఘటన సమాజాన్ని కుదిపేసింది. ప్రతీ ఏటా వందలమంది రోడ్డుప్రమాదాల్లో ఈ దేశంలో కన్నుమూస్తున్నారు. వాటిలో అత్యధికం నివారించదగ్గవే. మానవ తప్పిదంతో పాటు, నిర్మాణంలో లోపాలు, నిర్వహణలో లోటుపాట్లు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కానీ, పూణే ఘటన యాక్సిడెంట్ కాదని, ధనబలం, నిర్లక్ష్యం, సాటి మనుషుల ప్రాణాలపట్ల లెక్కలేనితనం ఈ ఘటనకు దోహదం చేశాయని అందరికీ తెలుసు. కేవలం మైనర్ అన్నవాదనతో ఆ కుర్రవాడిని ఒడ్డునపడేయడానికి వ్యవస్థలన్నీ అంతగా ఎందుకు కష్టపడ్డాయో కూడా తెలుసు. ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ చాలా హామీలు ఇస్తున్నారు. నిందితుడిని మేజర్‌గా పరిగణించాల్సిందిగా సెషన్స్ కోర్టును కోరబోతున్నారట. బార్లు రెండూ మూతబడ్డాయి, వాటి యజమానులు, మేనేజర్లను అరెస్టుచేశారు. సినిమా ఫక్కీలో వెంటాడి మరీ నిందితుడి తండ్రిని సైతం అరెస్టుచేశారు. పోలీసులు నిందితుడినుంచి ఎప్పుడు సాంపిల్ తీసుకున్నారో తెలియదు కానీ, రక్తపరీక్షలో మద్యం ఛాయలు ఉండటం ఈ కేసులో ముఖ్యమైన అంశం. జువనైల్ జస్టిస్ బోర్డుముందు తాను మద్యానికి బానిసనంటూ నిందితుడు ఒప్పుకున్నాడని, తన భౌతికస్థితి, తాను ప్రయాణిస్తున్నవేగం ఎదుటివారి మరణానికి దారితీస్తాయన్న స్పృహ అతడికి ఉన్నదన్న వాదనతో ఈ కేసును రుజువుచేస్తామని పోలీసులు అంటున్నారు. అలాగే, కుమారుడి కార్యకలాపాలు, చర్యలమీద తండ్రికి పూర్తి అవగాహన ఉందనీ, అతడి అనుమతి లేదా ప్రోద్బలంతోనే పిల్లవాడు ఈ వరుస తప్పిదాలకు పాల్పడ్డాడని రుజువు చేయాల్సివుంటుంది. పిల్లవాడికి ఓ ఖరీదైన కారు ఇచ్చి, తాగినడుపుకోవడానికి అనుమతించిన తండ్రిని కఠినంగా శిక్షించగలిగితే ఓ బలమైన హెచ్చరిక అవుతుంది. ఇద్దరు అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న ఈ ఘటనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారకులైనవారందరికీ శిక్షలు పడటం అవసరం.

బీజేపీ మనోరథం ఫలించేనా?





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'నేను పన్నెండేళ్ల క్రితం రాహుల్ మాట్లాడిన ఒక వీడియోను చూశాను. ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తామని ఆయన ఈ వీడియోలో చెప్పారు. దేశ వనరుల్లో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ ఒకే రకంగా మాట్లాడారు. అతి పురాతనమైన కాంగ్రెస్ పార్టీ ముస్లిం లీగ్ ఆలోచనా విధానంతో ఇప్పటికీ ఏకీభవించే మతతత్వ పార్టీ అని రుజువైంది" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం నాడు పశ్చిమ బెంగాల్‌లో ఒక సభలో ఆరోపించారు. ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ పూర్తయిన తర్వాతి నుంచీ ప్రధానమంత్రి కాంగ్రెస్‌ను హిందువులకు వ్యతిరేక పార్టీగా చిత్రించేందుకు సర్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల ఆస్తులను కాంగ్రెస్ లాక్కొని దేశంలో ఎక్కువ మంది పిల్లలున్న వారికి, చొరబాటుదారులకు అప్పగిస్తుందన్నారు. ఏప్రిల్ 26న రెండో దశ పోలింగ్ తర్వాత మోదీ స్వరం మరింత తీవ్రంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఓబీసీ రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు ఇస్తారని ప్రకటించారు. అయోధ్యలో రామమందిరానికి బాబ్రీ తాళం వేస్తారని కూడా ఆరోపించారు. రామమందిరాన్ని కాంగ్రెస్ బుల్డోజర్లతో కూల్చేస్తుందని అనేంత వరకూ ఆయన వెళ్లారు. ఒకవైపు తన బాల్యం ముస్లిం సమాజానికి చెందిన వారితోనే గడిచిందని, రంజాన్ మాసంలో గాజాపై బాంబు దాడులు ఆపాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను అభ్యర్థించానని చెబుతూనే మతపరమైన విభజనకు ఆస్కారం ఉన్న చోట్ల కాంగ్రెస్‌ను ముస్లింల అనుకూల పార్టీగా చిత్రించడంలో నరేంద్రమోదీ వెనుకాడలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసే వ్యాఖ్యల పట్ల ఆయనను వ్యక్తిగతంగా నిందించడంలో అర్థం లేదు. ఆయన మొత్తం భారతీయ జనతా పార్టీ, సంఘ్ పరివార్ సిద్ధాంతానికి అనుగుణంగానే మాట్లాడుతున్నారు. భారతీయ రాజకీయ యవనికపై హిందూ జాతీయవాదం 1980లలోనే ప్రబలంగా ఆవిష్కృతమైంది. రామజన్మ భూమి ఉద్యమం తర్వాత అది మరింత ఊపందుకుంది. 1990లో లాల్‌కృష్ణ అడ్వాణీ రథయాత్ర జరిపినప్పుడు అనేక చోట్ల 'రామ్ ద్రోహి, దేశ ద్రోహి ఒకరే' అన్న నినాదాలతో పోస్టర్లు కనపడేవి. 1991లో పివి నరసింహారావు హయాంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించిన బీజేపీ 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత వెంటనే ఫలితాలు సాధించలేకపోయినప్పటికీ ఏడేళ్ల తర్వాత 1998లో కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. దీనితో బీజేపీ విస్తరణను అడ్డుకోవడానికి కాంగ్రెస్‌తో పాటు అనేక శక్తులు చేతులు కలపవలసి వచ్చింది. అయినప్పటికీ పదేళ్ల యూపీఏ పాలన తర్వాత మళ్లీ ఒక పెనుతుపానులా బీజేపీ అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చి పదేళ్లు పాలించింది. ఇప్పుడు బీజేపీ అధికారాన్ని శాశ్వతం చేసేందుకు నరేంద్రమోదీ మరోసారి ఇప్పుడు తీవ్ర యత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే నరేంద్రమోదీ వ్యాఖ్యలని మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 'సాంస్కృతిక జాతీయవాదం భారతదేశాన్ని సమైక్యపరచడమే కాక, దేశాన్ని ఆధునిక, ప్రగతిశీల, సుసంపన్న దేశంగా మారుస్తుంది. లౌకికవాదం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ముఖ్యమైనవే కాని అవి ప్రజానీకాన్ని ప్రేరేపితం చేసేందుకు సరిపోవు.' అని మోదీ గురువు అడ్వాణీ ఎప్పుడో అన్నారు.

వేలాది తెగలు, జాతులు, కులాలు, ఉపకులాలు, స్థానిక, ప్రాంతీయ భాషలు, మాండలికాలు, ఆచారాలు, పద్ధతులు ఉన్న వైవిధ్యభరితమైన సువిశాల భారత దేశంలో ఒక జాతీయ రాజ్యం (నేషన్ స్టేట్) దృక్పథం సరిపోదని చాలా మంది వాదించారు. యూరప్‌లో లాగా భారతదేశం ఒక జాతీయ రాజ్యంగా మారబోదని, భారత్‌లో ఒక ప్రపంచమే కనపడుతుందని విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1917లోనే అభివర్ణించారు. 'భారతదేశం వివిధ జాతుల, తెగల చారిత్రక ప్రదర్శన శాల' అని ప్రముఖ మెక్సికన్ కవి, భారతదేశంలో దౌత్యవేత్తగా ఉన్న అక్టావియో పాజ్ అన్నారు. పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీ ఉన్నప్పటికీ నెహ్రూ హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించలేకపోవడం భాషాపరంగా మన దేశ వైవిధ్యాన్ని స్పష్టం చేసిందని, ఇది మన దేశం జాతీయ రాజ్యంగా మారడంలో ఒక అడ్డంకి అని చెప్పినవారు కూడా ఉన్నారు. గాంధీజీ రాముడిని, రామరాజ్యాన్ని ఆదర్శ వ్యవస్థకు సూచికలుగా భావించారు కాని మత రాజ్యాన్ని ఆయన కూడా వాంఛించలేదన్న విషయం స్పష్టమే. అడ్వాణీ నుంచి మోదీ వరకూ తమను మతతత్వ వాదులంటే అంగీకరించబోరు. తమది జాతీయవాదమని, ప్రజల మత విశ్వాసాలు, నమ్మకాలు, ఆచారాలు జాతీయ ఐక్యతకు ప్రతిబింబమని అడ్వాణీ తన ఆత్మకథలో రాసుకున్నారు. బాబ్రీ మసీదు స్థానంలో రామమందిర నిర్మాణం కోసం ప్రజలు 500 సంవత్సరాలుగా పోరాడుతున్నారని ఆయన చెప్పారు.

మండల్ కమిషన్ నివేదికను విపిసింగ్ బయటకు తీసిన తర్వాత దానికి వ్యతిరేకంగా అడ్వాణీ రథయాత్ర జరపడం కులపరమైన రాజకీయ చైతన్యాన్ని ఎదుర్కోవడానికి మతాన్ని ఒక ఆయుధంగా బీజేపీ ఉపయోగించుకోవడమే దాని సైద్ధాంతిక దృక్పథం అని అర్థం చేసుకోవడానికి వీలు కలిగింది. నిజానికి దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతా వాదంలోనే ఈ దృక్పథం మూలాలున్నాయి. అడ్వాణీ రథయాత్ర జరిగి దాదాపు మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ ఈ దృక్పథం మారలేదని ఇవాళ దేశంలో మోదీ సారథ్యంలోని బీజేపీకీ, కాంగ్రెస్ సారథ్యంలో ఏకమైన వివిధ సామాజిక శక్తులకూ మధ్య జరుగుతున్న రాజకీయ పోరు, వాద ప్రతివాదాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. 1991 తర్వాత దేశంలో అనేక సామాజిక రాజకీయ, ఆర్థిక మార్పులు జరిగాయి. వివిధ సామాజిక శక్తులు ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చాయి. దేశంలో వెనుకబడిన వర్గాలు, బడుగు, బలహీన వర్గాలు సమాజంలో వివిధ రంగాల్లో తమ భాగస్వామ్యం కోసం చైతన్యవంతమైన ప్రయత్నాలు, పోరాటాలు చేశారు. ఆర్థిక సంస్కరణల వల్ల అనేక వర్గాలకు అవకాశాలు విస్తరించాయి. ఈ సంధి దశలో అనేక ప్రభుత్వాలు మారాయి. కాని 2014లో నరేంద్రమోదీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం అన్ని మార్పులను అధిగమించిన ఉధృత పరిణామం. ఇది పలువురు సామాజికవేత్తల అంచనాకు భిన్నంగా కులానికీ, మతానికీ మధ్య వైరుధ్యాలను కూడా అధిగమించిందనడంలో సందేహం లేదు. మోదీ రెండుసార్లు అఖండమైన మెజారిటీతో అధికారంలోకి రావడాన్ని బట్టి చూస్తే రవీంద్రనాథ్ టాగోర్ లాంటి వారి ఆలోచనలకు భిన్నంగా భారతదేశం ఒక జాతీయ రాజ్యంగా మారే అవకాశాలున్నాయా అన్న అనుమానాలకు కూడా ఆస్కారం కలిగింది.

అందువల్లే 2024 ఎన్నికలకు అంత ప్రాధాన్యత ఏర్పడింది. గత పది సంవత్సరాల్లో బీజేపీ తన సైద్ధాంతిక భూమిక ప్రజల్లో విస్తరించేందుకు అనేక చర్యలు చేపట్టింది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, కాశీ కారిడార్, త్రిపుల్ తలాఖ్ రద్దు, పార్లమెంట్‌లో రాజదండ ప్రతిష్ఠాపన నుంచి రామమందిర నిర్మాణం వరకూ బీజేపీ దేశంలో ఉన్న మెజారిటీ హిందువులకు తానే ప్రతినిధిగా నిరూపించుకునేందుకు చేయాల్సిన పనులన్నీ చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా భారతీయ జనతా పార్టీ మతాన్ని, ఆలయాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుంది. బీజేపీ సోషల్ మీడియాలో మతమే దాని ప్రధాన రాజకీయంగా మారిందనడంలో సందేహం లేదు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే ఆరునెలల్లో ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో ఏకమవుతుందనే కొత్త ప్రచారమూ ఊపందుకుంది. మోదీ నుంచి అన్నామలై వరకూ ఇవాళ బీజేపీ సైద్ధాంతిక విశ్వరూపాన్ని మనం ఆకళింపు చేసుకోవల్సి ఉన్నది. అందువల్ల మోదీ హిందూ ముస్లింల గురించి అధికంగా మాట్లాడుతున్నారని అనడం కొత్త విషయాన్ని చెప్పినట్లు కాదు. ముస్లింల ప్రస్తావన తెచ్చి వారు పరాయివారు అనే ధ్వని వచ్చేలా మాట్లాడడం బీజేపీ వర్గాలకు కొత్త కాదు. సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ అని చెప్పే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లింల గురించి ప్రత్యేక ప్రస్తావన ఏ మాత్రం కనిపించదు. అదే కాంగ్రెస్ అన్ని వర్గాల వారితో పాటు ముస్లింల గురించి ప్రస్తావిస్తే బీజేపీకి అది మహా పాపంలా కనిపించడంలోనూ ఆశ్చర్యం లేదు.

ఈ నేపథ్యంలో భారతదేశం ఎటువైపు వెళుతున్నది అని తెలుసుకోవడానికి ఈ ఎన్నికలు దోహదం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిపిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రజలు సానుకూలంగా స్పందించారన్నది అవాస్తవం కాదు. దేశంలో అనేక పట్టణ ప్రాంతాల్లో ప్రజలు బీజేపీ సానుభూతిపరులుగా కనిపిస్తున్నారు. వారితో తార్కికంగా వాదించడం అంత సులభం కాదు. కాని ఈ సానుకూలత ఎల్లెడలా విస్తరించిందా అన్నది చర్చనీయాంశం. కాని రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ ప్రజల అంత శ్చేతనలో ఇమిడిపోయినందువల్ల తమకే భారీగా ఓట్లు పడతాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ ఆశించిన విధంగా ఆ పార్టీకి 350 సీట్లు దక్కితే జాతీయ రాజ్యాన్ని ఏర్పర్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతాయనడంలో ఆశ్చర్యం లేదు. కాని ప్రజలు రామమందిర ప్రభావం నుంచి తేరుకుని వాస్తవాలు గ్రహించడం మొదలుపెట్టారని, మొదటి రెండు దశల్లో పోలింగ్‌లోనే ఇది స్పష్టమైందని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చెబుతున్నాయి. భారతదేశ ప్రజలు మత భావనల వెల్లువలో కొట్టుకుపోయి ఆర్థిక, సామాజిక న్యాయాన్ని విస్మరించబోరని ఆ పక్షాలు వాదిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిషాతో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ సీట్లు తగ్గిపోతాయని చెప్పేవారి సంఖ్య కూడా తక్కువేమీ లేదు. అందువల్ల ఈ ఎన్నికలు బీజేపీ చిరకాల ఆకాంక్షకూ, ప్రజల ఆలోచనా విధానానికీ మధ్య వ్యత్యాసాన్ని ఎంతమేరకు ప్రతిఫలిస్తాయో వేచి చూడాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> అయోధ్యలో రామమందిర నిర్మాణం, శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరిపిన తర్వాత దేశ వ్యాప్తంగా ప్రజలు సానుకూలంగా స్పందించారన్నది అవాస్తవం కాదు. దేశంలో అనేక పట్టణ ప్రాంతాల్లో ప్రజలు బీజేపీ సానుభూతిపరులుగా కనిపిస్తున్నారు. వారితో తార్కికంగా వాదించడం అంత సులభం కాదు. ఈ సానుకూలత ఎల్లెడలా విస్తరించిందా అన్నది చర్చనీయాంశం. రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ ప్రజల అంతశ్చేతనలో ఇమిడిపోయినందువల్ల తమకే భారీగా ఓట్లు పడతాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు.

ఎన్నికల్లో 'నెటిజన్స్' ఎవరి వైపు?

కోవిడ్ సంక్షోభం తర్వాత జనంలో సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగింది. దీంతో పార్టీలు సోషల్ మీడియా ద్వారా ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు ప్రారంభించాయి. అయితే, 2019 ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఫేస్‌బుక్, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చతికిలపడింది. ఇప్పుడు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ సమయంలో రాజకీయ పార్టీల అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఉన్న ఎంగేజ్‌మెంట్ గత కొన్ని రోజులుగా ఎలా మారుతూ వచ్చిందో పీపుల్స్ పల్స్ బృందం అధ్యయనం చేసింది.

గత నెల రోజులుగా జాతీయంగా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, బీజేపీ విధానాలపై చేస్తున్న విశ్లేషణాత్మక వీడియోల్ని సగటున 2 కోట్ల మంది వ్యూయర్స్ చూశారు. 1.9 కోట్ల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్న ఈ చానెల్‌లో గత మూడు వారాల్లో అప్‌లోడ్ చేసిన వీడియోలు 11 కోట్ల మందికి చేరాయి. అదే సమయంలో 2.3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ యూ ట్యూబ్ చానెల్‌లో గత మూడు వారాల్లో పెట్టిన అత్యధిక వీడియోలకు వచ్చిన వ్యూస్ వేలల్లోనే ఉన్నాయి. 52 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూ ట్యూబ్ చానెల్‌లో గత మూడు నాలుగు వారాల్లో అప్‌లోడ్ చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోల్ని కేవలం చూసి వదిలేస్తున్నారా? లేక వీటి ప్రభావం ఎన్నికలపై ఉంటుందా? అనేది ఎన్నికల ఫలితాల తర్వాత తెలుస్తుంది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటికి యూ ట్యూబ్‌లో జాతీయంగా బీజేపీకి సుమారు 51 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు 15.7 శాతం పెరిగి 59 లక్షలకు చేరింది. 5 నెలల కింద కాంగ్రెస్‌కి 38 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 27 శాతం పెరిగి 48 లక్షలకు చేరింది. నరేంద్రమోదీ ఇన్‌స్టాగ్రాంలో 8.9 కోట్ల మంది ఫాలోవర్స్‌తో శాచురేషన్ పాయింట్‌కి చేరుకున్నారు. 80 లక్షల ఫాలోవర్స్‌తో రాహుల్ గాంధీ ఆయనకు చాలా దూరంలో ఉన్నారు. కానీ, గడిచిన ఏడాదికాలంలో ఆయన ఫాలోవర్స్ గణనీయంగా పెరిగారు. ఇలాంటి పెరుగుదల మోదీ ఖాతాలో కనిపించలేదు. భారత్ జోడో యాత్ర తర్వాత రాహుల్ గాంధీకి ఇన్‌స్టాగ్రాంలో ఫాలోవర్స్ 18 లక్షల నుంచి 27 లక్షలకు పెరిగారు. పక్షంరోజుల కింద ఆయన ఫాలోవర్స్ సంఖ్య 70 లక్షలకు రాగా, ఐదురోజుల క్రితం అది 80 లక్షలకు చేరింది. ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీకి 79 లక్షల మంది ఫాలోవర్స్, కాంగ్రెస్ ఫాలోవర్స్ 54 లక్షలకు చేరారు. రామమందిర్ ప్రారంభోత్సవం వరకు మోదీ ఇన్‌స్టాగ్రాం ఎంగేజ్‌మెంట్ అధికంగా ఉండేది. కానీ, ఆ తర్వాత వారం నుంచి తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు ఆయనకు రాహుల్ గాంధీ కన్నా పది రెట్లు అధిక వ్యూసే వస్తున్నా, రాహుల్ గాంధీ ఖాతాకు ఉన్నంత ఎంగేజ్‌మెంట్ మోదీ ఖాతాకు లేదు. అదానీ, అంబానీ గురించి మోదీ మాట్లాడిన తర్వాత దానికి కౌంటర్‌గా రాహుల్ గాంధీ చేసిన రెండు వీడియోలకు 3 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇవన్నీ దేనికి సంకేతం?



> తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారిక ఖాతాల్లో పోస్ట్ చేసిన కంటెంట్ కంటే, రాష్ట్ర బీజేపీ షేర్ చేసిన కంటెంట్‌కి ఎంగేజ్‌మెంట్ పెరిగింది. ఈ కోణంలో నెటిజన్స్ షిఫ్ట్ అవుతున్న తీరును అధ్యయనం చేస్తే ఆంధ్రాలో ఎక్కువమంది కూటమి వైపు, తెలంగాణలో అత్యధికులు బీజేపీ వైపు ఆసక్తి చూపిస్తున్నట్టు చూచాయగా తెలుస్తోంది. జాతీయ డిజిటల్ మీడియా ముఖ చిత్రాన్ని గమనిస్తే... బీజేపీపై నెటిజన్స్ కొంతవరకు అసంతృప్తి కనబరుస్తున్నట్టుగా, గతంలో కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు తరలి వెళ్లినట్టు ట్రెండ్స్ చెప్తున్నాయి.

తమకు కావాల్సిన కస్టమైజ్డ్ సమాచారం లేదా విశ్లేషణ కోసం ప్రజలు యూ ట్యూబ్ చానెళ్లను చూస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సొంతంగా ప్రధాన స్రవంతి మీడియా లేకున్నా, సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానెళ్లు దాని విజయంలో కీలక పాత్ర పోషించాయి. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 65 శాతం మంది స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు. 18–19 ఏళ్ల వయసున్న కొత్త ఓటర్లు తెలంగాణలో 9 లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10.3 లక్షల మంది ఉన్నారు. కొత్త ఓటర్లు మొత్తం సోషల్ మీడియా మీద ఆధారపడుతున్నారు. కాబట్టి, వీరిపై దాని ప్రభావం తీవ్రంగా ఉంది. 5 నెలల క్రితం, అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ యూ ట్యూబ్ చానెల్ సబ్‌స్క్రైబర్స్ లక్షా పదివేలమంది. ఇప్పుడు అది 64 శాతం పెరిగి లక్షా 81 వేలకు చేరింది. అదే సమయంలో తెలంగాణ బీజేపీకి 24 వేలు ఉండగా, 304 శాతం పెరిగి 92 వేలకు చేరింది. కాంగ్రెస్‌కి లక్ష ఉండగా, అది 150 శాతం పెరిగి నుంచి 2 లక్షల 50 వేలకు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో 5 నెలల కింద వైఎస్ఆర్‌సీపీకి 4.5 లక్షలు ఉండగా, ఇప్పుడు అది 26 శాతం పెరిగి 5.7 లక్షలకు చేరింది. టీడీపీకి సుమారు 2.4 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 85 శాతం పెరిగి 5.2 లక్షలకు చేరింది. జనసేనకు 13 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 15.6 లక్షలకు చేరింది. ఈ ఎంగేజ్‌మెంట్‌ని జాగ్రత్తగా గమనిస్తే నెటిజన్స్ ఎవరివైపు చూస్తున్నారనేదానికి కొన్ని సంకేతాలు కనిపిస్తాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో వైసీపీ అధికారిక ఖాతాకు ప్రస్తుతం 2.1 లక్షల మంది ఫాలోవర్స్, టీడీపీకి 3.2 లక్షల మంది, జనసేనకు 11 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్కువ ఫాలోవర్స్ ఉన్న వారికి ఎక్కువ ఓట్లు వస్తాయని కాదు. ఫాలోవర్స్, స్పాన్సర్డ్ వీడియోలను పక్కనపెడితే, గడిచిన మూడు వారాల్లో వైసీపీ పెట్టిన వీడియోల కంటే, టీడీపీ, జనసేన పేజీలలో పెట్టిన కంటెంట్‌కి ఎక్కువ ఎంగేజ్‌మెంట్ కనిపిస్తోంది. జగన్ గులకరాయి దాడి వీడియోలను వైసీపీ పేజీల కంటే కూటమి పేజీల్లోనే జనం ఎక్కువగా చూశారు. తాము గెలుస్తున్నామని జగన్ ఐ ప్యాక్ ప్రతినిధులతో మాట్లాడిన వీడియో ఆయన ఇన్‌స్టాగ్రాం ఖాతాలో 5 లక్షల మందికి మాత్రమే చేరింది. వీటన్నింటిని జాగ్రత్తగా పరిశీలిస్తే నెటిజన్స్ ఎటువైపు ఆసక్తి కనబరుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారిక ఖాతాల్లో పోస్ట్ చేసిన కంటెంట్ కంటే, రాష్ట్ర బీజేపీ షేర్ చేసిన కంటెంట్‌కి ఎంగేజ్‌మెంట్ పెరిగింది. ఈ కోణంలో నెటిజన్స్ షిఫ్ట్ అవుతున్న తీరును అధ్యయనం చేస్తే ఆంధ్రాలో ఎక్కువమంది కూటమి, తెలంగాణలో అత్యధికులు బీజేపీ వైపు ఆసక్తి చూపిస్తున్నట్టు చూచాయగా తెలుస్తోంది. జాతీయ డిజిటల్ మీడియా ముఖ చిత్రాన్ని గమనిస్తే... బీజేపీపై నెటిజన్స్ కొంత వరకు అసంతృప్తి కనబరుస్తున్నట్టుగా, గతంలో కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు తరలి వెళ్లినట్టు ట్రెండ్స్ చెప్తున్నాయి. ఈ సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ ఇస్తున్న సంకేతాలకు అనుగుణంగా ఎన్నికల తుది ఫలితాలు ఉంటాయా, లేదా అన్న ప్రశ్నకు సమాధానం జూన్ 4న తెలుస్తుంది.

● జి.మురళికృష్ణ
పీపుల్స్‌పల్స్ రీసెర్చ్ సంస్థ

అంతరించిపోతున్న జీవవైవిధ్యం!

భూమిపై జీవాల మధ్య భేదాన్నే జీవవైవిధ్యం అంటారు. మన జీవన శైలిలో నిత్యం వాడుతున్న వస్తువులు, మొబైల్స్ వంటి వాటి వల్ల పర్యావరణం కాలుష్యమై భూగోళం వేడెక్కి జీవవైవిధ్యం దెబ్బతింటోంది. భూగోళంపై ఎన్నో జీవరాశులు అంతరించిపోతున్నాయి. పిచ్చుకలు కాలక్రమేణా కనుమరుగైపోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్షజాతులు, దాదాపు 77వేల జంతు జాతులు ఇక్కడ ఉండేవి. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికి పైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. విస్తారంగా ఉన్న పచ్చికబయళ్ళ మన జీవనశైలితో తగ్గుముఖం పట్టాయి. సముద్రతీరాలను సైతం అతలాకుతలం చేసేశాం. దీనికి తోడు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు వేటగాళ్ళు అంతమొందిస్తున్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువులకు, కీటక నాశకాలకు ప్రాధాన్యం పెరిగింది. మన దేశంలో ఆదివాసులు, గిరిజనులు, కొండజాతి ప్రజలు ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం పదిలంగా ఉంది. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్‌లో 80 శాతానికంటే ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఇటీవల జన్యు మార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. అలాగే రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి. జంతువుల్ని, మొక్కల్ని పరిరక్షించుకోవాలి. సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులను వాడాలి. మంచి దిగుబడినిచ్చే సహజ విత్తనాలను గిరిజనులు ఇప్పటికీ రక్షించుకుంటూ వస్తున్నారు, విత్తన మార్పిడి చేసుకుంటున్నారు. కానీ లాభాలే ధ్యేయంగా పనిచేస్తున్న విదేశీ కంపెనీలు జీవ వైవిధ్యాన్ని సర్వనాశనం చేస్తున్నాయి.

– మిద్దె సురేష్

(నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం)

ఆత్మగౌరవ పోరాటం చేసిన దళిత శిఖరం

దక్కన్ పీఠభూమిలో భాగ్యనగరం నడిబొడ్డున జన్మించిన ధ్రువతార, సామాజిక ఉద్యమాలకు తొలిగురువు మాదరి భాగ్యరెడ్డి వర్మ. నిజాం స్టేట్ హైదరాబాద్ సంస్థానంలో ఆత్మగౌరవ పోరుకు తొలిపొద్దుగా నిలిచిన వ్యక్తి ఆయన. హైదరాబాదులోని సుల్తాన్ బజార్‌లో నివాసముంటున్న సాధారణ దళిత మాల కుటుంబంలో మాదరి వెంకటయ్య, రంగమాంబ దంపతులకు భాగయ్య 1888 మే 22న జన్మించారు. భాగయ్య తండ్రి చిన్నతనంలో చనిపోవడంతో కుటుంబ భారం ఆయనపై పడింది. స్థానికంగా పనులు చేస్తూనే రాత్రి సమయంలో శ్రీకృష్ణాంధ్ర తెలుగుభాషా నిలయం వారి సహకారంతో చదువుకున్నారు. యుక్త వయసులోనే సుల్తాన్ బజార్‌లోని ఆర్య సమాజంలో కొంతకాలం పని చేశారు. ఆర్య సమాజ్ నిర్వాహకులు బాజీ కిషన్‌రావు.. భాగయ్య సేవలు గుర్తించి వర్మగా బిరుదునిచ్చారు. కుల వ్యవస్థకు పెద్దపీట వేస్తున్న ఆనాటి సమాజం రెడ్డి కులాలకు ఇచ్చే గౌరవాన్ని చూసి రెడ్డి అంటే పరిపాలనాదక్షుడిగా గౌరవం ఉంటుందని, వారికన్నా తమ జాతులు తక్కువ కాదని ఆయన తన పేరులో రెడ్డిని చేర్చుకున్నారు. దీనితో ఆయన పేరు మాదరి భాగ్యరెడ్డి వర్మగా మారిపోయింది.

హిందూ సమాజంలోని అస్పృశ్యత, అంటరానితనం వ్యక్తుల మధ్య వ్యత్యాసం గమనించిన ఆయన అణగారిన వర్గాలు, దళితుల పట్ల చైతన్యం తీసుకురావడానికి బస్తీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఒకవైపు విద్యుత్ శాఖలో ఉద్యోగం నిర్వహిస్తూనే మరోవైపు సాంఘిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆనాటి సంఘసంస్కర్తలతో కలిసి పనిచేస్తూ బస్తీల వారీగా పర్యటనలు చేస్తూ బస్తీలలో 'జగన్ మిత్రమండలి'ని ఏర్పాటు చేశారు. బస్తీల వారి సమస్యలను పరిష్కరించడానికి పంచ కమిటీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సమస్యలను పరిష్కరించారు.

హిందూ సమాజంలో కింద కులాల్లో రకరకాల ఆచారాలు, వ్యవహారాలతో వెట్టి సేవలు చేయించుకుంటున్నారని భాగ్యరెడ్డి వర్మ తిరుగుబాటు చేసి, కుల నిర్మూలన కోసం పాటుపడ్డారు. సమాజంలో అతి భయంకరమైన దేవదాసి వ్యవస్థను వ్యతిరేకించారు. పేదలు మద్యపానానికి బానిసలు కారాదని, ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. 1911 ఆది హిందూ సోషల్ లీగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి, కులాల అంతరాలు తొలగించడానికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. భాగ్యరెడ్డి వర్మ చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు, సంఘ సేవకులైన మాడపాటి హనుమంతరావు, బాలా ముకుందరాయ్, సురవరం ప్రతాపరెడ్డి, కృష్ణ స్వామి ముదిరాజ్ వంటివారు మద్దతునిచ్చారు.

హైదరాబాద్ నిజాం స్టేట్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మద్రాస్ రాష్ట్రం, కర్ణాటక రాష్ట్రంలోని దళిత నాయకులందరూ 1917 నవంబర్ 4, 5, 6 తేదీలలో విజయవాడలో పంచమ మహాసభలను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన సమావేశాల తర్వాత పంచమ మహాసభల పేరును 'ఆది ఆంధ్ర మహాసభ'గా మార్చారు. కులం పరంగా సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

1931లో జరిగి జనాభా లెక్కల సేకరణలో దళితులను ఆది హిందువులుగా నమోదు చెయ్యాలని భాగ్యరెడ్డి వర్మ నిజాం ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దానిని అంగీకరించిన నిజాం ప్రభుత్వం జనాభా లెక్కల్లో దళితులు, అణగారిన వర్గాలను ఆది హిందువులుగా గుర్తించి సర్టిఫికెట్లను జారీ చేసింది. దీనితో పక్క రాష్ట్రాలైన ఉమ్మడి మద్రాస్ ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ, ఆది కన్నడ అనే పేరుతో ఈ రాష్ట్రాల్లో దళితులు సర్టిఫికెట్లు పొందారు.

1917లో భాగ్యరెడ్డి వర్మ విజయవాడలో నిర్వహించిన సమావేశం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమకారులందరినీ ఆకర్షించింది. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, ఆంధ్రప్రదేశ్‌లో బి.వి రమణయ్య, కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, తమిళనాడులో పెరియార్ రామస్వామి, కేరళలో నారాయణ గురు, వీరితో పాటు బెంగాల్, మహారాష్ట్ర ప్రాంతంలో జరిగే సభలు సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. 1929లో బొంబాయిలో జరిగిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ ఆర్గనైజేషన్ సమావేశంలో అంబేడ్కర్ ఆహ్వానం మేరకు భాగ్యరెడ్డి వర్మ పాల్గొని సమావేశానికి అధ్యక్షత వహించారు. అదే సమావేశంలో లండన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి దళితుల ప్రతినిధిగా అంబేడ్కర్ వెళ్లాలని ఆయన ప్రతిపాదించారు.

ఒకవైపు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న సమావేశాల్లో పాల్గొంటూనే, జగన్ మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రతి బస్తీలో పంచ కమ్యూనిటీల ద్వారా ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపేవారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాదులో దినసరి కార్మికులుగా, పనివారలుగా పనిచేస్తున్న వారికోసం మహిళా పొదుపు సంఘాలు ఏర్పాటు చేశారు. దీంతో వారికి ఆర్థిక భరోసా ఏర్పాటు అయింది. సంఘంలోని సభ్యులు వారి అవసరం నిమిత్తం డబ్బులు ఎలా తీసుకోవాలి, ఎలా తిరిగి చెల్లించాలో వారికి బోధించారు. మరోవైపు వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇండ్లలో పనిచేస్తున్న వాళ్ల కోసం సంఘం ఏర్పాటు చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నిజాం పరిపాలనలో సుల్తాన్ బజార్ (ప్రస్తుత కోఠి) పరిసర ప్రాంతాలలో కుల సంఘాలు ఏర్పాటు చేసి, వారికోసం భవనాలు నిర్మించారు. వారి వారి కులాల్లోని విద్యార్థులకు ఉన్నత చదువులు చదివించడం కోసం కళాశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే రెడ్డి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్, గౌడ సంఘం హాస్టల్, సగర కమ్యూనిటీ, పద్మశాలి కమ్యూనిటీ, మున్నూరు కాపు సంఘం లాంటివి వచ్చాయి. వారితో సమానంగా తమ జాతి జనుల కోసం కూడా సామూహిక భవనం నిర్మించ తలపెట్టారు. అందులో భాగంగానే 1931లో ఆది హిందూభవన నిర్మాణానికి పునాదిరాయి వేశారు. పనివాళ్ల, దినసరి కూలీల, దాతల నుంచి స్వీకరించిన విరాళాలతో ఆది హిందూ భవనాన్ని నిర్మించారు.

అణగారిన వర్గాలకు చదువు తప్పకుండా ఉండాలని ప్రతి కుటుంబంలోని బాల బాలికలను పాఠశాలకు పంపాలని బస్తీ సమావేశాల్లో వారికి వివరించేవారు. భాగ్యరెడ్డి వర్మ నివాసం ఉంటున్న ఇంటి పక్కనే సుల్తాన్ బజార్‌లో బాలికల కోసం ప్రత్యేకంగా నిజాం ప్రభుత్వంలో తెలుగు మాధ్యమం బోధించే పాఠశాలను 1917లో ఏర్పాటు చేశారు. ఇదే హైదరాబాద్ నిజాం స్టేట్‌లో తొలి బాలికల పాఠశాల. దీనితోపాటు హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాల్లో అంచలంచెలుగా 26 పాఠశాలలు భాగ్యరెడ్డి వర్మ ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడే విద్యావంతులైన తమ జాతి యువతకు నిజాం ప్రభుత్వంలో ఉద్యోగాలు కావాలని ఆనాటి ప్రధానమంత్రి లియాఖత్ అలీకి వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆ ప్రతిపాదనను అంగీకరించి కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు, వసతి గృహాలకు మద్దతు, ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

సామాజిక ఉద్యమాలు చేస్తూనే అణగారిన వర్గాల జాతిజనుల చైతన్యం కోసం 'భాగ్యోదయం' అనే మాస పత్రికను ప్రారంభించారు. ముద్రించిన పత్రికలను బస్తీల వారిగా పంపిణీ చేసి ప్రతి నెలా జరిగే సమావేశాల్లో అందులోని అంశాలను వారికి వివరించేవారు. సమాజంలో అణగారిన వర్గాలైన దళితుల్లోని మాలలు, మాదిగలు... అగ్రవర్ణాల వారికి సేవల పేరు మీద చేస్తున్న వెట్టి గమనించి, దానిపైన 'వెట్టి మాదిగ' అనే గ్రంథాన్ని రాశారు. కులవృత్తుల్లో జరుగుతున్న అన్యాయాలను సమాజం దృష్టికి తీసుకువచ్చిన తొలి దళిత గ్రంథం అది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మహాత్మా గాంధీ హైదరాబాద్‌కు వచ్చినపుడు ఆయనను ముందుగా పోలీసులు బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడికి ప్రత్యేకంగా భాగ్యరెడ్డి వర్మను పిలిపించుకుని అనేక అంశాలపై ఆయనతో గాంధీ చర్చించారు.


అణగారిన వర్గాల ఆత్మస్థైర్యం కోసం నిరంతరం పోరాడుతూనే హైదరాబాదులో ఎన్నో సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాటి రోజుల్లోనే ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వారికి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు, మెలకువలు తెలిపేవారు. చిన్ననాటి నుంచి తాను రకరకాలుగా అనుభవించిన అసమానతలను, కుల వివక్షను దృష్టిలో పెట్టుకొని బౌద్ధమతం స్వీకరించాలని భాగ్యరెడ్డి వర్మ నిర్ణయించుకున్నారు. దేశంలో అంబేడ్కర్ కంటే ముందే బుద్ధ పూర్ణిమ రోజు 1915లో బౌద్ధమతాన్ని స్వీకరించారు. నిరంతరం ప్రజాసేవలో ఉన్న కారణంగా ఆయన క్షయ వ్యాధితో బాధపడుతూ వచ్చారు. హైదరాబాదులో సరియైన వైద్యం లేదని కొంతకాలం పాటు మైసూర్ వెళ్లి వైద్యం చేయించుకున్నారు. తిరిగి హైదరాబాద్ వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో కోలుకోకముందే 1939, ఫిబ్రవరి 18న తుది శ్వాస వదిలారు. దీనితో దేశంలోనే అణగారిన జాతుల కోసం పోరాటం చేస్తున్న దళిత శిఖరం నేలకొరిగింది.



> హిందూ సమాజంలోని అస్పృశ్యత, వ్యక్తుల మధ్య వ్యత్యాసం గమనించిన భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాలు, దళితుల పట్ల చైతన్యం తీసుకురావడానికి బస్తీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. జగన్ మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రతి బస్తీలో పంచ కమ్యూనిటీల ద్వారా ప్రతినెలా సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపేవారు. బాల బాలికలను పాఠశాలకు పంపాలని సూచించేవారు. అప్పట్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాదులో దినసరి కార్మికులుగా, పనివారలుగా పనిచేస్తున్న వారికోసం మహిళా పొదుపు సంఘాలు ఏర్పాటు చేశారు.

■ అస శ్రీరాములు
జర్నలిస్ట్

(నేడు భాగ్యరెడ్డి వర్మ జయంతి)



సన్నాల వైపు చూపు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరగనున్న సాగు

- క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటనతో రైతుల్లో ఉత్సాహం
- వానాకాలంలో సన్నాల సాధారణ సాగు 7.87లక్షల ఎకరాలు
- అదనంగా 1.85 లక్షల సాగుకు అవకాశం
- తెలంగాణ సోనా రకానికి పెరగనున్న మరింత డిమాండ్
- విత్తనాల సరఫరాకు ఇప్పటి నుంచే సన్నాహాలు
- త్వరలో అన్నదాతలకు అవగాహన సదస్సులు

హనుమకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించే సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చే పథకాన్ని వచ్చే వానా కాలం సీజన్ నుంచే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖరీఫ్‌లో సన్న రకం వరి సాగు గణనీయంగా పెరిగనున్నది. సాధారణ వరి సాగు విస్తీర్ణం కన్నా అదనంగా 15 నుంచి 20 శాతం పెరగవచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధరణంగా ఖరీఫ్‌లో వరిసాగు 80 నుంచి 82 శాతం ఉంటుంది. రబీలో దొడ్డు రకాలనే రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో నీటి అందుబాటు, సానుకూల వాతావరణం దృష్ట్యా రైతులు సహజంగానే సన్న రకం వరి సాగు వైపు ఎక్కువ చూపుతారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో సహజంగానే రైతులు సన్నాల సాగును మరింత ఎక్కువ చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

9.27లక్షల ఎకరాల్లో వరి సాగు

ఉమ్మడి వరంగల్ సాగు ప్రణాళికలను వ్యవసాయ శాఖ అప్పుడే సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వరిసాగు ప్రతిపాదనలను కూడా రూపొందించింది. దీని ప్రకారం వచ్చే వానాకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.27 లక్షల ఎకరాల మేర వరి సాగు కావచ్చునని అంచనా వేసింది. హనుమకొండ జిల్లాలో 1.48 లక్షలు, వరంగల్ జిల్లాలో 1.35 లక్షలు, జనగామ జిల్లాలో 2.10 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.17 లక్షలు, ములుగు జిల్లాలో 1.12 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో వరి సాగు ప్రతిపాదనలు ప్రణాళికల్లో పొందుపరించారు. అయితే ఎప్పుడైనా సాధారణంగా ఈ మొత్తంలో సన్నరకాల సాగు 7.41 లక్షల మేరకు ఉంటుంది. మిగతాది దొడ్డు రకం. అయితే రూ.500 బోనస్ ప్రకటనతో సీన్ రివర్స్ కానున్నది. వచ్చే వానాకాలం సీజన్‌లో సన్నరకాల సాగు అదనంగా 15 నుంచి 20 శాతం 1.85 లక్షల ఎకరాలు పెరగవచ్చునని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇంతకన్నా ఎక్కువే ఉన్నా ఆశ్చర్య పోనక్కర లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అంటే ఈ లెక్కన ఖరీఫ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సన్నాల సాగు మొత్తంగా 9.26 లక్షల ఎకరాలు ఉండవచ్చునని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే దొడ్డు రకాల సాగు దాదాపు ఉండకపోవచ్చునని భావిస్తున్నారు. ఒక వేళ స్థానికంగా ఉండే అననుకూల పరిస్థితులు, అనివార్యకారణాలు, మరింత పెరిగే వరిసాగు విస్తీర్ణం దృష్ట్యా దొడ్డు రకం సాగు లక్ష నుంచి లక్షా 50వేల ఎకరాల మేరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఎకరాకు వరి దొడ్డురకం 24 నుంచి 25 క్వింటాళ్ల వరకు వస్తే సన్న రకం 20 నుంచి 22 క్వింటాళ్లు వస్తుంది. ప్రస్తుతం మద్దతు ధర సన్నరకం రూ.2203. దొడ్డు రకం రూ.21.83 చెల్లిస్తున్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం మద్దతు ధర రూ.20 మినహా పెద్దగా తేడా ఏమీ లేదు. అయితే సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంవల్ల రైతుకు సన్నరకం వడ్లకు ఎకరానికి అదనంగా రూ.11వేల వరకు లభిస్తాయి. అందువల్ల ఖరీఫ్‌లో సన్నరకం సాగుకే అన్నదాత ఎక్కువ మొగ్గుచూపడం ఖాయంగా కనిపిస్తోంది. దీనికితోడు ఇప్పటికే బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఇప్పుడు ప్రభుత్వం సన్నబియ్యం సాగు చేసే రైతులకు అదనంగా మరో రూ.500బోనస్ ఇవ్వనుండడంతో సన్న రకాల సాగు మరింత పెరిగే అవకాశాలున్నాయి.

దిగుబడి తగ్గినా..

సాధారణంగా సన్నరకాల సాగులో రిస్క్ కాస్త ఎక్కువే. పైగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడి తక్కువ. దొడ్డు రకాలు సగటున ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరక దిగుబడి వస్తుంది. అదే సన్నరకాలైతే ఎకరానికి సగటున రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సాగు సమయం ఎక్కువ. దీనితో పాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే ధర విషయానికి వచ్చే సరికి సన్నాలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాలకు క్వింటాల్‌కు ప్రైవేటు మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.600 అధిక ధర లభిస్తోంది. సన్నాలకు ఇప్పుడు మార్కెట్‌లో క్వింటాల్ రూ.2500పైగా అమ్మకం అవుతున్నాయి. మార్కెట్ వరకు తీసుకువెళ్లకుండానే పొలాల వద్దనే ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు ఇంటి అవసరాలకు కొత్త ధాన్యాన్ని రైతు తీసిపెట్టుకుంటున్నాడు. దీనితో ప్రభుత్వానికి అవసరమైన సన్న బియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

డిమాండ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులతోపాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్న బియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు స్థానిక రైతులను ప్రోత్సహించి సన్నధాన్యం సాగుపెంచాలని భావిస్తోంది.

సన్నరకాల విత్తనాలకు డిమాండ్

సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వా లన్న నిర్ణయంవల్ల సాగులో చోటు చేసుకునే మార్పులు, చేర్పులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ సాగు ప్రణాళికలను సవరించే పనిలో పడింది. సన్నాల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఆ మేరకు విత్తనా లను అందుబాటులో ఉంచే దిశగా అధికారులు అప్పుడే దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో సన్నరకం వరి విత్తనాలు చాలినంత మేరకు అందుబాటులో ఉంచేలా సన్నాహాలు చేస్తున్నారు. సన్నాల్లో 20కిపైగా రకాలు ఉన్నాయి. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ సోనాకు మంచి డిమాండ్ ఉంది. బీపీటీ, సాంబమసూరి, ఆమన్, కూనారం 1618 తదితర రకాలను కూడా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. బిపీటి 5204 (సాంబ మషూరి) ఎంటీయూ-1001 (విజేత), బీపిటి-3291 (సోనామషూరి) ఎంటీయూ-1010 (కాటన్ దొర సన్నాలు), ఎస్ఎల్ఆర్-115 (సర్ధముఖి), జ్యయల్-1798 (జగిత్యాల సన్నాలు), ఎంటీయూ-7029 (స్వర్ణ), డబ్ల్యూజీఎల్-20471 (ఎర్రమల్లెలు), తెల్లహంస మొదలైన రకాల పట్ల రైతులు ఎక్కువ మొగ్గుచూపనున్న దృష్ట్యా ఈ రకం విత్తనాలకు వచ్చే వానాకాలంలో సీజన్‌లో డిమాండ్ బాగా పెరిగే అవకాశాలు లేకపోలేదు. సన్నాలకు రూ.500 బోనస్ నేపథ్యంలో వీటిని సాగు చేసే రైతులకు త్వరలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



బ్యారేజీకి ఎగువన కొనసాగుతున్న పనులు

వరదలను తట్టుకొనేలా..

'మేడిగడ్డ'లో తాత్కాలిక మరమ్మతు పనులు

- బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు
- పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్
- ఇప్పటికే 15వ నెంబర్ గేట్ ఎత్తివేత
- మిగిలిన గేట్ల ఎత్తివేతకూ చర్యలు
- ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగానే ప్రక్రియ

మహదేవపూర్ రూరల్, మే 21 : కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 పిల్లర్లు వానాకాలం వరదను తట్టుకునేలా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఎగువన ఇప్పటికే ఉన్న షీట్‌ఫైల్స్‌ను తొలగించారు. ప్రాణహిత, గోదావరి నదుల నుంచి వచ్చే వరదను తట్టుకుని నిలబడేలా పిల్లర్ల సామర్థ్యాన్ని పెంచే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

గేట్లను ఎత్తి.. నీరు దిగువకు వెళ్లేలా..

మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 85 గేట్లుండగా బ్లాక్-7లో 11గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 21న బ్యారేజీలోని బ్లాక్-7లో 20 నెంబరు పిల్లరు భారీ శబ్దాలు చేస్తూ కుంగుబాటుకు గురికాగ ఆపిల్లరుకు ఇరువైపులా ఉన్న పిల్లర్లు కూడా పాక్షికంగా కుంగాయి. అదే బ్లాకులో ఉన్న మిగతా పిల్లర్లకు కుంగుబాటు విస్తరించే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు బ్యారేజీలో అప్పటికే నిల్వ ఉన్న 10.10టీఎంసీల నీటిని బ్లాక్-7 గేట్లు వినహా మిగతా బ్లాకుల్లో గేట్లన్నీ ఎత్తి దిగువకు విడుదల చేశారు. అప్పటి నుండి బ్లాక్-7గేట్లన్నీ మూసే ఉండగా మిగతా గేట్లన్ని ఆపరేషన్‌లోనే ఉన్నాయి. దీనిపై ఎన్‌డీఎస్ఏ, ఇతర నిపుణుల బృందాలు పరిశీలన చేసినప్పటికి పునరుద్ధరణకు ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా వానాకాలం దగ్గరపడుతుండటంతో బ్లాక్-7లో గేట్లు వరదను తట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) మధ్యంతర నివేదికలో పేర్కొనడంతో అధికారులు ఆదిశగా కసరత్తు ప్రారంభించారు. ఈనెల 17న బ్లాక్-7లో 15వ గేట్‌ను ఎత్తిన అధికారులు మిగతా గేట్లను ఎత్తేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. గేట్లు ఎత్తితే మిగతా గేట్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రెండు బృందాలుగా అధికారులు పనులను చేపట్టినట్టు తెలిసింది. 16వ నెంబరు గేటుకు ఎగువన దిగువన టెక్నికల్‌గా అందిచాల్సిన సపోర్ట్‌ను సిద్ధం చేశాకే ఆగేటును, మిగతా గేట్లను ఎత్తనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈవానాకాలం వెళ్లేంత వరకు కేవలం వచ్చిన నీరు దిగువకు సాఫీగా వెళ్లేందుకు మాత్రమే ఏర్పాట్లు చేస్తున్నారు.

దిగువన షీట్‌ఫైల్స్.. పిల్లర్ల కింద సాండ్ గ్రౌంటింగ్

బ్లాక్-7లో గేట్లు, పిల్లర్లు వరదను తట్టుకునేందుకు బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నారు. వరద తాకిడికి పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద నుంచి ఇసుక వెళ్లి బుంగ పడే అవకాశం ఉండటంతోనే బ్లాక్-7కు దిగువన షీట్‌ఫైల్స్ ఏర్పాటు తప్పని సరైనట్టు అధికారులు భావిస్తున్నారు. పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల కింద ఉండే ఇసుకు జారుకుంటూ వచ్చి షీట్‌ఫైల్‌ను తాకి అక్కడే

మిగతా 6వ పేజీలో..



జన్ను ఆదాం (ఫైల్) జన్ను విజయ్ (ఫైల్) జినుక గౌతమ్ (ఫైల్)

వివరాలు 7లో..

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెర చెరువులో మునిగి బాలుడి కన్నుమూత
- కుటుంబాల్లో విషాదం మిగిల్చిన వేర్వేరు ఘటనలు

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది జాగ్రత్తగా ఉండాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, శిక్షణ కార్యక్రమానికి హాజరైన పోలింగ్ సిబ్బంది



హనుమకొండ కలెక్టరేట్, మే21: ఈ నెల 27వ తేదీన నిర్వహించే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించనున్న పీఓ, ఏపీఓ, ఇతర ఎన్నికల సిబ్బందికి ఎన్నికల రోజు నిర్వర్తించే విధి నిర్వహణ బాధ్యతలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల రోజున పోలింగ్ సిబ్బంది విధి నిర్వహణ గురించి మాస్టర్ ట్రైనర్లు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, మహేందర్, శ్రీనివాస స్వామిలు అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్‌ల వినియోగాన్ని పీఓ, ఏపీఓలకు ప్రత్యక్షంగా మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్‌తో పాటు వివిధ మండలాల తహశీలార్దులు, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్స్ అయిన 1) అల్లెపు అలియాస్ దున్నపోతుల అమూల్య, తండ్రి : కే.శే. అల్లెపు రాజు, వయస్సు : 28 సంవత్సరాలు, వృత్తి : గృహిణి, నివాసము : కిష్టాజిగూడెం గ్రామం, జెల్దాప్ మండలం, జనగాం జిల్లా, 2) అల్లెపు అలియాస్ అలకుంట్ల అఖిల, తండ్రి : కే.శే. అల్లెపు రాజు, వయస్సు : 26 సంవత్సరాలు, వృత్తి : గృహిణి, నివాసము : గ్రా॥ ఉప్పుగల్లు, మం॥ జఫర్‌గడ్, జిల్లా జనగాం అదేశానుసారం ఈ ప్రకటన జారిచేయునైనది.

ఈ దిగువ తెలిపిన షెడ్యూలు స్థిరాస్తులు వీరి తండ్రి గారైన కే.శే. అల్లెపు రాజు, తండ్రి : అల్లెపు ఐల్లయ్య గారికి వారసత్వ స్థిర ఆస్తులు వంశపాలలో భాగంగా సంక్రమించినవి సదరు ఆస్తులను కొంతమంది వ్యక్తులు నా క్లయింట్స్‌కు తెలుపకుండా నా క్లయింట్స్‌కు రావలసిన వాటాలను కూడా కలుపుకొని 3వ వ్యక్తులకు అమ్మటానికి ప్రయత్నం చేయుచున్నారు అని తెలిసినది. సదరు స్థిరాస్తులపై ఎవరైనా, ఏవిధమైన లావాదేవీలు జరిపిన నా క్లయింట్స్ తీసుకునే చట్టపరమైన చర్యలకు వారు బాధ్యులగుదురు అని ఇందుమూలముగా తెలియపరచనైనది.

షెడ్యూలు - ఎ : వ్యవసాయ ఖుష్కి భూమి సర్వే నెం. 319/1/2, గ్రా॥ దామెర, మం॥ ఎల్కతుర్తి, జి॥ హనుమకొండ, విస్తీర్ణం 2 ఎకరములు ఇట్టి హద్దులు : తూర్పు : రోడ్, పడమర : బొప్పరాజు బాబురావు గారి భూమి, ఉత్తరం : రాచాల పెద్దన్న గారి భూమి, దక్షిణం : బోలు రమేష్ మరియు ఇతరులు.

షెడ్యూలు - బి : ఇ.నెం. 8-43, దామెర గ్రామ పంచాయతి, మండలం ఎల్కతుర్తి, జి॥ హనుమకొండ, నాలుగు రూమ్‌ల ఆర్.సి.సి. బిల్డింగ్ కలుపుకొని విస్తీర్ణం : 9 గుంటలు ఇట్టి హద్దులు : తూర్పు : గుర్రం మల్లయ్య గారి ఇల్లు, పడమర : పల్లెపు లక్ష్మయ్య ఇల్లు, ఉత్తరం : చెరువు కుంట, దక్షిణం : రోడ్.

షెడ్యూలు - సి : ఇ.నెం. 10-4-10/బి/115, అడ్డగుట్ట ఈస్ట్ మారెడ్‌పల్లి, సికింద్రాబాద్‌లో గల రెండు రూమ్‌ల ఆర్.సి.సి. బిల్డింగ్‌తో కలుపుకొని 30 చదరపు గజముల విస్తీర్ణం ఇట్టి హద్దులు : తూర్పు : ఇతరుల ఇల్లు, పడమర : బలయ్య గారి ఇల్లు, ఉత్తరం : రోడ్డు, దక్షిణం : నరేష్ గారి ఇల్లు.

షెడ్యూలు - డి : అడ్డగుట్ట ఈస్ట్ మారెడ్‌పల్లి, సికింద్రాబాద్‌లో గల రెండవ ఇల్లు విస్తీర్ణం 30 చదరపు గజాలు రెండు రూమ్‌ల ఆర్.సి.సి. కలుపుకొని 30 చదరపు గజముల విస్తీర్ణం బిల్డింగ్ ఇట్టి హద్దులు : తూర్పు : అనిత గారి ఇల్లు, పడమర : రోడ్, ఉత్తరం : బలయ్య గారి ఇల్లు, దక్షిణం : రోడ్.

ఇట్లు : మచ్చ రాజేందర్, అడ్వకేట్, ఇ.నెం. 2-5-233, నక్కలగుట్ట, హనుమకొండ. సెల్ : 9573226461

నేడు నగరానికి కేటీఆర్



రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్‌కు వస్తున్నారు. బుధవారం ఉద యం 11గంటలకు నర్సంపేటలో జరిగే ఎన్నికల ప్ర చార సభలో పాల్గొననున్న కేటీఆర్.. మధ్యాహ్నం హనుమకొండకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3గంట లకు వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4గంటలకు సీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పట్టభద్రుల సమా వేశంలో పాల్గొననున్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

- అప్పుడే పోయిన సెల్‌ఫోన్ దొరుకుతుంది
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



యజమానులకు ఫోన్లు అందిస్తున్న కమిషనర్

వరంగల్ క్రైం, మే 21: ఎవరైనా తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే తక్షణమే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఈఐఆర్ ద్వారా పట్టుకున్న 142 సెల్‌ఫోన్లను మంగళవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తిరిగి యజమానులకు అందించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. టెలికామ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్‌సైట్ ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెబ్‌సైట్‌లో పూర్తివివరాలతో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. అప్‌లోడ్ చేసిన అనంతరం తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ఈ అవకాశాన్ని సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు వినియోగించుకోవా లన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ డేవిడ్‌రాజ్, ఐటికోర్ కానిస్టేబుల్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇన్‌-చార్జ్ వీసీగా వాకాటి కరుణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గతంలో 'వరంగల్' కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం
- ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీ లేనట్లేనా?



వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పదవీ కాలం మంగళవారం ముగిసింది. దీంతో అదే రోజున ఇన్‌చార్జి వీసీగా కరుణను ప్రభుత్వం నియమించింది. కరుణ నియామకంపై అధ్యాపక, విద్యార్థి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడం, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరుండడంతో కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీస్తారనే నమ్మకం ఉందని చెబుతున్నారు.

సుపరిచుతురాలే..

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వాకాటి కరుణకు మంచి పేరుంది. కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో మంచి అడ్మినిస్ట్రేటర్‌గా అందరి మన్ననలు అందుకుంది. ఆమె నియామకం పట్ల వర్సిటీ వర్గాల్లోనూ సానుకూల అభిప్రాయలే వ్యక్తం అవుతున్నాయి. ఐఏఎస్ అధికారిణి కావడంతో తాజా మాజీ వీసీ రమేష్‌పై జరుగనున్న విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగే అవకాశం ఉన్నట్లు వారు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయనపై వచ్చిన అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని అధ్యాపక, విద్యార్థి వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

పూర్తిస్థాయి వీసీ లేనట్లేనా...?

కేయూకు ఇప్పట్లో పూర్తిస్థాయి వీసీని నియమించే అవకాశాలు లేనట్లు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కేయూకు మాత్రం ఏర్పాటు చేయ లేదు. వీసీ పదవీ కాలం ముగింపునకు మూడు రోజుల ముందే విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడం, తీవ్రమైన ఆరోపణల మధ్య వీసీ పదవీ కాలం ముగియడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేయూ లో గందరగోళ పరిస్థితులు ఉండటంతో వర్సిటీ పాలన గాడిలో పడేంత వరకు ఐఏఎస్ అధికారిని వీసీ ఇన్‌చార్జిగా కొనసాగించి ఆందోళనలు సద్దుమణి గాక పూర్తి స్థాయిలో వీసీని నియమించే అవకాశాన్ని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY

ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి

బ్లాక్ & వైట్ స్క్వేర్ సెం.మీ. Rs. 170/-

ప్రతి మంగళ వారం & శుక్ర వారం మాత్రమే కలర్ స్క్వేర్ సెం.మీ. Rs. 220/-

సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...

వివరాలకు సంప్రదించగలరు

హన్మకొండ: 9985411677, 9985411676,
వరంగల్: 9985406150, 9985408173
జనగామ: 9866431354, మహబూబాబాద్: 9985418040
తొర్రూరు: 9985408003 జయశంకర్: 9985401232

వెలవెలబోతున్న బీఆర్ఎస్ పార్టీ




- గత ప్రభుత్వంలో మంత్రుల ఆదేశాలకే దిక్కులేదు..
- పెండింగ్‌లో రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్
- మాజీ మంత్రి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

వివరాలు 7లో..

ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలి..

- కాంగ్రెస్ అభ్యర్థి ఓ చీటర్.. బీఆర్ఎస్ అభ్యర్థి విద్యావంతుడు
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వివరాలు 7లో..

కేయూలో వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర

- చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్
- వీసీ కీలక ఫైళ్లు మాయం చేస్తున్నారని అధ్యాపకుల ఆందోళన
- రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల
LOVE ME చిత్రంతో పునఃప్రారంభమవుతున్న థియేటర్స్


సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల


లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
LIGHTHOUSE CINE MAGIC 9246547212

ఎంజీఎంలో నిలిచిన విదుత్ సరఫరా


అంధకారంలో ఎంజీఎం ఆస్పత్రి ఆవరణ

వరంగల్ మెడికల్, మే 21: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం సుమారు ఆరు గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 4.30 గంటలకు పోయిన కరెంటు.. రాత్రి 9.30 గంటల వరకు వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ల ద్వారా ఎమర్జెన్సీ వార్డులకు కరెంటు అందించారు. చాలావార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు బయటకు వచ్చారు. వేసవి ఉక్కపోతకు ఇబ్బంది పడ్డారు. గతంలో కూడా ఇలాగే జరిగినా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదు. వచ్చే వర్షాకాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే సాధారణ రూములతోపాటు ఎమర్జెన్సీ రోగుల ప్రాణాలకు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందని రోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా ఆస్పత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన అకుట్ సభ్యులు

కేయూలో వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర

చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్

వీసీ కీలక ఫైళ్లు మాయం చేస్తున్నారని అధ్యాపకుల ఆందోళన


వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. మంగళవారం పరిపాలన భవనం ఎదుట వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. 'తాటికొండ అవినీతి అనకొండ' అనే ఫ్లెక్సీతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వీసీ రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. మంగళవారం వీసీ పదవీ కాలం ముగియడంతో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు మాయం చేశారని విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేశారు. వీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వీసీ అక్రమాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, కేయూలో వీసీ రమేష్ లాడ్జీ నుంచి కీలక ఫైళ్లు యామమైనట్లు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ యూనియన్(అకుట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు అయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ.. వీసీ లాడ్జీ వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా వీసీ రమేష్ తన పాలనను లాడ్జీ నుంచే కొనసాగించారని, విజిలెన్స్ విచారణంలో అవసరమ్యే ఫైళ్లను ఫ్యాబ్రికేట్ చేయడానికి బయటకు తరలించారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ కారులో వాటిని బయటకు తీసుకెళ్లడంపై తమకు అనుమానం ఉన్నదన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలు, మార్కుల లిస్టులు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉన్నట్లు వారు అనుమానాలు వ్యక్తం చేశారు. న్యాక్‌కు సంబంధించిన బిల్లులను సరిచేయడంతో పాటు ఇతరత్రా ఫైళ్లలో మార్పులు, చేర్పులు చేసేందుకు వీసీ ఫైళ్లను తరలించి ఉంటారని ఆరోపించారు.

కాగా, ఈ విషయమై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వీసీ రమేష్ తన వ్యక్తిగత పుస్తకాలు, జ్ఞాపికలు తదితర వస్తువులు తీసుకెళ్లి ఉంటారని సర్దిచెప్పడాన్ని వారు త్రీంగా ఖండించారు. ఒకానొక దశలో రిజిస్ట్రార్‌తో అకుట్ సభ్యులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జీ నుంచి ఫైళ్ల మాయం, సీసీ కెమెరాల ఫుటేజీ కోసం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లపై కేసు

వరంగల్ క్రైం, మే 21: ఈనెల 11న కె.రాజేష్ అనే వ్యాపారిపై జరిగిన దాడి కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లతోపాటు ఒక ప్రభుత్వ ఉద్యోగిపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 11న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం.డి.తాజొద్దిన్ పుట్టిన రోజు విందుకు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు కరుణాకర్ (బచ్చన్నపేట), రమేశ్ (రాయపర్తి)తో పాటు మహేందర్‌రెడ్డి (ప్రభుత్వ ఉద్యోగి), కె.రాజేష్ (వ్యాపారి) హాజరయ్యారు. విందులో తాజొద్దిన్‌తోపాటు మరో ముగ్గురు.. మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. కానిస్టేబుళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగి చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించిన రాజేష్.. వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన నలుగురు.. రాజేష్‌ను కారులో తీసుకువచ్చి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బాల జంక్షన్ వద్ద దాడి చేసి వదిలి వెళ్లారు. రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు.. తాజొద్దిన్, కరుణాకర్, రమేశ్‌తోపాటు మహేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు విషయాన్ని కేయూ పోలీసులు రహస్యంగా ఉంచారు.

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల


SKML MOTION PICTURES Through GANESH BHARI 9296509333

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల


లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ | వెంకటసాయి 70ఎంఎం ఎ/సి - కీసర
SRI LAKSHMI PICTURES RELEASE 9885291789


బ్యారేజీకి దిగువన ఉన్న అప్రోచ్ రోడ్డు

వరదలను తట్టుకొనేలా..

(5వ పేజీ తరువాయి)

ఆగితే వరద ప్రభావం నివారించవచ్చనే షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. షీట్‌ఫైల్స్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా బ్యారేజీకి దిగువన ఉన్న కాంక్రీటు స్లాబ్‌ను కట్‌చేస్తూ పనులను ముమ్మరం చేస్తున్నారు. దీంతో పాటు పిల్లర్లు కుంగుబాటుకు గురైన తర్వాత బ్లాక్-7లో చేపట్టిన ఈఆర్‌టీ(ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్), జీపీఆర్(జియో ఫిజికల్ రాడార్) టెస్టుల ఆధారంగా గ్రౌంటింగ్ చేయనున్నట్లు తెలిసింది. ఫోమ్ గ్రౌంటింగ్‌తో పిల్లర్లు, ర్యాఫ్ట్‌ల క్రింద ఉన్న బుంగలను పూడ్చాలని తొలుత నిర్ణయించినా.. ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో సాండ్ గ్రౌంటింగ్‌తోనే వాటి కింద ఉన్న బుంగలను పూడ్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. సాండ్ గ్రౌంటింగ్ ప్రక్రియలో ఈఆర్‌టీ, జీపీఆర్ పరీక్షల ఆధారంగా ర్యాఫ్ట్‌లకు హోల్స్ వేసి ఇసుక, స్యాండ్‌ను మిక్స్‌ను వేసి బుంగలను పూడిస్తే మళ్లీ వచ్చే వరదలకు సీపేజీ సమస్యను నివారించడంతోపాటు తాత్కాలికంగా ర్యాఫ్ట్, పిల్లర్లకు అదనపు శక్తి చేకూరుతుందనేది సాండ్ గ్రౌంటింగ్ ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు.

బ్యారేజీలో అప్రోచ్ రోడ్ల తొలగింపు

బ్లాక్-7లో గేట్ల ఎత్తివేత, స్యాండ్ గ్రౌంటింగ్, బ్యారేజీకి దిగువన షీట్ ఫైల్స్ ఎర్పాటు పూర్తవ్వగానే గోదావరి నదిలో బ్యారేజీకి ఎగువన, దిగువన ఉన్న అప్రోచ్ రోడ్లను సైతం తొలగించనున్నారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో ఉన్న కాఫర్‌డ్యామ్‌కు సంబంధించి ఉన్న షీట్‌ఫైల్స్, కాంక్రీటు వ్యర్థాల తొలగింపు ప్రక్రియ గతంలోనే ప్రారంభమవగా.. అది చివరి దశకు చేరుకుంది.

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
విశ్వనాథ్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
CONTACT: 7799172022

ఈనెల 24న బ్రహ్మాండమైన విడుదల


దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
SUCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

విజయవంతమైన 3వ వారం


శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
GLOBAL CINEMAS LLP

విజయవంతమైన 3వ వారం


సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15
GLOBAL CINEMAS LLP

SUPER HIT నేడే చూడండి

సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్ 11.30,6.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్ 11.30am
NTR CINEMAS & RUSHIKESHWAR FILMS 9030161717, 9849076540

సివిల్స్ అభ్యర్థులకు ఉపకార వేతనాలు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న స్వచ్ఛందసంస్థ

జఫర్‌గడ్, మే 21: సివిల్స్ శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొంగర ఎడ్యుకేషన్ హైద్రాబాద్ సంస్థ ప్రతినిధులు కొంగర గంగాధర్‌రావు, జెట్టి రవికుమార్ తెలిపారు. మంగళవారం వారు జఫర్‌గడ్‌లో మాట్లాడుతూ.. సివిల్స్ పరీక్ష రాయాలనే అభ్యర్థులు.. శిక్షణ పొందేందుకుగాను తమ సంస్థ యేటా ఉపకార వేతనాలు అందిస్తోందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులని, ఈ పరీక్ష ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి వారికి సివిల్స్ శిక్షణ కోసం ఉపకార వేతనాలు అందజేస్తామని అన్నారు. అభ్యర్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జూన్ 23వ తేదీన వరంగల్‌లో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఎలాంటి రుసుము లేదన్నారు. పూర్తి వివరాలకు 9346777568 మొబైల్ నంబరులో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు సూచించారు.

గ్రీన్ చాంపియన్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ చాంపియన్ అవార్డుల కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈసెట్‌లో మెరిసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు



ఎం. నవ్యశ్రీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: ఈసెట్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎస్.దీక్షిత్ 3వ ర్యాంకు, పి.వివేక్ 4వ ర్యాంకు, బి.హేమశ్రీ 9 ర్యాంకు, పి.నాగసాయి 19వ ర్యాంకు సాధించారన్నారు. ఈసీఈలో ఎం. నవ్యశ్రీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, వి.వైష్ణవ్ 2, వి.అర్షిత 5, కె.హర్షిత్ 6, పి.హారిక 7, ఎం.డి. సొహైల్ 11, ఈఈఈలో టి.శ్రీవాత్సవ్ 2, ఎం.కౌశిక్ కుమార్ 4, మెకానికల్‌లో కె.చందు 2, బి.నిఖిల్ 10, ఓ.గౌతమ్ 12వ ర్యాంకు సాధించారన్నారు.

ఈ- సేవల మూగనోము!

- వారం రోజులుగా పని చేయని కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- లక్షల్లో నిలిచిపోయిన పన్ను చెల్లింపులు
- మరో ఐదు రోజుల పాటు ఇదే పరిస్థితి



హనుమకొండ అశోకా జంక్షన్ వద్ద మూసి ఉన్న ఈ-సేవా కేంద్రం

వరంగల్ కార్పొరేషన్, మే 21: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు పన్నుల చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇంటి పన్నులు, యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించాలని నగర పాలక సంస్థ మైకులు పెట్టి మరీ ప్రచారం చేసింది. అయితే ప్రయోజనముంది.. పన్నులు వసూలు చేయాల్సి బల్దియా ఈ-సేవ కేంద్రాలు మూగ నోములు నోముతున్నాయి. వారం పాటు ఈ-సేవలు అందించక అక్కడి కంప్యూటర్ల స్క్రీన్లు మసకబారిపోయాయి. అక్కడ పని చేసే సిబ్బంది ప్రజలకు చెప్పలేక కార్యాలయాలకు తాళం వేసి బయటకు వెళుతున్నారు. సాంకేతికలోపంతోపాటు నెట్‌వర్క్ సవరణ చేస్తుండడంతో ఈ ఇబ్బంది ఏర్పడినట్లు వినియోగదారులకు సిబ్బంది చెబుతున్నారు. నగర పాలకసంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తుండగా, ఒక్క సెంటర్‌లో కూడా సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ వెకెట్ ల్యాండ్ చార్జీలతో పాటు మరి కొన్ని యూజర్ చార్జీలు చెల్లించేందుకు వచ్చిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. గడువు తేదీ దాటిపోయి అదనపు భారం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్షల్లో నిలిచిపోయిన పన్నులు

ఈ- సేవా కేంద్రాల్లో సాంకేతిక లోపం ఏర్పడడంతో బల్దియా ఖజానాకు గండిపడింది. ప్రతీ



నక్కలగుట్టలో పని చేయని ఈ-సేవా కేంద్రం

రోజు వివిధ రూపాల్లో లక్షల్లో వసూలయ్యే డబ్బు ప్రజల వద్దనే ఉండిపోతోంది. ఇప్పటికే బల్దియా మలేరియా సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు జీతాల కొరత ఉన్నప్పటికీ వారం రోజులుగా కంప్యూటర్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు సిబ్బంది తమ తప్పు ఏమిలేదని, అంతా హైదరాబాద్‌లో వరంగల్ జీడబ్ల్యుఎంసీ సైట్ అప్‌డేట్ చేయడం వల్ల ఈ సమస్య ఎదురైందని చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా మరో ఐదు రోజుల పాటు ఇదే సమస్య ఉంటుందని కంప్యూటర్ నిపుణులు, సెంటర్ల ఉద్యోగులు పేర్కొంటున్నారు. పన్నుల చెల్లింపులు వేగవంతం కావాలంటే ఈ- సేవా కేంద్రాలు త్వరంగా పని చేసేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బల్దియా పరిధిలో ఈ- సేవా కేంద్రాలు

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 12 ఈ- సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. హనుమకొండ పరిధిలో కాజీపేట సర్కిల్ ఆఫీస్-2, సుబేదారి వాటర్ ట్యాంక్, నక్కలగుట్ట బల్దియా కార్యాలయం, మచిలీబజార్ కమ్యూనిటీ హాల్, అశోకా జంక్షన్ సర్కిల్, నయీంనగర్‌లో ఈ- సేవ సెంటర్లు పని చేస్తున్నాయి. అదే విధంగా వరంగల్ పరిధిలో బల్దియా ప్రధాన కార్యాలయం, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ సర్కిల్-1, హెడ్‌పోస్ట్ ఆఫీస్, శివనగర్, కరీమాబాద్‌లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ- సేవలు ప్రజలకు సేవలందిస్తాయి. ఇందులో ఒక్కో సెంటర్‌లో ఇద్దరి నుంచి ముగ్గురు పనిచేస్తారు. ఈ కేంద్రాలను వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమస్య ఉంది..

అనిసుర్ రషీద్, బల్దియా అదనపు కమిషనర్

ఏప్రిల్ చివరి వరకు ఇంటి పన్నులో వడ్డీలో 5శాతం రాయితీ ఇచ్చాం. కొందరు చెక్కులు సమర్పించి రశీదులు పొందారు. కానీ కొన్ని చెక్కులు బ్యాంకులో చెల్లుబాటుకాక పోవడం, బల్దియాకు డబ్బులు చెల్లించినట్టు రశీదేలు కలిగి ఉండడంతో ఈ సమస్య ఎదురైంది. ఈ సమస్యలు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ చూస్తుంది. ఒకటి, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కారం జరిగి ప్రజలకు సేవలు అందిస్తారు.

భద్రకాళి సన్నిధిలో పుల్లెల గోపీచంద్



భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న పుల్లెల గోపీచంద్ దంపతులు

వరంగల్ కల్చరల్, మే 21: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పద్మశ్రీ పుల్లెల గోపీచంద్ దంపతులు మంగళవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితోపాటు క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వీరి చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈత సరదా.. ముగ్గురి ప్రాణాలు తీసింది..

- ఏనుమాముల ముసలమ్మకుంటలో ఇద్దరు యువకుల మృతి
- బయ్యారం దామెరచెరువులో మునిగి బాలుడి కన్నుమూత

కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఘటనలు



జన్ను ఆదాం, జన్ను విజయ్ మృతదేహాలు

వరంగల్‌సిటీ/ బయ్యారం, మే 21: ఎండలవేళ ఈత సరదా ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఓ బాలుడు సహా ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటనలను ఆయా కుటుంబల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఘటనలకు సంబంధించిన వివరాలివీ.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన జన్ను విజయ్ అలియాస్ ఏసు(38), జన్ను ఆదాం(34) ఇద్దరూ పెయింటర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇరుగుపొరున ఉండే ఈ ఇద్దరు రోజూ లాగే మంగళవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చారు. అప్పటికే ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో జన్ను విజయ్, తన కుమారుడు జన్ను వివేక్, జన్ను ఆదాం తన కుమారుడు జన్ను ఆదిత్య, స్థానికంగా ఉండే మరోవ్యక్తి జన్ను రాహుల్ కలి టసి ఈత కొట్టేందుకని గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంట వద్దకు చేరుకున్నారు. తమ పిల్లలను గట్టున ఉంచి.. విజయ్, ఆదాం నీటిలోకి దిగారు. వారు ఈత కొడుతూ ఆ కుంటలో ఉన్న బురదగుంతలో చిక్కుకుని ఎంతకీ పైకి రాలేదు. గట్టుపైనున్న వారి పిల్లలు గమనించి కేకలు వేయడంతో పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీ, దేశాయిపేటకు చెందిన వారు అక్కడికి చేరుకుని గాలించి.. వారిని బయటికి తీయగా అప్పటికే విజయ్, ఆదాం మృతిచెందారు. అప్పటికే ఈ సమాచారం అందుకున్న ఏనుమాముల ఎస్‌ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. జన్ను ఆదాం భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదాంకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉండగా, విజయ్‌కి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఎంజీఎం మార్చురీకి తరలించామని, ఎస్‌ఐ శ్రీకాంత్ కేసును దర్యాప్తు చేస్తున్నారని సీఐ పులి రమేష్ తెలిపారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి బాలుడు..



గౌతమ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని దామెరచెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ ఎనిమిదో తరగతి విద్యార్థి మృత్యువాత పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన జినుక లక్ష్మీనారాయణ, రేణుక దంపతుల కుమారుడు గౌతమ్ (14) మహబూబాబాద్‌లోని సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన గౌతమ్ ఈత నేర్చుకునేందుకని తన చిన్నమ్మ కుమారుడు గోపాలదాసు గణేష్‌తో కలిసి తమ ఇంటి సమీపంలోని దామరచెరువుకు వెళ్లాడు. అయితే అతడు తాను దిగిన ప్రాంతంలో లోతుగా ఉందన్న విషయాన్ని గమనించని గౌతమ్ నీటిలో మునిగి మృతి చెందాడు. అతడికి తోడుగా వెళ్లిన గణేష్ పరుగున ఇంటి వచ్చి కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో వారు స్థానికుల సాయంతో చెరువులో వెతికి.. గౌతమ్‌ను బయటకు తీసి బయ్యారం పీహెచ్‌సీకి తరలించారు. కానీ గౌతమ్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. గౌతమ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జినుక లక్ష్మీనారాయణకు కుమారుడు గౌతమ్, కుమార్తె ఉండగా.. కుమారుడి మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలి..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి

రాంనగర్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టులా ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న యూట్యూబ్ చానెల్ పెట్టి దందాలు చేసే చీటరని విమర్శించారు. ఆయనకు అవకాశం ఇస్తే ప్రమాదమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని ఆయన ఆరోపించారు. తీన్మార్ మల్లన్న, రేవంత్‌రెడ్డిలు ఇద్దరు ఇద్దరేనని, ఇద్దరు మోసగాళ్లేనని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటికూడా నెరవేర్చలేదన్నారు. చిన్నచిన్న కారణాలు చూపి కాళేశ్వరానికి నీరు రాకుండా చేశారని, కరెంటు, సాగునీరు అందించలేదన్నారు. ఆరోగ్యశ్రీ అతిగతీ లేదని, కల్యాణలక్ష్మీ పథకాన్ని బుట్టదాఖలు చేశారని, నిరుద్యోగ భృతి అందించలేదన్నారు. ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికల తర్వాత ఓ మాట రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల పక్షాన శాసనమండలిలో గళమెత్తుతాడని దయాకర్‌రావు తెలిపారు.

మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిలరని, బీజేపీ అభ్యర్థి అసమర్థుడని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విద్యావంతుడు, ప్రజలకు సేవచేయాలనే తపన కలిగిన సమర్థుడని ఆయన తెలిపారు. పెద్దల సభ రైటర్స్‌కు వేదిక కావాలని, చీటర్స్‌కు వేదిక కాకూడదన్నారు. చీటరైన తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తికి అవకాశం కల్పిస్తే ప్రమాదమన్నారు. అధికార పార్టీని ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రసమయి బాలకిషన్, సతీష్ బాబు, నేతలు సంజయ్, రవిందర్‌సింగ్, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న బీఆర్ఎస్ పార్టీ

మాజీ మంత్రి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హనుమకొండ టౌన్, మే 21: ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ.. ఇప్పుడు ఆదరణ లేక వెలవెలపోతున్నదని మాజీ మంత్రి, బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రుల మాటకే దిక్కులేదని, ప్రజలు వచ్చి సమస్యలు చెప్పుకున్నా పరిష్కరించే అధికారం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.7,500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటేస్తే బాధితుల తరఫున ప్రశ్నించలేరని పేర్కొన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. 2021 నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు రావల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో వారు నరకయాతన అనుభవిస్తున్నారని ఈటల అన్నారు.

కుల, మత భేదం లేకుండా దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడుతున్న మోదీ నాయకత్వాన్ని పట్టభద్రులు బలపర్చాలని కోరారు. స్వచ్ఛభారత్ పేరుతో దేశంలో మారుమూల గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి మోదీ అని పేర్కొన్నారు. అమెరికా వంటి అగ్రరాజ్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్ అమలు కావడానికి పదేళ్ల పట్టిందని, కానీ మోదీ చొరవతో భారత్ మూడేళ్లలోనే అమలులోకి వచ్చిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాలు సమస్యలను పరిష్కరించేందుకు మోదీని ఆశ్రయిస్తున్నాయన్నారు. అలాంటి కీర్తిని భారత్‌కు తీసుకొచ్చిన మోదీని ప్రజలు ఆదరించాలన్నారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్‌గాంధీ వరకు 'గరీబ్ హఠావో' అనే ఒకే నినాదంతో వస్తోంది తప్ప.. పేదరికాన్ని నిర్మూలించింది లేదని విమర్శించారు. ప్రేమేందర్‌రెడ్డి 40 ఏళ్ల అనుభవం, విద్యాభ్యాసం పట్టభద్రుల పక్షాన ప్రశ్నించేందుకు దోహదం చేస్తుందని ఈటల పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వాగ్దేవి కళాశాలల అధినేత దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో అవకతవకలు

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రాంనగర్, మే 21: పౌర సరఫరాలశాఖ పరిధిలో జరుగుతున్న టెండర్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని, అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం బియ్యం సరఫరా, ధాన్యం టెండర్లు అర్హత లేని కేంద్రియ బండార్ లాంటి సంస్థలకు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై మూడురోజులుగా తాము ఆరోపణలు చేస్తున్నప్పటికీ మంత్రులు స్పందించడం లేదన్నారు. ఈ విషయంలో భారీగా డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. ఎవరికి ముట్టేవి వారికి ముట్టాయి కాబట్టే.. ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదని ఆయన దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కేంద్రియ బండార్ సంస్థకు టెండర్లు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అవకతవకల విషయమై ఈనెల 23న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సివిల్ సప్లయి కమిషనర్‌కు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రవీందర్‌సింగ్, జోరిక రమేశ్, వీరేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వర్క్‌షాపులో బల్దియా కమిషనర్

లేక్ ప్రొటక్షన్‌పై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 21: హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో మంగళవారం రాష్ట్ర మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి సీడీఎంఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర పాలక సంస్థ నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు. 'లేక్ ప్రొటక్షన్ అండ్ రెజువినేషన్ ఇన్ అర్బన్ ఏరియాస్' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నీటి వనరులు కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని, ఒక రోజు వర్క్‌షాపు ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నామన్నారు. సీడీఎంఏ గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహిస్తే సహజ వనరులు రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, సీడీఎంఏ దివ్య దేవరాజన్, వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు



విజయ్ (ఫైల్)

కాజీపేట, మే 21: జిమ్ సెంటర్ బోర్డు సరిచేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఒకరు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట నిట్ సమీపంలో పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న బ్లూఫిట్‌నెట్ జిమ్ సెంటర్ ఐరన్ ఫ్లెక్సీ బోర్డు ఇటీవల గాలివానకు ఊడిపోయింది. బోర్డును సరిచేసేందుకు జిమ్‌సెంటర్‌లో పనిచేసే దర్గా కాజీపేటకు చెందిన విజయ్(28) ప్రయత్నించగా కుదరలేదు. దీంతో జిమ్‌లో శిక్షణ కోసం వచ్చిన రాము, విష్ణు, సందీప్, విజయ్ కలిసి బోర్డును తీసేందుకు ప్రయత్నించగా ప్రక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు విజయ్‌కి తాకాయి. ఈ ఘటనతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో శిక్షణకు వచ్చిన రాము, విష్ణు, సందీప్‌లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, విజయ్ ఎంబీఏ పూర్తి చేసి జిమ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడు అవివాహితుడు.

'టెన్నిస్'పై క్రేజ్

నగరంలో విస్తరిస్తున్న క్రీడ

ఆసక్తి కనబరుస్తున్న యువత



లాన్ టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, మే 21: సంపన్నుల క్రీడగా పేరుగాంచిన లాన్ టెన్నిస్ క్రీడ నగరంలో రోజు రోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైన లాన్ టెన్నిస్ క్రీడపై నగరంలోని యువత ఆసక్తి కనబర్చుతున్నారు. క్రేజీ గేమ్‌గా పిలువబడే ఈ ఆటలో శిక్షణ పొందాలంటే సామాన్యులకు ఆర్థికంగా భారంగా ఉండేది. వేల రూపాయలతో రాకెట్‌లు కొనలేక సామాన్య యువకులు ఈ క్రీడపట్ల సుముఖత చూపించకపోయేవారు. ఇప్పుడు ఈ టెన్నిస్ క్రీడపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అతి తక్కువమంది ఆడే లాన్ టెన్నిస్ క్రీడ.. ఇప్పుడు నగరంలో అత్యాధునిక హంగులు, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన కోర్టులు అందుబాటులోకి రావడంతో చాలామంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో పలు ప్రయివేటు పాఠశాలతో పాటు డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియం సమీపంలో అత్యాధునిక హంగులతో కూడిన (సింథటిక్) టెన్నిస్ కోర్టు, అదే విధంగా సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లోని టెన్నిస్ కోర్టుల్లో రోజూ వందల మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో మే1 నుంచి ఏర్పాటు చేసిన లాన్ టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో నగరంలోని యువత పెద్దఎత్తున ఉత్సాహం కనబరుతున్నారు.

అధునాతన కోర్టులు

హనుమకొండ జేఎన్ఎస్‌లో రెండు సింథటిక్ కోర్టులు, సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రెండు కోర్టులు, హనుమకొండ నిట్‌లో రెండు కోర్టులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు కోర్టులు ఏర్పాటు చేయడంతో నిత్యం వందల మంది క్రీడాకారులతో టెన్నిస్ కోర్టులు కళకళలాడుతున్నాయి. అదే విధంగా నగరంలోని వివిధ ప్రయివేటు పాఠశాలలో సైతం లాన్ టెన్నిస్ క్రీడ విస్తరిస్తోంది. స్కిల్ స్ట్రోక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో టెన్నిస్ కోర్టులు అందుబాటులో ఉండటం ద్వారా రోజు రోజుకూ ఈ క్రీడకు ఆదరణ పెరుగుతోంది.

చిన్నారులు, యువత ఆసక్తి చూపుతున్నారు

ఎ.నర్సయ్య, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

అత్యాధునిక టెన్నిస్ కోర్టులు జిల్లాతోపాటు నగరంలో అందుబాటులో ఉండటంతో చిన్నారులు, యువత ఈ క్రీడపై ఆసక్తి కనబర్చడంతో ఆదరణ పెరుగుతోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్నిస్ వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు యువత పెద్ద ఎత్తున తరలిరావడం అభినందనీయం. జిల్లా వ్యాప్తంగా టెన్నిస్ క్రీడ మరింత విస్తరించేందుకు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తోంది.

టెన్నిస్ అంటే ఇష్టం

ధరణి, క్రీడాకారిణి

ఇతర క్రీడల కంటే టెన్నిస్ క్రీడ అంటే చాలా ఇష్టం. టెన్నిస్ క్రీడలో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావడమే నా లక్ష్యం. వేసవి సెలవుల్లో జేఎన్ఎస్ టెన్నిస్ కోర్టులో ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా.. జిల్లా, రాష్ట్ర, జాతీయ టెన్నిస్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలనే సంకల్పంతో సాధన చేస్తున్నా..



ప్రసన్నాంజనేయస్వామికి నోట్లతో అలంకరణ

న్యూశాయంపేట, మే 21: హనుమకొండ పద్మాక్షిరోడ్డులో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం ఆలయ నిర్వాహకులు కరెన్సీనోట్లు, విదేశీ కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచారి ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, చందన సేవ, అర్చన, అలంకరణ చేశారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు గండె కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కను కుంట్ల రవికుమార్, కర్రు దశరథ్ కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రాతి సుధాకర్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

విదేశీ కరెన్సీ నోట్లతో అలంకరించిన ప్రసన్నాంజనేయస్వామి



రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



ఎన్జీవోస్ కాలనీలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



మడికొండలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోడగుట్టలో రాజీవ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

హనుమకొండ సిటీ, మే 21: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, నసీంజహాన్‌తోపాటు కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: కడిపికొండ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, నాయకులు ఎడబో యిన ప్రభాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కర్ర హరీష్‌రెడ్డి, తరాలపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎమ్డీ బషీర్, రాంపేట అధ్యక్షుడు దాడబోయిన రాజుయాదవ్, రాజారపు కిరణ్, బస్కె క్రిష్ణ, బస్కె నవీన్, 44వ డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి, సాం బరాజు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కాజీపేట: 47వ డివిజన్ బోడగుట్టలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి జరిగింది. డివిజన్ మాజీ అధ్యక్షుడు దొంగల కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇప్ప శ్రీకాంత్ హాజరై రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. రాజీవ్ దేశానికి చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ బిలాల్, పొలిశెట్టి సాయినాథ్ పటేల్, కోండ్ర ఎల్లయ్య, పిడుగు కుమార్, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మండల సమ్మయ్య ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి వృద్ధు లకు, పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గ్రేటర్ వరంగల్ 58, 60వ డివి



రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

జన్ల కాంగ్రెస్ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, జిల్లా నాయకులు తాళ్ల పెల్లి రవీందర్ (జేకే), మేరి, మహ్మద్ ఆరీఫ్, మహ్మద్ అక్మల్, శ్రీనివాస్, రవి, సంజీవ్, నవీన్, కమల్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పట్నాలు

వడ్డెపల్లి, మే 21: గీత కార్మికుల ఇలవేల్పు రేణుకా ఎల్లమ్మ బోనాలను పురస్కరించుకొని మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ దేవతకు పొత్తి పోసి పట్నాలను వేశారు. అమ్మవారికి ఇష్టమైన పసుపు కుంకుమలు, బెల్లం శాఖ, గాజులు, కొబ్బరి కాయలు, నైవేద్యం, నూతన వస్త్రాలను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో గోపాల్‌పూర్ గౌడ సంఘం నేతలు దూలం శ్రీనివాస్, దూలం పెద్దరాజు గౌడ్, వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, దూలం సదానందం గౌడ్, రావుల వెంకటరమేష్ గౌడ్, రమేష్ గౌడ్, దూలం పరమేశ్ గౌడ్, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద పట్నాలు వేస్తున్న గౌడ సంఘం నేతలు

నేడు సిరిధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన మేళా

వడ్డెపల్లి, మే 21 : హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రకృతి మిత్ర, సేంద్రియ సాగు, పండ్లు, సిరిధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా జీవ వైవిధ్య మండలి వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అన్నమనేని లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రకృతి ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రెల పెంపకదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు, మే 21 : ఆర్థికంగా నష్టపోయిన మేకలు, గొర్రెల పెంపకం దారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల పెంపకం దారుల సహకార సంఘం మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్ డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట వనమాల కనపర్తిలో జక్కుల సారయ్య, వెంకటమల్లు, ప్రశాంత్, అశోక్, చల్ల ఐలయ్యలకు చెందిన 33 మేకలు, గొర్రెలు నాము గడ్డితిని మృత్యువాతపడ్డాయి. మంగళవారం గ్రామంలో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి మాట్లాడుతూ.. ఐదుగురికి చెందిన 33 మేకలు, గొర్రెలు మృతిచెందడంతో సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. కలెక్టర్ స్పందించి బాధిత కుటుంబాలకు ఏదైన పథకం ద్వారా ఆర్థిక సహాయం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు జక్కుల రవి, బోయిన వెంకన్న, మల్లేపల్లి దాసరి చేరాలు, అర్కాల కుమారస్వామియాదవ్, బండి వెంకటస్వామియాదవ్, బాల కొంరయ్య, ఉప్పలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

హసన్‌పర్తి, మే 21: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన మండల కేంద్రానికి చెందిన దళిత విద్యార్థులకు మంగళవారం హసన్‌పర్తి సుజాత విద్యానికేతన్ హైస్కూల్‌లో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. దళిత నాయకుడు మేకల యుగంధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, సుజాత విద్యానికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ ఆకుతోట శాంతారాంకర్ణ, ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, బొక్క కుమార్, బోడ యుగంధర్, మేకల సిద్దార్థ, నాగరాజు, జన్ను సురేందర్, బిగుళ్ళ ప్రేమ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఆర్ఎఫ్ సిబ్బందికి అభినందనలు



మృతదేహాలను వెలికితీస్తున్న బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మే 21: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ముసలమ్మ కుంటలో మంగళవారం రెండు మృతదేహాలు చూసినట్టు స్థానికులు ముందుగా పోలీసులకు సమాచారం అందిం చారు. ఏనుమాముల పోలీసులు మృతదేహాలను వెలికి తీసేందుకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) అధికారికి విషయం ఫోన్‌లో తెలిపారు. దీంతో సంబంధిత అధికారి శంకర్‌లింగం వరంగల్ టీంను అప్రమత్తం చేశారు. వరంగల్ డీఆర్ఎఫ్ సిబ్బంది శంకర్, సాయి, అశోక్, కిరణ్, యూనస్‌ఖాన్‌లు వెంటనే ముసలమ్మకుంటకు చేరుకున్నారు. వారి వద్ద ఉన్న పరికరాలతో కుంటలో దిగి రెండు మృతదేహాలను గుర్తించారు. తాళ్ల సహాయంతో రెండు మృతదేహాలు జన్ను విజయ్ (38) జన్ను ఆదాం (36)లను వెలికి తీశారు. రెండు మృతదేహాలను వెలికి తీయడానికి రెండు గంటల సమయం పట్టిందని టీం లీడర్ సాయి తెలిపారు. సకాలయంలో స్పదించి పోలీసులకు, మృతుల కుటుంబాలకు సహకరించిన డీఆర్ఎఫ్ సిబ్బందిని నగర కమిషనర్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

కన్నీటి ధారల 'అనురాగ దీపం'

● ప్రముఖ సాహితీవేత్త గంటా రామిరెడ్డి ● అనురాగదీపం నవల ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, మే 21: అనురాగ దీపం నవల ఇతివృత్తం మొత్తం అంపశయ్య నవీన్ కన్నీటి ధారలే ఉన్నాయని ప్రముఖ సాహితీ వేత్త గంటా రామిరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని పాపడం బ్లూ బంక్వెట్ హాల్‌లో అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు కార్యదర్శి డి.స్వప్న, ప్రముఖ సాహితీ వేత్త గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు అధ్యక్షతన నవలా రచయిత అంపశయ్య నవీన్ భార్య అనసూయ ప్రథమ వర్ధంతి అనురాగ దీపం నవలా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరణ చేసి మాట్లాడారు. అనసూయతో ఉన్న గాఢమైన స్నేహబంధాన్ని ఉద్విగ్నభరితంగా ఈ నవలలో చిత్రించారు. ఈ నవలలో అనేక వాస్తవిక సంఘటనలను చిత్రించినప్పటికీ అంతర్లీనంగా కథా మొత్తం అనసూయ చుట్టూ తిరుగుతూ ఉంటుందన్నారు. సాహిత్య ప్రపంచంలో ఎవరైనా సతీవియోగం చెందితే కవిత్వం రాశారు కానీ.. ఏకంగా నవల రాసిన మొదటి వ్యక్తి నవీన్ అని అన్నారు. అనంతరం ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి గ్రంథాన్ని సమీక్ష చేస్తూ.. నవీన్ తన అంతరంగాన్ని ఈ నవలలో అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. 60 ఏళ్ల దాంపత్య జీవితంలో తనను కంటికి రెప్పలా కాపాడుకున్న అనసూయ ఎడబాటును తట్టుకోలేని నవీన్.. తన కన్నీళ్లను తన కలంలో ఇంకుగా రంగరించి రాసిన నవలే అనురాగ దీపం అని చెప్పారు. తన భార్యను ఒక స్నేహితురాలిగా, తన హృదయాంబరం మీద ఆడుకొనే అందమైన ఆడపిల్లగా ఊహించుకున్న నవీన్.. పుట్టిన రోజు నుంచి తాను నిష్క్రమించే వరకు జరిగిన సంఘటలను వరుస క్రమంలో నిక్షిప్తం చేశారని తెలిపారు. ఈ నవల భార్యాభర్తల మధ్య అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా ఎంతోమందికి ఆదర్శంగా నిలు స్తుందని అన్నారు. అనంతరం అనసూయ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అంపశయ్య నవీన్ లిటరరి ట్రస్టు కార్యదర్శి డి.స్వప్న, అమ్మంగి వేణుగోపాల్, కె.వలరక్ష్మి, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంటా రామిరెడ్డి, అంపశయ్య నవీన్

వయస్సు 26.. చోరీలు 30..

● జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలు
● నిందితుడి అరెస్టు..
● రూ.2.50 లక్షల విలువైన బైక్ స్వాధీనం

మట్టెవాడ, మే 21: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు వరంగల్‌లోని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 26 ఏళ్ల తిరుమలేష్ జల్సాలకు అలవాటుపడి తొమ్మిదేళ్లుగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 30 కొత్త మోటార్ సైకిళ్లను దొంగిలించాడు. ఎవరైనా కొత్తబైక్ కొంటే వారితో మాటలు కలిపి ఒకసారి ట్రయల్ చేసి చూస్తానని నమ్మించి బైక్‌కు పరారవుతున్నాడు. ఇప్పటికే పలు మార్లు జైలుకు వెళ్లాడు. మే 9న ములుగురోడ్ ప్రాంతంలో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన కామెర అరవిండ్ తన యమహా బైక్ సర్వీసింగ్ కోసం రావడంతో నిందితుడు తిరుమలేష్ అతడిని పరిచయం చేసుకొని ఇలాగే నమ్మించి బైక్‌తో పరార్ అయ్యాడు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి, బైక్ స్వాధీనం పర్చుకొని జ్యుడీషియల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. కేసు చేదనలో ప్రతిభకనర్చిన క్రైం కానిస్టేబుళ్ల అలీ, తిరుమతిలను సీఐ అభినందించారు.

రైల్వే క్రెడిట్ సొసైటీలో లోన్ల రగడ

పోలీస్‌స్టేషన్‌లో ఇరు సంఘాల ఫిర్యాదులు

కాజీపేట, మే 21: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) లిమిటెడ్‌లో మజ్దూర్ యూనియన్ సంఘ పాలక వర్గం లంచాలు తీసుకుని లోన్‌లు మంజూరు చేస్తున్నారంటూ వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. రూ.30వేలు లంచం తీసుకుని కాజీపేటకు చెందిన ఓ రైల్వే అధికారికి మ్యారేజ్ లోన్ మంజూరు చేశారని రైల్వే కార్మిక సంఘాలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టుల చేస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన సీసీఎస్ కో- ఆప్షన్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఆరోపణలు చేసిన సంఘ్ నాయకులపై ఫిర్యాదు చేశారు. అవకతవకలు ఎక్కడ జరిగాయో సరైన సాక్ష్యాలు లేకుండా సీసీఎస్ పాలక వర్గంపై వాట్సాప్‌లో ప్రచారం చేయడం సరికాదని, తమ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఖండిస్తూ సంఘ్ నాయకులపై రాఘవేందర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సంఘ్ నాయకులు సైతం అవకతవకలు జరిగింది వాస్తమే అంటూ సరైన సాక్ష్యాలతో సహా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై సీసీఎస్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ అడగగా లోన్‌కోసం దరఖాస్తు చేసిన వ్యక్తి కాజీపేటలో దరఖాస్తు చేసుకోలేదని, లోన్ మంజూరు కూడా కాజీపేటలో కాలేదన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఘటనను ఇక్కడ జరిగినట్లు చిత్రీకరించి కొందరు వ్యక్తులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని వివరణ ఇచ్చారు. లోన్‌ల రగడపై ఇరు సంఘాల నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం రైల్వే కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది.

దూరవిద్యకు పూర్వ వైభవానికి కృషి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు దూరవిద్య కేంద్రం పరిరక్షణ ఐక్య ఉద్యోగుల సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. వీసీ రమేష్ పదవీ కాలం ముగియడంతో ఎస్డీఎల్‌సీఈ రెండు గేట్లకు వేసి ఉన్న తాళాలను సంఘం నాయకులతో కలిసి ఆయన పగులగొట్టారు. కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టె భాస్కర్, ప్రధానకార్యదర్శి పోలెపాక ప్రతాప్, ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, దినసరి వేతన ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆకునూరి సుదయ్య, ఉపాధ్యక్షుడు గౌస్‌పాష, డాక్టర్ మేఘన, డాక్టర్ కుమారస్వామి, టి. విజయలక్ష్మి, డాక్టర్ దేవకుమారి, పద్మావతి, సల్మా, రామకృష్ణ, ప్రనూప్ పాల్గొన్నారు.



ఎస్డీఎల్‌సీఈ గేటు తాళం పగలగొడుతున్న దృశ్యం

ప్రశ్నించే గొంతుకను ఎన్నుకోవాలి

● అబద్ధాలతో అధికారంలోకి సీఎం రేవంత్‌రెడ్డి ● మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

హసన్‌పర్తి, మే 21: శాసనమండలికి విద్యావంతుడు, ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాజేష్‌రెడ్డిని ఎన్నుకోవాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మంగళవారం ఎర్రగట్టుగుట్ట వద్ద గల బాలాజీ గార్డెన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలతో అధికారంలోకి వచ్చాడన్నారు. ఓటుకు నోటు కేసులో ముద్దాయి అయిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. తీన్‌మార్ మల్లన్న ఒక బ్లాక్‌మెయిలర్, చీటర్ అని పేర్కొన్నాడు. విద్యావంతుడు, బిట్స్ పిలాని విద్యార్థి అయిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పావుశెట్టి శ్రీధర్, కందుకూరి చంద్రమోహన్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, నరేడ్ల శ్రీధర్, తోట నాగరాజు, సంగాల విక్టరి బాబు, బోడ యుగంధర్, బండి రజినికుమార్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలకిషన్

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

ఐనవోలు, మే 21 : పట్టభద్రుల స్థానానికి బీఆర్ఎస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు కృషిచేయాలని బీఆర్ఎస్ ఐనవోలు మండల ఇన్‌చార్జి గుజ్జ గోపాల్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఐనవోలు బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు పట్టభద్రులను చైతన్యపరచాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ నెల 23న వర్ధన్నపేటలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలం నుంచి 300 మంది పట్టభద్రులతో కలిసి వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, వైఎస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ టి. చందర్ రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, నాయకులు కట్కూరి రాజు, రాఘవులు, తాటికాయల కుమార్, సంపత్‌రావు, జక్కుల రాజు, సింగారపు చందర్, జన్ను రాజు, ఏలియా, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ గోపాల్‌రావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, మే 21: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు బొక్కలగడ్డ, శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట, కమ్మరి వాడ ఏరియా, యాదవ నగర్, కొత్తూరు, ఏఆర్ గార్డెన్, కుమార్‌పల్లి మార్కెట్, వినాయక నగర్ కాలనీ, రెడ్డి కాలనీ, మారుతినగర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియా, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హనుమకొండలోని రాగన్న దర్వాజ, రాయపుర, ఏనుగులగడ్డ, బ్రాహ్మణవాడ, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వడ్డెపల్లి, టీచర్స్ కాలనీ-ఫేస్ 2, విజయ్‌పాల్ కాలనీ, జీఎంఆర్ గార్డెన్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదే విధంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్టీసీ కాలనీ ఫేస్ 1, ఫేస్ 2లో విద్యుత్ సరఫరా జరుగదని డీఈ సాంబరెడ్డి తెలిపారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



కర పత్రాలు విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కేయూ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కేయూ ఫస్ట్ గేట్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో సబ్బండ వర్గాల ప్రజల గొంతుకై వినిపించే తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ, యూనివర్సిటీ సీనియర్ విద్యార్థి నాయకులు ప్రేమ్, కేయూ జాక్ నాయకులు దుర్గం సారయ్య, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్తీక్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



WANTED TEACHERS
★ Higher Classes Physical Science (Full time), 1st to 7th Classes. English. Sujatha Vidyanikethan high School, Hasanparthy. Contact : 9866574875
AJW-159780

WANTED
★ Wanted Female Unmarried Good Looking HR Admins Required our Branch. Direct Job. No Fee, Salary 20 K to 25 K. Qlf : Any Degree. Contact : 8247229422.
AJW-188202

WANTED TEACHERS
★ Wanted Teacher to Teach 7th to 10th Bilogy & English. From 1st to 6th All subjects. English Fluency is must. Ratnam High school, Rangashaipet, Warangal. Ph : 9441412898
AJW-188007

WANTED
★ వార్డ్ బాయ్స్ & ఆయాలు కావలెను. హన్మకొండ కిషన్‌పుర, నయీంనగర్ హాస్పిటల్స్‌లో పని చేయుటకు సంప్రదించండి : 8 గంటల డ్యూటీ. సెల్ : 7702686277, 9346988559
AJW-7098

WANTED
★ తొర్రూరు, తిరుమలగిరి, దంతాలపల్లి పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 8 గం॥లు, జీతం : 11,000/-, రూము సౌకర్యం కలదు. సంప్రః 9848095111, 9949633143
AJW-188103

కావలెను
★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్రః 8374272245.
AJV_192817

సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥, 12 గం॥ కలవు. జీతం : 12,000/- - 14,000/-. సంప్రః 9000463426
AJW-188104

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ మహబూబాబాద్, వరంగల్ హంటర్ రోడ్, గోపాల్‌పూర్ నందు గల ShowRooms నందు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. మా ఆఫీస్ నందు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. జీతం : 10,000/- to 15,000/- + ESI, EPF. Cont : 8978459111, 6309922608
AJW-0381

డ్రైవర్లు కావలెను
★ భవాని ఖార గొర్రెకుంటలో పని చేయడానికి DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone Call Timings : 10am to 6pm. Cont : 8498058893
AJW-5883

PLOTS FOR SALE
★ హసన్‌పర్తి to జయగిరికి వెళ్లే దారిలో 1 కి.మీ. దూరంలో రోడ్డుకు ఆనుకొని KUDA లే అవుట్ వెంచర్లో అతి తక్కువ ధరకే ప్లాట్లు అమ్మబడును. సంప్రః 9281131001
AJW-3878

మీ ఇంట్లోనే మీ ఆరోగ్యం
★ గుండె, బీపీ, మధుమేహం, కీళ్లనొప్పులు, ఇతర నియంత్రణలకు ఫుట్ ప్యాడ్ 10 రకాల మసాజ్ కిట్ ద్వారా మీ ఇంట్లోనే పూర్తి సమస్యలకు పరిష్కారం. ఫ్రీ హోం డెలివరి. సెల్ : 9440798682
AJW-188095

భద్రకాళీ వాటర్ ప్రూఫింగ్
★ వర్షాకాలంలో స్లాబ్, సైడ్ గోడ, వాటర్ ట్యాంక్, బాత్రూమ్, ఓపెన్ టెర్రస్, బాల్కానీ, బిల్డింగ్ లీకేజీ సమస్యలను కెమికల్స్ ద్వారా టెక్నికల్ వర్కర్స్‌తో 100% గ్యారంటీతో అరికట్టబడును. ఫోన్ : 7989775119
AJH-002328

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ఫ్యాషన్

ఫ్యూజన్ ఫ్యాషన్

సంప్రదాయ చీరకట్టు కచ్చితంగా అందంగానే ఉంటుంది. అయితే ఆధునికత ఉట్టిపడేలా కనిపించాలంటే ఫ్యూజన్ స్టైల్ శారీ ఎంచుకోవాలి. ఈవినింగ్ పార్టీస్, ఈవెంట్స్‌లో వినూత్నంగా కనిపించడం కోసం నేటి యువతులు ఎంచుకున్న ఫ్యూజన్ శారీస్ మీద ఓ లుక్కేద్దామా?





రెండు స్టైల్స్ కలగలిపి....

ఒకే చీరలో రెండుకు మించిన స్టైల్స్ దాగి ఉంటే, అదే, ఫ్యూజన్ శారీ! చుడీదార్, ఘాగ్రా, జీన్స్.. ఇలా వేర్వేరు దుస్తులను తలపించేలా, లేదా రెండు మూడు రకాల దుస్తులను కలగలిపినట్టు కనిపించేలా ఫ్యూజన్ శారీస్‌ను డిజైన్ చేసుకోవచ్చు. అందుకోసం కొంత సృజనాత్మకత, ఫ్యాషన్ పట్ల అవగాహన ఉంటే సరిపోతుంది.

హుందాగా కనిపిస్తూ...

స్వయంగా డిజైన్ చేయించుకోవడం నచ్చని వాళ్లు, రెడీమేడ్‌గా దొరికే ఫ్యూ జన్ శారీస్‌ను కూడా ఎంచుకోవచ్చు. అయితే అవి శరీరానికి నప్పేలా ఉండేలా చూసుకోవాలి. ఎబ్బెట్టుగా కనిపించకుండా, స్టైల్‌గా కనిపించే ఫ్యూజన్ శారీస్ నలుగురినీ ఆకట్టుకుంటాయి. ఈ చీర కట్టులో హుందాగా కనిపించాలంటే, ఆ స్టైల్‌ను అంతే గ్రేస్‌ఫుల్‌గా హ్యాండిల్ చేయగలగాలి. ప్రత్యేకంగా కనిపించాలనే కోరిక, కొత్తదనాన్ని స్వాగతించే స్వభావం కూడా అవసరమే!

యాక్సెసరీస్

హైహీల్స్, ఫ్యాషన్ జ్యువెలరీ ఫ్యూజన్ శారీస్‌తో కలిపి తప్పక ధరించాలి. హెయిర్‌స్టైల్స్ నప్పేలా ఉండాలి. భిన్నంగా కనిపించడం కోసం కాంట్రాస్ట్ కలర్స్ ఎంచుకోవచ్చు. అయితే ఫ్యూజన్ శారీకి సెక్విన్లు, ఎంబ్రాయిడరీలు లాంటి హంగులు పనికి రావు. వీలైనంతవరకూ ప్లెయిన్ కలర్స్, కాంట్రాస్ట్ దుస్తుల మీదే దృష్టి పెట్టాలి.









ఉప్పు మితంగా...

ఉప్పు లేనిదే వంటకాలకు రుచి రాదు. అలాగని ఉప్పులోనే రుచిని వెతుక్కుంటే అనారోగ్యాలను కొని తెచ్చుకున్నవాళ్లం అవుతాం. రక్తపోటును పెంచడంతో పాటు, శరీరంలో నీరు నిల్వ ఉండిపోయేలా చేసే ఉప్పును వీలైనంత పరిమితంగా తీసుకోవాలి. రోజుకు ఐదు గ్రాములకు మించకుండా చూసుకోవాలి. అదనపు ఉప్పుతో రక్తనాళాలకు, ఎముకలకూ, జీర్ణకోశానికీ నష్టం జరుగుతుంది. ఉప్పు.. రక్తపోటును పెంచడంతో పాటు, జీర్ణాశయంలోని మ్యూకోసాను దెబ్బ తీసి, గ్యాస్ట్రిక్ అల్సర్లు తలెత్తడానికీ, ఎముకల బలహీనతకూ దోహదపడుతుంది.



చర్మ సౌందర్యానికి ఇవి తినాలి!

చర్మం నిగనిగలాడాలంటే తగినన్ని నీళ్లు తాగాలని పోషకాహార నిపుణులు చెబుతూ ఉంటారు. నీళ్లతో పాటు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినటం కూడా అవసరమే! ముఖ్యంగా పొడి చర్మం ఉండేవాళ్లు తినాల్సిన పదార్థాలేమిటో తెలుసుకుందాం.

చిలకడ దుంప: దీనిలో విటమిన్ ఏ, విటమిన్ సి, బీటా కెరోటిన్‌లు ఉంటాయి. విటమిన్ ఏ,సీలు చర్మానికి ఉన్న సాగే గుణాన్ని కాపాడుతాయి. బీటా కెరోటిన్ చర్మం నున్నగా ఉండేలా చేస్తుంది. అంతే కాకుండా చిలగడ దుంపలోని పిండి పదార్థం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా లభిస్తాయి.

పెరుగు: పెరుగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది చర్మంలో కొలాజిన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.

కీరా దోసకాయ: కీరా దోసకాయలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి.

క్వినోవా: క్వినోవాలో బి విటమిన్లు బాగా ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మంపై ఏర్పడే మచ్చలను పోగడతాయి.



కాళ్ల మంటలా...

మన శరీరంలో నాడీ వ్యవస్థకు సంబంధించి అంశాలలో పాదాలు చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చినప్పుడు- వాటిని ముందుగా పట్టి చెప్పేవి మన పాదాలే! మధుమేహం ఉన్నవారిలో పాదాలలో తిమ్మిర్లు ఏర్పడుతూ ఉంటాయి. కొందరికి మంటలు కూడా ఉంటాయి. అంతే కాకుండా పాదాలకు ఏదైనా చిన్న దెబ్బ తగిలినా- అది మానటానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల ఎవరికైనా పాదాలకు దెబ్బతగిలి.. అది మానటానికి ఎక్కువ సమయం పడుతోందంటే వారికి మధుమేహం ఉన్నట్టు లెక్క! అలాంటి సమయంలో తప్పకుండా మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి. లేదా మధుమేహాన్ని నియంత్రణలోకి తెచ్చుకోవాలి. అంతే కాకుండా కొందరిలో కాళ్లకు రక్తప్రసారం సరిగ్గా కాదు. దీని వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయి. అలాంటి వారిలో కాళ్లు నల్లబడతాయి. ఎప్పుడైనా కాళ్లలో నల్లటి మచ్చలు వచ్చాయంటే మధుమేహం ఉన్నట్టు లెక్క!

'వీల్' పవర్

అల్ఫియా జేమ్స్... ఒకప్పుడు బాస్కెట్‌బాల్‌లో దేశానికి ఆశాకిరణమైన ఆమె ఒక దుర్ఘటన వల్ల వీల్‌చైర్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. కానీ ఆ వైకల్యాన్ని ఆమె ఆత్మవిశ్వాసంతో ఎదిరించారు. పారా-బ్యాడ్మింటన్‌లో పతకాల పంట పండిస్తూ... దేశంలోనే నెంబర్ వన్ ర్యాంక్‌లో నిలిచారు. "దృఢ సంకల్పాన్ని మించిన బలం లేదు. ఓటమి అనే ఆలోచన ఎన్నడూ మనసులోకి రానివ్వకూడదు" అంటున్న అల్ఫియా స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి...



కిందటివారం... దుబాయ్‌లోని ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమం. సెలబ్రిటీగా ఆ వేడుకలో పాల్గొనడానికి వీల్‌చైర్‌లో వచ్చారు. అల్ఫియా జేమ్స్.. తనను స్వాగతించడానికి అక్కడ ఏర్పాటు చేసిన డిజిటల్ హోర్డింగ్స్‌నూ, నిర్వాహకులు, ఆహూతులు తనను అడుగడుగునా అభినందించిన తీరును చూసి ఆమె తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. ఆ కార్యక్రమంలోనే ఆమెకు 'గోల్డెన్ వీసా'కూడా ప్రదానం చేశారు. సత్కారం అనంతరం ఆమె ప్రసంగిస్తున్నప్పుడు... కరతాళ ధ్వనులతో ఆడిటోరియం మారుమోగింది. దురదృష్టం వెంటాడినా... విధిని ఎదిరించి నిలిచిన అల్ఫియా స్థైర్యం, "గట్టిగా నిశ్చయించుకుంటే ఏదీ అసాధ్యం కాదు" అనే ఆమె నినాదం... ప్రేక్షకుల్లో గొప్పస్ఫూర్తిని నింపింది. "ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతోనే ఆలోచించాలి. దేన్నైనా మనసారా కోరుకుంటే.. దాని కోసం కష్టపడాలి. అప్పుడు మీరు తప్పకుండా అనుకున్నది సాధించగలరు" అంటున్న అల్ఫియా... వైకల్యం ఎదురైనా తన లక్ష్యానికి అనుగుణంగా జీవితాన్ని మలచుకున్నారు.

కొన్నాళ్ళు ఒత్తిడిలో ఉన్నా...

కేరళలోని మువాత్తుపుళ ఆమె స్వస్థలం. ఆమెకు ఏడేళ్ల వయసున్నప్పుడే తండ్రి జేమ్స్ మరణించారు. "మా అమ్మ బిజ్జీ నర్స్. నన్నూ, నా తమ్ముడు అల్ఫిన్‌నూ బాగా చదివించడానికి ఎన్నో కష్టాలు పడింది. హైస్కూల్‌లో ఉన్నప్పుడు క్రీడలంటే ఇష్టం ఏర్పడింది. బాస్కెట్‌బాల్‌లో రాణించాను. ఎన్నో పోటీల్లో గెలిచాను. జాతీయ జట్టులో స్థానం సంపాదించాను" అని చెప్పారు అల్ఫియా. దేశానికి ఆశాకిరణంగా ఆమెను క్రీడాభిమానులతోపాటు మీడియా అభివర్ణించింది. ఒక నేషనల్ టోర్నీకి ఆమె సిద్ధమవుతున్న దశలో దుర్ఘటన జరిగింది. "అప్పుడు ప్లస్ టూ చదువుతున్నాను.



బాస్కెట్ బాల్ జాతీయ జట్టులో సభ్యురాలిని. ఒక రోజు వర్షం పడుతూ ఉండగా... హాస్టల్‌లోని నా గది నుంచి బయటికి వచ్చాను. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో... రెండో అంతస్తు నుంచి కిందపడిపోయాను. తెలివి వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నాను. నా వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందనీ, ఇక నడవలేననీ, నిలబడడం కూడా కష్టమనీ వైద్యులు చెప్పారు. ఎన్నో నెలలపాటు చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. మానసికంగా అలసిపోయాను. నా జీవితం తల్లకిందులైనట్టు అనిపించింది. క్రీడాకారిణిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నది నా కల. అది నెరవేరే పరిస్థితి లేదనే వాస్తవం నన్ను కుంగదీసింది.. కొన్నాళ్ళు డిప్రెషన్‌లోనే ఉన్నాను. కానీ త్వరలోనే దాని నుంచి బయటపడ్డాను. చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నాను. ప్రైవేట్‌గా ఇంటర్ పూర్తి చేశాను. డిగ్రీలో మళ్ళీ హాస్టల్‌కు వెళ్ళడానికి మా అమ్మను కష్టం మీద ఒప్పించాను. అలా నా రెండో అధ్యాయాన్ని మొదలు పెట్టాను" అని గుర్తు చేసుకున్నారు అల్ఫియా.

> **అప్పుడు ప్లస్ టూ చదువుతున్నాను. బాస్కెట్ బాల్ జాతీయ జట్టులో సభ్యురాలిని. ఒక రోజు వర్షం పడుతూ ఉండగా... హాస్టల్‌లోని నా గది నుంచి బయటికి వచ్చాను. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో... రెండో అంతస్తు నుంచి కిందపడిపోయాను. తెలివి వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నాను. నా వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందనీ, ఇక నడవలేననీ, నిలబడడం కూడా కష్టమనీ వైద్యులు చెప్పారు.**

క్రీడాస్ఫూర్తితో అధిగమిస్తున్నా...

కాలేజీలో చదువుతూనే.. ఆమె తన ఖాళీ సమయాల్లో జిమ్‌కు వెళ్ళి పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేశారు. వివిధ పోటీల్లో పాల్గొని, గెలవడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నేషనల్ పారా-లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని... రజత పతకం గెలుచుకున్నారు. ఆ తరువాత బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకోవాలనుకున్నారు. కానీ కేరళలో వీల్ చైర్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రాలేవీ లేవు. ఆమె పరిస్థితి తెలుసుకున్న ట్రైనర్ బాలా తనే ఏర్పాట్లు చేశారు. అల్ఫియా గురించి తెలుసుకొని, ఆమెను స్పాన్సర్ చెయ్యడానికి 'ఎలైట్ గ్రూప్' ముందుకు వచ్చింది. ఉద్యోగం కూడా ఆఫర్ చేసింది. దాంతో ఆమె ఇక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. మొదటి చాంపియన్‌షిప్‌లోనే రెండు స్వర్ణ పతకాలను గెలిచారు. అప్పటినుంచీ ఆమె విజయ పరంపర కొనసాగుతోంది. ఇప్పుడు అల్ఫియా ప్రొఫెషనల్ పారా-బ్యాడ్మింటన్ ప్లేయర్. అనేక జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన ఆమె... భారతదేశం తరఫున దుబాయ్, బెహరీన్ తదితర దేశాల్లో జరిగిన ఆరు అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొని... ఏడు పతకాలను దేశానికి సంపాదించిపెట్టారు. ప్రస్తుతం పారా-బ్యాడ్మింటన్‌లో ఆమె వరల్డ్ ర్యాంక్ పన్నెండు, ఆసియా ర్యాంక్ అయిదు. భారతదేశంలో ఆమెది నెంబర్ వన్ ర్యాంక్. "ఈ ఏడాది సమ్మర్ పారా-చాంపియన్‌షిప్‌తో పాటు ప్రధానమైన కొన్ని అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడాల్సి ఉంది. 2026లో జరిగే ఆసియా క్రీడలకు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నాను. నా జీవితంలోని చాలా దశల్లో అవరోధాలు ఎదురయ్యాయి. ఎల్లప్పుడూ నాలో ఉన్న క్రీడాస్ఫూర్తే వాటిని అధిగమించేలా చేస్తోంది. మా అమ్మ, తమ్ముడు నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తోటి క్రీడాకారులు, అభిమానులు అండగా నిలుస్తున్నారు. వారందరి ప్రేమాభిమానాలే... మరిన్ని పతకాలు సాధించి, మన దేశానికి ప్రతిష్ట తేవాలనే నా లక్ష్యానికి ప్రేరణ" అంటున్నారు అల్ఫియా.

విభిన్నం

ఓ అమ్మ నవ్వుల విందు

అమ్మ చేతి ముద్ద ఎంత కమ్మగా ఉంటుందో... ఈ అమ్మ నోటి నుంచి వచ్చే పంచ్‌లు అంతలా నవ్వుల విందు చేస్తాయి. భారత్‌లోనే కాదు... దేశవిదేశాల్లోని ఆహుతులనూ తన హాస్యంతో అలరిస్తున్న స్టాండప్ కమెడియన్... జర్నా గార్గ్. అమెరికాలో స్థిరపడిన ముగ్గురు పిల్లల తల్లి జర్నా... మొన్నామధ్య ఒక షో కోసం భారత్‌కు వచ్చారు. ఓ సాధారణ ఇల్లాలి నుంచి లక్షల మంది అభిమానించే స్టాండప్ కమెడియన్‌గా ఎదిగిన తన ప్రస్థానాన్ని ఈ సందర్భంగా ఆహూతులతో పంచుకున్నారు.

"నా కామెడీ కెరీర్ గురించి మావారి అభిప్రాయం ఏంటని చాలామంది అడుగుతుంటారు. 'నా హాస్య చతురతను ఆయన ఎంతో ఇష్టపడతారు. నా పేరు మరింతగా ప్రాచుర్యం పొంది, నా షో ఎప్పుడు టీవీలో వస్తుందా అని ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే.. చివరకు నా మీద 'మ్యూట్' బటన్ నొక్కచ్చు' అని వారికి చెబుతుంటాను" అంటారు జర్నా గార్గ్. ఈ జోక్ పేల్చకుండా ఆమె షో ముగియదు. 'కానీ ఎన్నిసార్లు చెప్పినా ప్రేక్షకులు హాయిగా నవ్వేస్తారు. భార్యాభర్తలైతే.. సరదాగా ఒకరికొకరు హైఫైవ్ ఇచ్చుకొంటారు'.

అమెరికాలో స్థిరపడిన జర్నా గార్గ్ ఆ మధ్య భారత్‌కు వచ్చారు. పలు నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. 'ప్రాక్టికల్ పీపుల్ విన్' పేరిట 'ఫక్రా ఎంటర్‌టైన్‌మెంట్స్' ఈ షోలు ఏర్పాటు చేసింది.

పిల్లల సలహా...

జర్నా గార్గ్ తన ఈ 'నవ్వుల' ప్రయాణాన్ని ఎన్నడూ ఊహించలేదు. భారత్‌లో పుట్టిన ఆమె తరువాత అమెరికాలోని న్యూయార్క్ మహానగరంలో స్థిరపడ్డారు. మూడు దశాబ్దాలుగా అక్కడి నుంచే పర్యటనలు చేస్తున్నారు. ఇన్నేళ్లుగా తన విజయ యాత్ర కొనసాగడాన్ని అదృష్టంగా ఆమె భావిస్తారు. అసలు తాను స్టాండప్ కమెడియన్‌గా మారడమే ఇప్పటికీ తనకు నమ్మలేని నిజమంటారు. 'ఇది నా గొప్ప కాదు. నాకు దేవుడు ఇచ్చిన వరం. కలలో కూడా స్టాండప్ కమెడియన్‌గా నా కెరీర్ ఊహించుకోలేదు' అని చెబుతున్న జర్నాకు ఈ సలహా ఇచ్చింది ఎవరో తెలుసా..? ఆమె పిల్లలు!

'నేను మాట్లాడేది సరదాగా ఉంటుంది. దాన్ని వీడియో తీయమని మా పిల్లలు సూచించారు. పిల్లలు చెబితే మనం పెద్దగా పట్టించుకోం కదా. పైగా అది చాలా చెత్త ఆలోచన అని మనసులో అనుకున్నా. వారు చెప్పింది విని వదిలేశా. కానీ వాళ్లు వదల్లేదు. పట్టుబట్టారు. దాంతో కాదనలేకపోయాను' అని ఒక్కసారి రీలు వెనక్కి తిప్పారు జర్నా గార్గ్.

ఎప్పటికీ అమ్మనే...

పిల్లల సలహా కాదనలేక... జర్నా గార్గ్ 2019లో తన మొబైల్‌తోనే వీడియోలు షూట్ చేసి 'టిక్‌టాక్'లో వదిలారు. వాటికి మంచి ఆదరణ లభించింది. అది చూసి ఆమెకే ఆశ్చర్యం వేసింది. ఇక అప్పటి నుంచి వరుసగా హాస్య గుళికలు అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. క్రమంగా వ్యూస్ వేలు, లక్షలు దాటాయి. హాస్యం పండించే కంటెంట్ క్రియేటర్‌గా జర్నా గార్గ్ పేరు నెట్టింట బాగా పరిచయం అయింది. ఆమె వీడియోలు లెక్కకు మించి సామాజిక మాధ్యమాల్లో షేర్ అయ్యాయి. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన ఆమె... సెలబ్రిటీగా మారిపోయారు. ఇంట్లో కూర్చొనే చేతి నిండా సంపాదిస్తున్నారు. డిజిటల్ తెర మీదనే కాకుండా... క్రమంగా బయట వేదికలపై కూడా ప్రత్యక్షమవుతూ వచ్చారు. ఇప్పుడు... క్షణం తీరిక లేని స్టాండప్ కమెడియన్‌గా దేశవిదేశాల్లో పర్యటిస్తూ... హాస్య ప్రియులను విశేషంగా అలరిస్తున్నారు. కెరీర్ పరంగా ఎంత ఎదిగినా... ఎంత బిజీగా ఉన్నా... తల్లిగా తన పాత్ర ఎప్పటికీ మారదంటారు ఆమె. 'ఏ స్థాయికి వెళ్లినా నేను నేనే. అప్పటికీ ఇప్పటికీ బాధ్యతగల అమ్మను' అంటారు జర్నా. 'భారతీయ వలస తల్లి'గా విదేశాల్లో జర్నా పేరు బాగా పాపులర్.

అనుభవాల నుంచి...

ఒక తల్లిగా, ఇల్లాలిగా జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లకు హాస్యాన్ని జోడించి సున్నితంగా చెప్పడంలో జర్నా దిట్ట. మన ఇంట్లో జరిగే ఘటనలు, మన చుట్టూ ఉండే మనుషులు, వారి జీవన శైలి, ఎదురయ్యే అనుభవాలు... ఇవే ఆమెకు కంటెంట్. ఎవరినీ నొప్పించకుండా, సరదాగా కాసేపు నవ్వించడానికి ఆమె చేసే ప్రయత్నం లక్షల మంది మనసు దోచుకుంది. 'నేను భారత్ నుంచి వలస వచ్చిన ఒక తల్లిని. ఒక అమ్మగా ప్రపంచంలో ఒక తల్లికి, పిల్లలకు సంబంధించిన కథలు నేను వినిపిస్తాను. అవి అందరికీ నచ్చుతాయి. అలా ఇతర దేశాలవారిని కూడా మెప్పించగలుగుతున్నందుకు సంతోషంగానే కాదు... గర్వంగానూ అనిపిస్తుంది' అంటున్న జర్నా జోక్‌ల్లో అధిక శాతం కుటుంబంలో జరిగే నిత్య ఘట్టాలే ఉంటాయి.





అంతా సరదాగా..

'మా ఇంట్లో అందరం చాలా సరదాగా ఉంటాం. అనవసర విషయాల గురించి ఆలోచించి బాధపడుతూ కూర్చోవడం అలవాటు లేదు. నా మాటలైతే ఎప్పుడూ హాస్యం జోడించే సాగుతుంటాయి. ఇప్పుడే కాదు.. స్టాండప్ కమెడియన్‌గా మారక ముందు కూడా నేను ఇంతే. అందుకే నా కెరీర్, బయట నా షోస్ మా పిల్లలకు, మావారికి కొత్తగా అనిపించవు. మా అమ్మాయి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. మా అబ్బాయిలు వారికి నచ్చింది చేసుకుపోతున్నారు. మా నిజజీవిత క్షణాలను లెన్స్‌లో బంధిస్తుంటాం. అలాగే సామాజిక మాధ్యమాల్లో నేను పోస్టు చేసే వీడియోలన్నీ రెండే నిమిషాల్లో షూట్ చేసినవి. అదీ నా సెల్‌ఫోన్‌లో. కొన్ని వీడియోల్లో అయితే సరైన లైటింగ్ కూడా ఉండదు' అంటారు జర్నా.

అరిచినా పట్టించుకోరు...

'నేను ఇంట్లో సరదాగా ఉంటానని చెప్పాను కదా. కానీ అందులో కొంతే నిజం ఉంది. హోమ్‌వర్క్ చేయనప్పుడు, వండింది తిననప్పుడు... ఇలా తరచూ మా పిల్లలపై గట్టిగా కేకలు వేస్తూనే ఉంటాను. మా పిల్లల్ని డాక్టర్లను చేయాలనుకున్నా. ఆ విషయమే అరిచి చెప్పే ప్రయత్నం చేశా. వాళ్ల స్నేహితుల్ని కూడా కేకలు వేస్తుంటాను. కానీ వారెవరూ నన్ను సీరియస్‌గా తీసుకోరు. అదంతా సరదా అనుకొంటారు. ఇక నేను మాత్రం ఎంతని అరవగలను?' అని తన కథ చెప్పే క్రమంలోనూ దానికి కాస్తంత హాస్యం జోడిస్తారు జర్నా. అలాగే అత్తా... కోడళ్ల కంటెంట్‌కు ఎప్పటికీ క్రేజ్ తగ్గదంటారు ఆమె. తన దగ్గర వారికి సంబంధించి పది పదిహేనేళ్లకు సరిపడా సరదా కథలు ఉన్నాయంటూ నవ్వేస్తారు జర్నా.

స్టాండప్ కమెడియన్‌గా జర్నా ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా గెలచుకున్నారు. కెవిన్ హార్ట్ లిఫ్ట్ కామిక్స్'తో పాటు 2021లో 'లేడీస్ ఆఫ్ లాఫ్టర్ అవార్డ్' అందుకున్నారు. హిల్లరీ క్లింటన్ తదితర మహామ హులతో కలిసి వేదిక పంచుకున్నారు. గత ఏడాది వెరైటీ మ్యాగజైన్ ప్రకటించిన 'టాప్ 10 కామిక్స్'లో చోటు దక్కించుకున్నారు. జర్నా జర్నీలో ఇలాంటి మైలురాళ్లు ఎన్నో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 22 మే 2024
cinema@andhrajyothy.com

కొత్త తేదీన హరోం హర




సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

పారితోషికం రూ.250 కోట్లా?




బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాపురే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!



ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.



కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్స్ కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.

వెల్‌కమ్‌కు గుడ్‌బై



బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ 'వెల్‌కమ్ టు ది జంగిల్' సినిమాకు ఉన్నట్టుండి గుడ్‌బై చెప్పేశారు. డిసెంబర్‌లో ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టిన ఆయన ఇప్పటివరకు కేవలం ఒక్క రోజు మాత్రమే షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సినిమాలోని సంజయ్ పాత్రకు యాక్షన్ పార్ట్ ఎక్కువగా ఉండడంతో ప్రస్తుత తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన ఈ సినిమా నుంచి తప్పుకొన్నట్లు తెలుస్తోంది. కాగా, 'వెల్‌కమ్' సిరీస్‌లో మూడవ భాగంగా వస్తున్న చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్'. ఈ యాక్షన్ అడ్వెంచర్ కామెడీ డ్రామాను అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. అక్షయ్‌కుమార్, సునీల్ శెట్టి. దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, లారా దత్తా తదితరులతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. జ్యోతి దేశ్‌పాండే, ఫిరోజ్ ఏ నడియాడ్‌వాలా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనుంది.

అక్టోబర్‌లో సెట్స్‌పైకి



సీక్వెల్స్..ఇప్పుడు బాలీవుడ్‌లో నడుస్తోన్న ట్రెండ్. త్వరలో మరో సీక్వెల్ చిత్రం బాలీవుడ్‌లో పట్టాలెక్కనుంది. 1997లో వచ్చిన బాలీవుడ్ వార్ డ్రామా 'బోర్డర్'. ఆ తరం ప్రేక్షకులను అమితంగా అలరించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. సన్నీడియోల్ కథానాయకుడిగా నటించారు. దేశభక్తి, సరిహద్దుల్లో సైనికుల త్యాగాలు, వారి కుటుంబాలు పడే తపన లాంటి అంశాలను హృద్యంగా చిత్రీకరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'బోర్డర్ 2' తెరకెక్కుతోంది. ఇందులో సన్నీతో పాటు ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది, అక్టోబర్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జేపీ దత్తా, నిధి దత్తా, భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 2026లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.







ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్ హీరోయిన్ ఎవరు?



భారతరత్న గ్రహీత, ప్రఖ్యాత గాయని, దివంగత ఎమ్మెస్ సుబ్బులక్ష్మీ జీవితాన్ని వెండితెరపైకి ఆవిష్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ బయోపిక్‌ను తెరకెక్కించేది ఎవరు, నిర్మించేది ఎవరు అన్న విషయం ఇంకా అధికారికంగా తెలియనప్పటికీ ఇందులో టైటిల్ రోల్ పోషించేది ఎవరనే చర్చ మాత్రం విస్తృతంగా జరుగుతోంది. నయనతార, త్రిష, రష్మిక పేర్లు ప్రముఖంగా వినపడుతున్నాయి. ఈ సినిమా కోసం ఇప్పటికే బెంగుళూరుకు చెందిన ఓ నిర్మాణ సంస్థ, పేరొందిన డైరెక్టర్‌తో కలసి స్క్రిప్ట్ పనుల్లో తలమునకలై ఉన్నట్లు తెలిసింది. స్క్రిప్ట్ పనులన్నీ పూర్తయ్యాక ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అలాగే, అతి త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టి వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.



డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, సిమ్రిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేద'ని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.

మహీ గంగా హారతి



వంక పెట్టడానికి వీల్లేని అభినయంతో హీరోయిన్‌గా అభిమానులను అలరిస్తున్నారు జాన్వీకపూర్. ఒక సినిమాలో నటించడంతోనే తన బాధ్యత తీరిపోయినట్లు జాన్వీ ఎప్పుడూ భావించరు అనేది బాలీవుడ్ నిర్మాతల మాట. ఇటీవలే ఆమె నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారం కోసం దేశంలోని ప్రధాన నగరాలను చుట్టొస్తున్నారు జాన్వీ. హీరో రాజ్‌కుమార్ రావుతో కలసి తమ సినిమాకు ప్రచారం కల్పిస్తున్నారు. వీరిద్దరూ కలసి మంగళవారం కాశీ పర్యటన చేశారు. అందులో భాగంగా జాన్వీ సంప్రదాయ దుస్తుల్లో గంగా హారతి కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

జూన్‌లో 'ఓ.సి' వినోదం



హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. టీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్., అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.





శ్రేయాస్ అయ్యర్ (24 బంతుల్లో 58 నాటౌట్)

కోల్‌కతా కేక

ఫైనల్లో నైట్‌రైడర్స్

రాణించిన శ్రేయాస్, వెంకటేశ్


చిత్తుగా ఓడిన సన్‌రైజర్స్

విజృంభించిన పేసర్ స్టార్క్

అహ్మదాబాద్: లీగ్ దశలో 'నెంబర్‌వన్' ఆటతీరుతో అదరగొట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్ క్వాలిఫయర్-1లోనూ అదే జోరును ప్రదర్శించింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌తో వహ్వా.. అనిపించుకుంటూ సునాయాసంగా ఐపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, ఇప్పటిదాకా భారీస్కోర్లతో బెంబేలెత్తించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మ్యాచ్‌లో చేతులెత్తేసింది. అత్యంత ఖరీదైన బౌలర్ మిచెల్ స్టార్క్ (3/34) ఆదిలోనే వెన్నువిరవడంతో రైజర్స్ కోలుకోలేకపోయింది. స్వల్ప ఛేదనను కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 58 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో ముగించారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఓడిన రైజర్స్ శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో ఆడి మరోసారి ఫైనల్ కోసం ప్రయత్నించనుంది. ముందుగా సన్‌రైజర్స్ 19.3 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 55), క్లాసెన్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), కమిన్స్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) రాణించారు. స్టార్క్‌కు 3, వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 13.4 ఓవర్లలోనే 2 వికెట్లకు 164 రన్స్ చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా స్టార్క్ నిలిచాడు.

శ్రేయాస్, వెంకటేశ్ హాఫ్ సెంచరీలు: స్వల్ప ఛేదనను కోల్‌కతా అలవోకగా ముగించింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (23), నరైన్ (21) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా.. మిగతా ఛేదనను శ్రేయాస్, వెంకటేశ్ ముగించారు. లక్ష్యం తక్కువగానే ఉండడంతో రైజర్స్ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. ఫిల్ సాల్ట్ స్థానాన్ని భర్తీ చేస్తూ గుర్బాజ్ వేగంగా ఆడాడు. రెండో ఓవర్‌లోనే నరైన్ రెండు ఫోర్లు, గుర్బాజ్ సిక్సర్‌తో కమిన్స్ 20 పరుగులు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత భువీ ఓవర్‌లో గుర్బాజ్ 6,4తో 18 రన్స్ అందించాడు. నాలుగో ఓవర్‌లో అతడిని నటరాజన్ అవుట్ చేసినా అప్పటికే స్కోరు 44 పరుగులకు చేరింది. ఇక వచ్చీ రాగానే వెంకటేశ్ బ్యాట్‌కు పనిచెబుతూ వరుస ఫోర్లు సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో స్కోరు 63/1కి చేరింది. ఆ తర్వాత నరైన్‌ను కమిన్స్ అవుట్ చేసినా.. శ్రేయాస్ రాకతో కేకేఆర్ మరో వికెట్ కోల్పోకుండా ఆడింది. ఇద్దరూ స్వేచ్ఛగా ఆడేయడంతో 10వ ఓవర్‌లోనే స్కోరు 100 దాటింది. వెంకటేశ్ ఓ సిక్సర్‌తో 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఇక 13వ ఓవర్‌లో శ్రేయాస్ చెలరేగి వరుసగా 6,4,6,6తో 22 పరుగులు రాబట్టడమే కాకుండా 24 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేస్తూ మ్యాచ్‌ను ముగించాడు. ఈ జోడీ అజేయంగా మూడో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది.

ఆదుకున్న త్రిపాఠి-క్లాసెన్: సహజంగా సన్‌రైజర్స్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే బౌలర్లు చేష్టలుడిగిపోవాల్సిందే. కానీ ఈసారి వారి ఆటతీరు అంచనాలకు భిన్నంగా సాగింది. ఆది నుంచే పరుగుల వరద పారించే అలవాటున్న ఈ జట్టును కోల్‌కతా బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. పవర్‌ప్లేలోనే జట్టు కీలక నాలుగు వికెట్లు కోల్పోయింది. వన్‌డౌన్ బ్యాటర్ రాహుల్ త్రిపాఠి, క్లాసెన్ మాత్రమే ప్రభావం చూపారు. చివర్లో కమిన్స్ బ్యాట్ ఝుళిపించడంతో కాస్త పరువు కాపాడుకుంది. మిగతా బ్యాటర్లు మూకుమ్మడిగా విఫలమయ్యారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (0) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ డకౌటయ్యాడు. తొలి ఓవర్ రెండో బంతికే స్టార్క్ అతడిని క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (3)ను రెండో ఓవర్‌లో వైభవ్ అవుట్ చేశాడు. మూడో ఓవర్‌లోనే త్రిపాఠి కూడా ఎల్బీ కావాల్సి ఉన్నా కేకేఆర్ రివ్యూకు వెళ్లకపోవడంతో బతికిపోయాడు. మరోవైపు నితీశ్ (9), షాబాజ్ (0)లను వరుస బంతుల్లో స్టార్క్ పెవిలియన్ చేర్చడంతో 39/4 స్కోరుతో రైజర్స్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈ దశలో త్రిపాఠి, క్లాసెన్ అడపాదడపా బౌండరీలతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. తొమ్మిదో ఓవర్‌లో త్రిపాఠి 4, క్లాసెన్ 6,4తో 18 పరుగులు వచ్చాయి. అటు త్రిపాఠి ఓ ఫోర్‌తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ 11వ ఓవర్‌లో క్లాసెన్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత జట్టు ఒక్కసారిగా తడబడింది. 14వ ఓవర్‌లో సమద్ (16)తో సమన్వయలోపంతో త్రిపాఠి రనౌటవడం భారీస్కోరుపై ప్రభావం చూపింది. ఆ వెంటనే ఇంపాక్ట్ ప్లేయర్ సన్వీర్‌ను నరైన్ డకౌట్ చేశాడు. మిగతా వికెట్లు కూడా టపటపా పడడంతో 16 ఓవర్లలో జట్టు స్కోరు 126/9. ఈ స్థితిలో కెప్టెన్ కమిన్స్ ఎడాపెడా బౌండరీలతో బ్యాట్ ఝుళిపించాడు. స్టార్క్ ఓవర్‌లో వరుసగా 6,4తో ఆకట్టుకున్నాడు. అలాగే ఆఖరి వికెట్‌కు 33 పరుగులు జోడించి జట్టు స్కోరును 150 దాటించాడు. ఆఖరి ఓవర్‌లో కమిన్స్ వికెట్‌తో రస్సెల్ వీరి ఇన్నింగ్స్‌కు తెర దించాడు.



మిచెల్ స్టార్క్ (3/34)



వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 51 నాటౌట్)

1 ప్లేఆఫ్స్‌లో ఎక్కువ (2) 50+ స్కోర్లు సాధించిన కెప్టెన్‌గా శ్రేయాస్. ఈ క్రమంలో ధోనీ, రోహిత్, వార్నర్‌తో సమంగా నిలిచాడు.

4 ఐపీఎల్ ఫైనల్ చేరడం కోల్‌కతాకు ఇది నాలుగో సారి. గతంలో 2012, 2014, 2021లో తుదిపోరులో నిలిచింది. చెన్నై (10), ముంబై (6) తర్వాత ఎక్కువసార్లు ఫైనల్‌కు వచ్చిన జట్టిదే.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) స్టార్క్ 0, అభిషేక్ (సి) రస్సెల్ (బి) అరోరా 3, త్రిపాఠి (రనౌట్) 55, నితీశ్ (సి) గుర్బాజ్ (బి) స్టార్క్ 9, షాబాజ్ (బి) స్టార్క్ 0, క్లాసెన్ (సి) రింకూ (బి) వరుణ్ 32, సమద్ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 16, సన్వీర్ (బి) నరైన్ 0, కమిన్స్ (సి) గుర్బాజ్ (బి) రస్సెల్ 30, భువనేశ్వర్ (ఎల్బీ) వరుణ్ 0, విజయకాంత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 159 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-13, 3-39, 4-39, 5-101, 6-121, 7-121, 8-125, 9-126, 10-159; **బౌలింగ్:** స్టార్క్ 4-0-34-3, వైభవ్ 2-0-17-1, హర్షిత్ రాణా 4-0-27-1, నరైన్ 4-0-40-1, రస్సెల్ 1.3-0-15-1, వరుణ్ 4-0-26-2.

కోల్‌కతా: గుర్బాజ్ (సి) విజయకాంత్ (బి) నటరాజన్ 23, నరైన్ (సి) విజయకాంత్ (బి) కమిన్స్ 21, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 51, శ్రేయాస్ (నాటౌట్) 58, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 13.4 ఓవర్లలో 164/2; వికెట్ల పతనం:** 1-44, 2-67; **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-28-0, కమిన్స్ 3-0-38-1, నటరాజన్ 3-0-22-1, విజయకాంత్ 2-0-22-0, హెడ్ 1.4-0-32-0, నితీశ్ 1-0-13-0.



నిలిచేదెవరు.. నిష్క్రమించేదెవరు?

ఎలిమినేటర్ పోరు నేడే

● జోరుమీదున్న బెంగళూరు
● ఒత్తిడిలో రాజస్థాన్

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

అహ్మదాబాద్: నిష్క్రమించే దశ నుంచి సంచలన ప్రదర్శనతో నాకౌట్ చేరింది ఒకరైతే.. ఆరంభంలో అదరగొట్టి ఆఖర్లో డీలాపడిన వాళ్లు మరొకరు. ఐపీఎల్‌లో భిన్న ప్రదర్శనలతో ప్లేఆఫ్స్‌కు చేరుకొన్న రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు.. బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ బెర్త్ కోసం క్వాలిఫయర్-2 ఆడనుండగా.. ఓడిన జట్టు నేరుగా ఇంటికి వెళ్లనుంది. వరుసగా 7 మ్యాచ్‌లు ఓడి నాకౌట్ ఆశలు దాదాపుగా ముగిసిన తరుణంలో.. బెంగళూరు అద్భుత ప్రదర్శనతో వరుసగా 6 మ్యాచ్‌లు గెలిచి ఔరా అని పించింది. డిఫెండింగ్ చాంప్ చెన్నైతో చావోరేవో మ్యాచ్‌లో సూపర్‌షోతో అలరించి ప్లేఆఫ్స్ చేరిన డుప్లెసి సేన.. ఎలిమినేటర్‌కు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. కోహ్లీ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలుస్తుండగా.. డుప్లెసి, పటీదార్, గ్రీన్, దినేష్ రాణిస్తున్నారు. బౌలింగ్‌లో యశ్ దయాళ్ కీలకంగా మారాడు.

ఒక్కసారిగా గతితప్పి: తొలి 9 మ్యాచ్‌ల్లో 8 గెలిచి జోరుమీదున్న రాజస్థాన్.. చివర్లో గతితప్పింది. వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడిన తీరు జట్టులోని లోపాలను బహిర్గతం చేశాయి. ఆఖరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో.. మొత్తం 17 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్‌కు సిద్ధమైంది. కాగా, లీగ్ దశలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్‌దే పైచేయి. బట్లర్ ఇంగ్లండ్ వెళ్లడంతో ఆర్ఆర్ బ్యాటింగ్‌లో దూకుడు లోపించింది. కెప్టెన్ శాంసన్, పరాగ్ ఈ సీజన్‌లో ఎక్కువగా జట్టు భారాన్ని మోయగా.. జైస్వాల్ నిలకడలేమితో ఇబ్బందులు పడుతున్నాడు. గాయపడిన హెట్‌మయర్ రాకతో లోయరార్డర్ బ్యాటింగ్ కొంత బలపడింది. బౌల్ట్, సందీప్ శర్మ, చాహల్‌తో జట్టు బౌలింగ్ మెరుగ్గా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ బౌలింగ్‌కు.. బెంగళూరు బ్యాటింగ్‌కు మధ్య ప్రధాన పోటీ నడిచే అవకాశం ఉంది.

సుమిత్, మరియప్పన్‌కు స్వర్ణాలు

ప్రపంచ పారా అథ్లెటిక్స్



కోబ్ (జపాన్): వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో డిఫెండింగ్ చాంప్ సుమిత్ అంటిల్ టైటిల్‌ను నిలబెట్టుకోగా.. తంగవేలు మరియప్పన్, ఏక్తా భయన్ స్వర్ణాలు సాధించారు. పురుషుల ఎఫ్-64 జావెలిన్ త్రోలో సుమిత్ 69.50 మీటర్లు విసిరి పసిడి సాధించాడు. 2023 ఈవెంట్‌లో కూడా అంటిల్ స్వర్ణం నెగ్గాడు. అతడి సహచరుడు సందీప్ 60.41 మీ. విసిరి కాంస్యం దక్కించుకొన్నాడు. టి-63 హైజంప్‌లో మరియప్పన్ 1.88 మీ. దూకి విజేతగా నిలిచాడు. మహిళల ఎఫ్-51 క్లబ్ త్రోలో ఏక్తా 20.12 మీటర్లు విసిరి పసిడి పట్టేయగా.. కషిష్ లక్రా 14.56 మీ. విసిరి రజతం సాధించింది.

భారత రిలే జట్లకు రజతాలు

బ్యాంకాక్: ఆసియా రిలే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు 4×400 మీటర్ల రిలే విభాగాల్లో రజత పతకాలు సాధించారు. మహిళల బృందం 3 నిమిషాల 33.55 సెకన్ల టైమింగ్‌తో రెండోస్థానంలో నిలిచింది. పురుషుల జట్టు 3 నిమిషాల 05.76 సెకన్లతో ద్వితీయస్థానంతో రేసు ముగించింది.

మళ్లీ వరల్డ్ నెం.1గా సాత్విక్ జోడీ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో తెలుగు తేజం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ తిరిగి వరల్డ్ నెంబర్ వన్ పీఠాన్ని అధిరోహించింది. ఆల్ ఇంగ్లండ్, ఆసియా చాంపియన్‌షిప్‌లో పరాజయం తర్వాత సాత్విక్ ద్వయం అగ్రస్థానం నుంచి తృతీయ స్థానానికి పడిపోయింది. ప్రస్తుత సీజన్‌లో రెండు టైటిళ్లు నెగ్గడంతో సాత్విక్ జోడీ తిరిగి ప్రథమ స్థానానికి చేరుకుంది. సింగిల్స్‌లో సింధు 14 నుంచి 15వ ర్యాంక్‌కు పడిపోగా, ప్రణయ్ 9వ ర్యాంక్‌తో తిరిగి టాప్-10లో చోటు సంపాదించాడు. లక్ష్యసేన్ 14వ, కిడాంబి శ్రీకాంత్ 26వ, ప్రియాన్షు రజావత్ 33వ ర్యాంకుల్లో నిలిచారు. డబుల్స్‌లో తనీషా-అశ్విని పొన్నప్ప జోడీ 19వ స్థానంలో, ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 29వ ర్యాంక్‌లో ఉన్నారు.

గాయత్రి జోడీ ముందంజ

కౌలాలంపూర్: గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ మలేసియా మాస్టర్స్ డబుల్స్‌లో రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ఏడో సీడ్ గాయత్రి జంట 21-14, 21-10తో హవాంగ్ యు-లియాంగ్ (చైనీస్ తైపీ) జోడీపై నెగ్గింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయర్స్‌లో సతీష్ కుమార్, ఆయూష్ షెట్టి, శంకర్ సుబ్రమణియన్ ప్రధాన పోటీలకు అర్హత సాధించలేకపోయారు.

పారిస్ కోటా రెజ్లర్లకు నో ట్రయల్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బెర్తులు సాధించిన వారికి ట్రయల్స్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ప్రకటించింది. గాయపడే అవకాశం ఉందని కొందరు రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాఖ్య చీఫ్ సంజయ్ తెలిపాడు. వినేష్ (50 కి), అంతిమ్ పంగల్ (53 కి), అన్షు మాలిక్ (57 కి), నిషా దహియా (68 కి), రీతిక హుడా (76 కి)తోపాటు పురుషుల్లో అమన్ షెహ్రావత్ (57 కి) మాత్రమే ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

5 లక్షల కోట్ల డాలర్లు

సరికొత్త మైలురాయికి స్టాక్ మార్కెట్ వర్గాల సంపద

ముంబై: స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు స్థాయి 5 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ ఈ మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. చివర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలతో పాటు మార్కెట్ సంపద కూడా కాస్త తగ్గి 4.97 లక్షల కోట్ల డాలర్ల (రూ.414.62 లక్షల కోట్లు)కు పరిమితమైంది. మార్కెట్ సంపద పరంగా అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాత భారత్ ఐదో స్థానంలో ఉంది. మరిన్ని విషయాలు..

- గత ఏడాది నవంబరు 29న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని చేరింది.
- 2021 మే 24న 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని దాటగా.. 2017 జూలై 10న 2 లక్షల కోట్ల డాలర్లకు, 2007 మే 28న లక్ష కోట్ల డాలర్ల మార్క్‌కు చేరుకుంది.
- మార్కెట్ సంపద 2014 జూన్ 6న 1.5 లక్షల కోట్ల డాలర్లకు, 2020 డిసెంబరు 16న 2.5 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది.
- లక్ష కోట్ల డాలర్ల నుంచి 1.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునేందుకు 2,566 రోజులు లేదా 7 ఏళ్లకు పైగా సమయం పట్టింది. 1.5 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2 లక్షల కోట్ల డాలర్లకు పెరిగేందుకు 1,130 రోజులు పట్టింది. అంటే, లక్ష కోట్ల డాలర్ల నుంచి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునేందుకు 10 ఏళ్లు పట్టిందన్నమాట.
- 1,255 రోజుల్లో మార్కెట్ సంపద 2 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2.5 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది.
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 1,713.05 పాయింట్లు (2.37 శాతం) పుంజుకుంది. ఈ ఏప్రిల్ 9న సూచీ ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి 75,124.28 వద్దకు చేరుకుంది.



మార్కెట్ సంపద పరంగా టాప్-10 కంపెనీలు

ర్యాంక్	కంపెనీ	రూ.లక్షల కోట్లు
1	రిలయన్స్ ఇండస్ట్రీస్	19.43
2	టీసీఎస్	13.83
3	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	11.08
4	ఐసీఐసీఐ బ్యాంక్	7.88
5	భారతీ ఎయిర్‌టెల్	7.62
6	ఎస్‌బీఐ	7.41
7	ఎల్ఐసీ	6.47
8	ఇన్ఫోసిస్	5.95
9	ఐటీసీ	5.43
10	హిందుస్థాన్ యూనిలీవర్	5.42

మిశ్రమంగా ముగిసిన సూచీలు

లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం ఇంట్రాడేలో 426 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. ట్రేడింగ్ నిలిచేసరికి, 52.63 పాయింట్ల నష్టంతో 73,953.31 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 27.05 పాయింట్ల లాభంతో 22,529.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 14 లాభపడగా.. మిగతా 16 నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 3.81 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సైతం 3.68 శాతం పుంజుకుంది. నెస్లే, మారుతి సుజుకీ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా క్షీణించాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఇంట్రాడేలో సరికొత్త జీవనకాల గరిష్ఠాలను తాకినప్పటికీ, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.34 శాతం లాభంతో సరిపెట్టుకోగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గింది.

ఫాలో ఆన్ పబ్లిక్ ఇష్యూకు ఐఆర్ఈడీఏ

గత ఏడాది నవంబరులోనే తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా రూ.2,150 కోట్లు సమీకరించిన ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ).. భవిష్యత్ మూలధన అవసరాల కోసం మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ)కు వచ్చే ఆలోచనలో ఉంది. ఎఫ్‌పీఓతో పాటు పర్‌పెక్చువల్ బాండ్లను సైతం జారీ చేయాలని కంపెనీ యోచిస్తున్నది.

ఆఫీస్ స్పేస్ ఐపీఓ ధరల శ్రేణి రూ.364-383

కో-వర్కింగ్ సేవల కంపెనీ ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓ బుధవారం ప్రారంభమై ఈ నెల 27న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.364-383గా నిర్ణయించింది. తద్వారా రూ.599 కోట్ల వరకు సమీకరించనుంది.

● రిక్రూట్‌మెంట్, స్టాఫింగ్ సంస్థ లయం గ్రూప్.. వ్యూహాత్మక విస్తరణలో భాగంగా కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ విభాగంలోకి ప్రవేశించింది. ఉత్పత్తి కార్యకలాపాలు, ఉత్పత్తుల డెలివరీ విభాగంలో తన క్లయింట్లుగా ఉన్న సంస్థలకు కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ విధానంలో లయం గ్రూప్ సేవలనందించనుంది.

● హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో అమెజాన్ వ్యాపారం 48 శాతం వృద్ధి చెందింది. తమ ప్లాట్‌ఫామ్‌పై 10 లక్షల మంది విక్రేతలు ఉండగా 19 కోట్లకు పైగా జీఎస్‌టీ ఆధారిత ఉత్పత్తులున్నాయి. 2017లో హైదరాబాద్‌లో అమెజాన్ బిజినెస్ ప్రారంభించినప్పటి నుంచి ఏటా కొత్త కస్టమర్లను పెంచుకుంటూ వస్తోంది.

హైపర్‌లీప్ జెనరేటివ్ ఏఐ ప్లాట్‌ఫామ్

హైదరాబాద్‌కు చెందిన జనరేటివ్ ఏఐ స్టార్టప్ హైపర్‌లీప్ ఏఐ.. ఎండ్ టు ఎండ్ జెనరేటివ్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. భారత్‌లోనే ఇది తొలి ఎంటర్‌ప్రైజ్ రెడీ ప్లాట్‌ఫామ్ అని పేర్కొంది. వ్యాపారాల కోసం ఏఐ ఆధారిత అప్లికేషన్స్‌ను నిరంతరాయంగా ఈ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చేస్తుంది. ఎడ్యుకేషన్ వంటి రంగాలపై హైపర్‌లీప్ ప్రధానంగా దృష్టి సారించనుంది. ఈ ఏడాది చివరి నాటికి 1,000 మంది టెక్ ఆధారిత వ్యాపారాలను ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావాలని హైపర్‌లీప్ లక్ష్యంగా పెట్టుకుంది.

ఐపీఓ నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ: కంపెనీల పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనలను సడలించింది. ఐపీఓ పత్రాలు సమర్పించాక ఇష్యూ సైజు తగ్గింపు లేదా పెంచుకునే విషయంలో మరింత వెసులుబాటు కల్పించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) సైజు మారితే మళ్లీ దరఖాస్తు సమర్పించాల్సిన అవసరం రూపాయల్లో ఇష్యూ సైజు లేదా విక్రయించనున్న షేర్ల సంఖ్యలో ఒక దానిపైనే ఆధారపడి ఉంటుందని సెబీ తెలిపింది.

మరిన్ని విషయాలు: మినిమమ్ ప్రమోటర్స్ కాంట్రిబ్యూషన్ (ఎంపీసీ) తగ్గిన పక్షంలో ప్రమోటర్‌గా గుర్తింపు లేకపోయినప్పటికీ, పబ్లిక్ ఆఫరింగ్ ముగిశాక ఈక్విటీ వాటాలో 5 శాతానికి మించి వాటా కలిగి ఉండే ప్రమోటర్ గ్రూప్ కంపెనీలు, వ్యక్తిగతేతర షేర్‌హోల్డర్లు కూడా ఎంపీసీ పరిమితి లోటును భర్తీ చేసేందుకు సెబీ వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం ఎంపీసీ పరిమితి 20 శాతంగా ఉంది. సాధారణంగా ఎంటర్‌ప్రెన్యూర్లు ప్రమోట్ చేసే కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకు ముందే ఆయా మార్గాల్లో, పలు విడతల్లో ఫండింగ్ సేకరిస్తుంటాయి. ఆ సందర్భాల్లో ప్రమోటర్ల వాటా 20 శాతం ఎంపీసీ పరిమితి కంటే తగ్గవచ్చు. అయినప్పటికీ, ఐపీఓకు వచ్చేందుకు కొత్త నిబంధన దోహదపడనుంది.

● ప్రాథమిక ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించిన తేదీకి ఏడాది ముందే కంపల్సరీ కన్వర్టబుల్ సెక్యూరిటీస్‌ను మార్చుకోవడం ద్వారా లభించిన ఈక్విటీ షేర్ల వాటాను సైతం ఎంపీసీ పరిమితి అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చని సెబీ తెలిపింది.

● ఏదైనా అసాధారణ పరిస్థితులు లేదా సందర్భంలో ఐపీఓ క్లోజింగ్ తేదీని ఒక రోజే పొడిగించే వెసులుబాటు కల్పించింది సెబీ. ఇప్పటివరకు కనీసం మూడు రోజులు పొడిగించాల్సి వచ్చేది.

బిజినెస్

తొలి త్రైమాసికం వృద్ధి 7.5 శాతం

ఆర్‌బీఐ అంచనా

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.5 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. వస్తు సేవలకు డిమాండు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆహారేతర వ్యయాల పెరుగుదల కూడా ఇందుకు దోహదపడనున్నట్టు తాజా బులెటిన్‌లో తెలిపింది. తీవ్రమైన భౌగోళిక, రాజకీయ ప్రతికూలతల మధ్యన కూడా భారత ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలిగిందని పేర్కొంటూ ఏప్రిల్‌లో ఆర్థిక కార్యకలాపాల సూచీ (ఈఏఐ) పునరుజ్జీవం సాధించినట్టు తెలిపింది. అధిక సాంద్రత గల 27 కీలక సూచీల గమనాన్ని పరిగణనలోకి తీసుకుని డైనమిక్ ఫ్యాక్టర్ నమూనాలో ఈఏఐని నిర్మించారు. ఇదిలా ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం జీడీపీ గణాంకాలను, 2023-24 జాతీయాదాయం గణాంకాలను ప్రభుత్వం ఈ నెల 31వ తేదీన ప్రకటించనుంది. ఆర్థిక వ్యవస్థకు కీలకంగా పరిగణించే వాటిలో టోల్ వసూళ్ల సూచీ ఏప్రిల్‌లో 8.6 శాతం వృద్ధిని నమోదు చేయగా ఇదే నెలలో ఆటోమొబైల్ అమ్మకాలు 25.4 శాతం పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్నదన్న ఆశావహ దృక్పథం సర్వత్రా వెలువడుతోందని మైకేల్ దేవవ్రత పాత్రా నాయకత్వంలోని బృందం రచించిన ఆ నివేదిక వెల్లడించింది. ద్రవ్యోల్బణం విషయానికి వస్తే కూరగాయలు, తృణధాన్యాలు, పప్పులు, మాంసం, చేపల ధరలు సమీప భవిష్యత్తులో దాన్ని కాస్తంత అధికంగా 5 శాతానికి చేరువలో నిలుపుతాయని పేర్కొన్నారు.

సీయూబీ @రూ.లక్ష కోట్లు

చెన్నై: ప్రైవేట్ రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెండు కీలకమైన మైలురాళ్లను అధిగమించింది. ఏడాదిలో రూ.లక్ష కోట వ్యాపారాన్ని దాటడం ఒకటైతే రూ.1,000 కోట్ల నికర లాభం మైలురాయి మరొకటి. బ్యాంక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎన్.కామకోడి ఈ విషయం వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయం 6 శాతం పెరిగి రూ.1,02,138 కోట్లకు చేరగా నికరలాభం కూడా 6 శాతం వృద్ధితో రూ.1,016 కోట్లుగా నమోదైందన్నారు. మార్చి 31 నాటికి మొత్తం డిపాజిట్లు రూ.55,567 కోట్లుగాను, రుణాలు రూ.46,418 కోట్లుగాను ఉన్నాయి. నాలుగో త్రైమాసికంలో ఆస్తులపై రాబడి 1.48 శాతంగా ఉన్నదని ఆయన చెప్పారు. అలాగే పారుబాకీలకు కేటాయింపులు కూడా గణనీయంగా తగ్గాయని, కొవిడ్ ముందు నాటి స్థాయికి తగ్గించుకునే దిశగా ముందుకు సాగుతున్నామని కామకోడి తెలిపారు. బీమా విభాగంలో మంచి వృద్ధిని తాము ఆశిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,510 ▼	68,300 ▼	99,000 ▼
ముంబై	74,214 ▲	67,980 ▲	92,873 ▲

హైదరాబాద్‌లో ఎంఫసిస్ జీసీసీ

హైదరాబాద్‌లో మరో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటైంది. ప్రముఖ ఐటీ కంపెనీ ఎంఫసిస్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ ఇన్ఫోనిక్స్ ఇన్ఫోసిటీ పేరుతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎంఫసిస్ ఈ జీసీసీ ద్వారా తన అంతర్జాతీయ ఖాతాదారులకు కృత్రిమ మేధ (ఏఐ), జెన్-ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో సేవలు అందిస్తుంది. కంప్యూటింగ్, ఏఐ ఆధారిత రంగాలకు ఈ జీసీసీ ఇన్నోవేటివ్ హబ్‌లా పనిచేస్తుందని ఎంఫసిస్ తెలిపింది.

ఓఎన్‌జీసీ లాభం 19 రెట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో నికర లాభంలో 19 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2022-23 సంవత్సరంతో పోల్చితే కంపెనీ స్టాండ్‌ఎలోన్ నికర లాభం రూ.528 కోట్ల నుంచి రూ.9,869 కోట్లకు పెరిగింది. 2016 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలానికి వివాదాస్పద పన్నుల డిమాండు కోసం గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.9,235 కోట్లు కేటాయించినట్టు కంపెనీ వెల్లడించింది. అయితే కంపెనీ క్యూ4 ఆదాయం 4.6 శాతం తగ్గి రూ.34,637 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1.38 లక్షల కోట్ల ఆదాయంపై రూ.40,526 కోట్ల చారిత్రక గరిష్ఠ నికర లాభం ఆర్జించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 సంవత్సరానికి 50 శాతం (రూ.5 ముఖవిలువ గల ఒక్కో షేరుపై రూ.2.50) తుది డివిడెండుకు సిఫారసు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	గోదావరి	154
వరంగల్	150	విజయవాడ	154
కరీంనగర్	150	గుంటూరు	154
మహబూబ్‌నగర్	152	ఒంగోలు	154
కర్నూలు	152	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

» ఎమ్మెల్సీ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి జడ్సన్ డిమాండ్

నల్లగొండ టౌన్, మే 21: పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రచారంలో ఓటర్లను బెదిరించేలా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ నల్లగొండలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం (కలెక్టరేట్) ఎదుట మంగళవారం దీక్ష చేశారు. పోలీసులు ఆయన దీక్షను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా జడ్సన్ మాట్లాడుతూ, ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తనను మండలికి పంపుతారా లేదంటే స్మశానానికి పంపుతారా అంటూ మానసికంగా ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడారని ఆరోపించారు. ఇదే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు, పరిశీలకుడు రాహుల్‌బొజ్జాతో పాటు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని బక్క జడ్సన్ డిమాండ్ చేశారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: నర్సయ్యగౌడ్

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో పలు ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బూర నర్సయ్య గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ. 7 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, గతంలో రూ. 2 వేల కోట్లకు టోకెన్లు జారీచేసినా నిధులు విడుదల చేయలేదని చెప్పారు.

సన్నాలకే బోనస్ అనడం మోసమే

» సూర్యాపేటలో రైతులు, బీఆర్ఎస్ నిరసన

సూర్యాపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్... ప్రస్తుతం సన్న రకానికి మాత్రమే ఇస్తామంటూ మోసం చేస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ఎదుట, నాగారం మండల కేంద్రంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ప్రభుత్వం సన్న ధాన్యానికే బోనస్ ప్రకటించడం సరికాదని, దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు నాగారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. నాగారం ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట-జనగాం రహదారిపై రాస్తారోకో చేశారు.

చేపల వేట హక్కులపై నిపుణుల కమిటీని వేయండి

» బెస్త, ముదిరాజ్ వివాదంపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపలవేట హక్కుల విషయమై వివిధ వర్గాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిపుణుల కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బెస్త, బోయి, గంగపుత్ర, గూండ్ల వర్గాలతో ముదిరాజ్, ముత్రాసీ, తెనుగు వర్గాల మధ్య నెలకొన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన జీవోలు, కమిషన్లు ఇచ్చిన నివేదికలన్నింటినీ అధ్యయనం చేసి ఇరువర్గాలకు సమన్యాయం చేసేందుకు మూడు నెలల్లోగా ఈ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. అన్ని వర్గాల పరిస్థితులను, వృత్తులను పరిశీలించి సభ్యత్వాల విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఈ మేరకు రెండు వర్గాలు దాఖలు చేసిన దాదాపు 26 పిటిషన్‌లపై విచారణను ముగించింది.

టీహబ్స్ సిబ్బందికి ఫిబ్రవరి దాకా జీతాలిచ్చేశాం!

» 'డయాగ్నస్టిక్ హబ్స్‌కు జబ్బు'కథనంపై వైద్యశాఖ వివరణ

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్స్(టీ హబ్స్) సిబ్బందిలో 63 మందికి మినహా మిగిలిన వారందరికీ ఫిబ్రవరి వరకు వేతనాలు చెల్లించామని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' సోమవారం సంచికలో ప్రచురితమైన "డయాగ్నస్టిక్ హబ్స్‌కు జబ్బు" కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. టీహబ్స్‌లో 283 మంది పనిజేస్తుండగా వారిలో 63 మంది తప్ప మిగిలిన వారికి రెండు నెలల జీతాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం నుంచి నిధులు రాగానే చెల్లిస్తామని పేర్కొన్నారు. 104 సేవల నుంచి సరెండర్ అయిన వారిలో 54 మంది టీహబ్స్‌లో పనిజేస్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తుందని ఆర్వీ కర్ణన్ చెప్పారు. సకాలంలో వేతనాలివ్వని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై విచారణ జరిపిస్తామని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే టీ హబ్స్‌లలో కేంద్రం అనుమతినిచ్చిన మేర కన్సల్టెంట్ డాక్టర్స్ ఉన్నారని, కొన్నిచోట్ల మాత్రం లేరని ఆయన అన్నారు, రేడియాలజిస్టులు లేనిచోట్ల సంబంధిత హబ్స్ వైద్యులే రేడియాలజీ రిపోర్టులను ప్రాథమికంగా పరీక్షిస్తున్నారని, మరింత స్పష్టత కోసం పెద్దాస్పత్రుల్లోని వైద్యులకు పంపుతున్నారని తెలిపారు.

టెస్కాబ్ ఖాతాదారులు ఆందోళన చెందొద్దు: ఎండీ

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్)లో డిపాజిట్లన్నీ సురక్షితంగా ఉన్నాయని, ఖాతాదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని టెస్కాబ్ ఎండీ నేతి మురళీధర్ భరోసానిచ్చారు. ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ అనే సంస్థకు టెస్కాబ్‌కు ఎలాంటి సంబంధంలేదని ఆయన స్పష్టం చేశారు. చిట్‌ఫండ్ నిర్వాహకులు మేక నేతాజీ భార్య నిమ్మగడ్డ వాణిబాల టెస్కాబ్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, అధిక వడ్డీ వస్తుందని నమ్మించి ఖాతాదారులతో తమ చిట్‌ఫండ్ కంపెనీలో పెట్టుబడి పెట్టించారని తెలిపారు. వాణిబాలపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎండీ చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టిన మహిళలు

» బస్సు ఆపకుండా వెళ్లిపోయాడని ఆగ్రహం

» మరో బస్సులో వెనకాల వెళ్లి డ్రైవర్‌తో గొడవ

మిర్యాలగూడ అర్బన్, మే 21: తాము చేయి ఎత్తినా బస్సును ఆపలేదని నలుగురు మహిళలు డ్రైవర్‌పై ఆగ్రహంతో ఊగిపోయారు. వెనకాలే వచ్చిన మరో బస్సులో వెళ్లి.. ఆ డ్రైవర్‌తో గొడవపడ్డారు. మాటా మాటా పెరగడంతో డ్రైవర్‌పై చేయిచేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మిర్యాలగూడకు చెందిన నలుగురు మహిళలు పీఏపల్లిలోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరై మిర్యాలగూడకు వెళ్లేందుకు అంగడిపేట స్టేజీ వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో అటువైపుగా వచ్చిన దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే, డ్రైవర్ స్టేజీకి దూరంగా బస్సు ఆపగా.. పరుగెత్తుకుంటూ వెళ్లిన మహిళల్లో ఇద్దరు మాత్రమే బస్సు ఎక్కారు. 'మా వాళ్లు వస్తున్నారు.. బస్సు ఆపండి' అని చెప్పినా ఆపకపోవడంతో.. బస్సెక్కిన ఇద్దరు మహిళలు కిందకు దిగారు. వెనకాల వస్తున్న మరో బస్సులో వారు మిర్యాలగూడకు చేరుకున్నారు. తమను ఎక్కించుకోకుండా డిపోకు చేరుకున్న బస్సు వద్దకు వెళ్లిన ఆ మహిళలు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో బస్సు డ్రైవర్‌పై చేయి చేసుకున్నారు. డ్రైవర్ టూటౌన్ పోలీసులకు ఫోన్ చేయడంతో.. వారు వచ్చి ఆ మహిళలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే బస్సు డ్రైవర్ తమ పట్ల అమర్యాద, అసభ్యంగా ప్రవర్తించాడని మహిళలు ఫిర్యాదు చేశారు. దీంతో చేసేదేమీలేక ఆ డ్రైవర్ తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నాడు. అనంతరం పోలీసులు ఇరువురికి సర్ది చెప్పారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు భారత సంతతి విద్యార్థుల మృతి

జార్జియా, మే 21: అమెరికాలోని జార్జియాలో జరిగిన కారు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు యువతులు ఉన్నారు. ముగ్గురూ 18 ఏళ్ల వయసు వారే. మృతులను ఆర్యన్ జోషి, శ్రియ అవసరాల, అన్వీ శర్మగా, గాయపడిన వారిని రుత్విక్ సోమేపల్లి, మహమ్మద్ లియాఖత్‌గా గుర్తించారు. శ్రియ, రుత్విక్ తెలుగువారు. కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిందని, అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

3 కరెన్సీ నోట్ల నంబర్లే 'టోకెన్'గా హవాలా!

» లిక్కర్ కేసు అనుబంధ చార్జిషీట్‌లో ఈడీ

» మరో నలుగురి ప్రమేయంపై వాదనలు

» అనుబంధ చార్జిషీట్ పరిగణనపై తీర్పును 29కి రిజర్వు చేసిన కోర్టు

» కవిత బెయిల్ పిటిషన్ విచారణ 24న

న్యూఢిల్లీ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మరో నలుగురి ప్రమేయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకోవాలా? లేదా? అనే అంశంపై తీర్పును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 29కి రిజర్వ్ చేసింది. కవితతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున గోవాలో ప్రచారం నిర్వహించిన ముగ్గురు ఉద్యోగులు (చారియట్ ప్రొడక్షన్స్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చరణ్‌ప్రీత్ సింగ్, ఇండియా ఎహెడ్ న్యూస్ ఛానల్ మాజీ ఉద్యోగి అరవింద్ సింగ్‌పై అభియోగాలు మోపుతూ ఈడీ ఈ నెల 10న సుమారు 200 పేజీలతో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. దానిని పరిగణనలోకి తీసుకునే



అంశంపై మంగళవారం విచారణ జరిగింది. కవితతో పాటు మిగిలిన నలుగురి ప్రమేయంపై ఈడీ బలమైన వాదనలు వినిపించింది. కాల్ డేటాతో పాటు కాల్ రికార్డులను కూడా సేకరించామని పేర్కొంది. హవాలా రూపంలో డబ్బులు మళ్లించేందుకు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్‌గా వాడారని ఈడీ ఆరోపించింది. 'ప్రిన్స్ కుమార్ చారియట్ మీడియా సంస్థలో ఉద్యోగిగా పనిచేశారు. రూ.100 కోట్ల అక్రమ మళ్లింపులో ఆయన పాత్ర స్పష్టంగా ఉంది. హవాలా ఆపరేటర్ కాంతికుమార్ ద్వారా మూడు దశల్లో రూ.16 లక్షలు ప్రిన్స్ కుమార్‌కు అందాయి. అందులో మూడు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్ నంబర్‌గా ఉపయోగించి హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారు. మరో నిందితుడు అరవింద్ సింగ్ గోవాకు డబ్బులు మళ్లించడంలో కీలకంగా వ్యవహరించాడు. ఇలా అందరి పాత్రపై బలమైన సాక్ష్యాలు సేకరించామ'ంటూ ఈడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌కే మట్ట, న్యాయవాది జోహెబ్ హుస్సేన్ కోర్టు ముందు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి కావేరి బవేజా తీర్పును వాయిదా వేశారు. కవిత బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 24న ఢిల్లీ హైకోర్టులో విచారణ జరగనుంది. కాగా, ఢిల్లీ మద్యం పాలసీ కేసులోనే సీఎం కేజ్రీవాల్‌పైనా ఈడీ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై ఈ నెల 28న రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది.

కేసు వచ్చిందంటే కాసులే

లేదంటే బూతు పురాణం.. బూటుకాలితో తన్నుడు.. బాధితుల్ని భయపెట్టుడు

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అరెస్టు చేసిన ఏసీపీ తీరు ఆది నుంచి వివాదాస్పదమే అని సమాచారం! సంపన్నులే లక్ష్యంగా పనిచేస్తారని.. డబ్బు దండుకోవడమే ఆయన నైజమని.. చేతిలో కాసులు పడితే చాలు.. ఎలాంటి కేసునైనా తారుమారు చేస్తారని.. ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఎవరైనా బాధితులు న్యాయం కోసం వస్తే తొలుత వారి పట్ల ఆయన ఎంతో సానుభూతి ప్రదర్శిస్తారు. నీతి నిజాయితీకి మారుపేరున్న ఆఫీసరుగా కలరింగ్ ఇచ్చి, ఆ తర్వాత అసలు సినిమా చూపిస్తారు. నిందితులను స్టేషన్‌కు పలిపించి తన ప్రతాపం చూపిస్తారు. 'నీ వెనుక ఎంత పెద్దవాళ్లు ఉన్నా నేను లెక్కచేయను' అన్నట్లు బిల్డప్ ఇస్తారు. అయినా వినకపోతే వారిపై బూతు పురాణం ఎత్తుకుంటారని.. వయసుతో సంబంధం లేకుండా, తప్పు ఒప్పు చూడకుండా ఇష్టం వచ్చినట్లు కొడతారని.. బూటు కాళ్లతో తంతారని.. బెదిరించి, భయపెట్టి, ఆ తర్వాత బేరానికి దిగుతారని సమాచారం. డబ్బులు ఇచ్చినా తమకు న్యాయం జరగలేదని భావించిన బాధితులెవరైనా ఆయన వద్దకు వెళ్తే.. నానా బూతులూ తిట్టి, తరిమేస్తారని, వారు ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కలిసినా ప్రయోజనం లేకుండా కేసును తారుమారు చేసే ఘనత ఆయన సొంతం అని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు.



ఉమామహేశ్వరరావు ఇంట్లో అధికారుల తనిఖీలు

మంచిగా నటిస్తూనే..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కొద్దిరోజుల క్రితం ఏసీపీ వద్దకు ఒక ఫిర్యాదు వచ్చింది. తనను ఒక రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యం మోసం చేసిందని.. పెట్టుబడుల పేరుతో సుమారు రూ. 5 కోట్లు తీసుకొని తిరిగి ఇవ్వట్లేదని ఒక బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆ సమయంలో ఎంతో మర్యాదగా, నిజాయితీకి మారుపేరులా మాట్లాడిన ఏసీపీ.. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత బాధితుడు పనిమీద విదేశాలకు వెళ్లి కొద్దిరోజుల తిరిగి ఇండియాకు వచ్చాడు. వచ్చే క్రమంలోనే అతన్ని ఏయిర్‌పోర్టులో అధికారులు నిలిపివేశారు. ఆయనపై లుక్ అవుట్ నోటీసు ఉందంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనపై ఎలాంటి కేసులూ లేవని ఆయన ఎంత మొత్తుకున్నా వారు వినిపించుకోలేదు. తీరా పోలీసులు వచ్చి బాధితున్ని ఏయిర్‌పోర్టు నుంచి సీసీఎస్‌కు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే సదరు అధికారి దర్శనమిచ్చారు. "సార్ ఫిర్యాదు చేసింది నేనైతే.. నామీద ఎల్‌వోసీ ఎలా ఇచ్చారు?" అని ప్రశ్నించగానే.. ఆయనపై విరుచుకుపడ్డారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు తీసుకొని నేరగాళ్లను వదిలేసి.. బాధితుణ్ని ఇన్వెస్టిగేట్ చేయడం ప్రారంభించారు. తనదైన శైలిలో బూతు పురాణం అందుకున్నారు. అతడి కోసం వచ్చిన అడ్వొకేట్స్‌ను సైతం ఇష్టం వచ్చినట్లు తిట్టి, బెదిరించి పంపించారు. చివరకు అతని నిజస్వరూపం తెలుసుకున్న బాధితుడు మరో దారి లేక ఏసీపీ చెప్పినట్లు చేయాల్సి వచ్చింది. తనకు అనుకూలంగా బేరం కుదుర్చుకున్న ఏసీపీ రూ.లక్షల్లో దండుకొని వదిలేశాడు. దీంతో.. కేసు సంగతి దేవుడెరుగు.. బతుకు జీవుడా' అంటూ ఉల్టా రూ. లక్షల్లో సమర్పించుకుని ఆయన చెర నుంచి బయటపడినట్లు తెలిసింది. ఇప్పుడాయన అక్రమాలన్నీ వెలుగులోకి వస్తున్నాయని తెలుసుకున్న బాధితుడు.. 'ఆంధ్రజ్యోతి'ని సంప్రదించి తన గోడు వెళ్లబోసుకున్నారు. కాగా.. సీసీఎస్‌కు వచ్చినప్పటి నుంచి ఆయన డీల్ చేసిన కేసులు, వాటిలో నీరు గార్చిన కేసులు, ముడుపులు తీసుకొని తొక్కిపెట్టిన కేసులు, విచారణ సరిగా చేయకుండానే చార్జిషీట్ దాఖలు చేసిన కేసులపై కమిషనరేట్ ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరపనున్నట్లు తెలిసింది.

ఏసీబీ వలలో ఏసీపీ!

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉమామహేశ్వరరావు సాహితీ ఇన్‌ఫ్రా ప్రీ లాంచ్ పేరుతో జరిగిన రూ.1500 కోట్ల మోసం కేసులో కీలక విచారణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేసినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సురేంద్ర తెలిపారు. ఇప్పటిదాకా నిర్వహించిన సోదాల్లో రూ.37.5 లక్షల నగదు.. 60 తులాల బంగారం, 17 విలువైన ఆస్తిపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు ఘట్‌కేసర్‌లో 5 చోట్ల, శామీర్ పేట, కూకట్‌పల్లి, మల్కాజిగిరిలో ఒక్కొక్కచోట, వైజాగ్, చోడవరంలో ఏడు చోట్ల, అశోక్‌నగర్‌లో ఏడుచోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటివరకూ స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ. 3.46 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.25 కోట్లకు పైగానే ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమామహేశ్వరరావు పేరిట ఉన్న రెండు లాకర్లు ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడొచ్చని భావిస్తున్నారు. కాగా.. అధికారులు స్వాధీనం చేసుకున్న ఒక డైరీలో సందీప్ అనే పేరు రాసి ఉన్నట్లు సమాచారం. అది పోలీస్ అధికారి పేరేనా అని విలేకరులు ప్రశ్నించగా.. దానిపై ఇంకా పూర్తి స్పష్టత లేదని, విచారణలో తెలుస్తుందని ఏసీబీ జేడీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోదాలు ముగిసిన అనంతరం ఉమామహేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఆయన్ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సీసీఎస్‌కు వస్తున్న ఆర్థిక మోసాల కేసుల్లో లంచాలు తీసుకున్నట్లు ఉమామహేశ్వరరావుపై ఆరోపణలు వచ్చాయని జేడీ తెలిపారు.

హడావుడి చేసి..

రెండేళ్లుగా సీసీఎస్‌లో నలుగుతున్న సుమారు రూ. 1500 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ప్రీలాంచ్ మోసం కేసు ఎటూ తేలలేదు. గత ప్రభుత్వ పెద్దలు కొందరు కలగజేసుకొని ఆ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ప్రభుత్వం మారిన తర్వాత వచ్చిన అధికారులు ఆ కేసును మళ్లీ బయటకుతీశారు. ప్రీ లాంచ్ పేరుతో మోసపోయిన వేలాది మందికి న్యాయం చేస్తామని మాటిచ్చారు. అప్పుడే సీసీఎస్‌కు ఏసీపీగా వచ్చిన ఆయనకు ఆ కేసు పునర్విచారణ బాధ్యతను అప్పగించారు. ఇదే అదనుగా భావించిన ఏసీపీ మొదట్లో హడావుడి చేసి, కేసు మొత్తం కొలిక్కి వచ్చినట్లుగా బిల్డప్ ఇచ్చారు. ఆ తర్వాత ఆయన తన స్టైల్‌ను ఈ కేసులోనూ ప్రదర్శించడంతో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దాంతో పాటు.. మరికొన్ని ఆర్థిక నేరాల కేసుల్లోనూ ఏసీపీ విచ్చలవిడిగా తన మార్కు పనితీరును ప్రదర్శించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఫలితమే ఏసీబీ దాడులు.

బోనస్.. సన్నధాన్యంతో మొదలెట్టాం

» ఎక్కడో ఒక చోట మొదలుపెట్టాలి కదా!

» తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్నీ కొంటాం

» 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ

» వరి వేస్తే ఉరే అన్నవాళ్లకు, మాకూ తేడా ఇదే

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి మాత్రమే బోనస్ కాదని, మద్దతు ధరపై బోనస్ ఇచ్చే ప్రక్రియను సన్నరకం ధాన్యంతో మొదలుపెడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. ఈ ప్రక్రియను ఎక్కడో ఒకచోట మొదలుపెట్టాలి కదా అన్నారు. వరి వేస్తే ఉరేస్తామని తాము ఏమీ చెప్పట్లేదని, తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు కొంటున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. వరి వేస్తే ఉరి వేస్తాం అనే వాళ్లకు, తమకూ తేడా ఇదేనన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టివిక్రమార్క మాట్లాడారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్నీ మద్దతు ధరకు కొనాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రతిపక్షాలకు రుచించడం లేదన్నారు. ఈ అంశంలో రైతులను భయభ్రాంతలకు గురి చేస్తున్నాయన్నారు. రాజకీయాలను రైతులను ఇబ్బంది పెట్టేందుకు వాడొద్దన్నారు. రాష్ట్రంలో అసలు ధాన్యమే కొనుగోలు చేయట్లేదని, కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోందంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు పచ్చి అబద్ధాలు, గాలిమాటలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత ఏడాది ఇదే సమయంలో తాను పాదయాత్ర చేస్తుండగా రైతులు తమ ధాన్యాన్ని రోడ్ల వెంట కుప్పలుగా పోసి ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని, వేలాదిమంది రైతులు తనతో గోడు వెళ్లబోసుకున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రజల్ని తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి అబద్ధపు ప్రచారానికి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇది ప్రజాప్రభుత్వమని, రైతులకు ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత తమదని చెప్పారు. గత ప్రభుత్వం కంటే 15 రోజుల ముందుగానే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టామన్నారు. వారి కంటే ఎక్కువ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులు పండించిన ప్రతి గింజా.. ఎన్ని టన్నుల మేరకైనా కొంటామన్నారు. గత ఏడాది 7,031 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరిగితే.. ఈ ఏడాది 7,245 కేంద్రాల్లో జరుగుతోందన్నారు. గత ఏడాది ఈ సమయానికి 33.97 లక్షల టన్నుల మేరకు ధాన్యం సేకరిస్తే ఈ ఏడాది 37.59 లక్షల టన్నుల మేరకు సేకరణ జరిగిందన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశంలో టెక్నాలజీ, కమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతున్నాయి.. ఎంతధాన్యం కొన్నామన్న సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకుంటున్నామంటే దానికి రాజీవ్ గాంధీ ముందుచూపే కారణమన్నారు. కాగా, గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో భట్టి పాల్గొన్నారు. రానున్న రోజుల్లో మహిళా నేతలకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.

దొడ్డు బియ్యం.. దొడ్డ భారం!

(మొదటి పేజీ తరువాయి)



వైపు మొగ్గు చూపుతున్నారు. సన్న బియ్యం సాగును క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు.

సన్నాలకు డిమాండ్

మార్కెట్లో సన్నాలకు డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. డిమాండ్‌కు - సరఫరాకు వ్యత్యాసం పెరుగుతుండడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్లోనే కాదు.. తెలంగాణ ప్రభుత్వ పథకాల్లోనూ సన్నాలకు ప్రాధాన్యతనిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతి గృహాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనాలకు ప్రభుత్వం సన్న బియ్యాన్నే పంపిణీ చేస్తోంది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో సేకరించే దొడ్డు బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేయించి.. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులు, జాతీయ ఆహార భద్రత కార్డుదారులకు పంపిణీ చేస్తోంది. ఇలా పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేయడానికి ఏటా 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అవసరం. ఉత్పత్తి మాత్రం 174 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. కేంద్రం కూడా దొడ్డు బియ్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో దొడ్డు బియ్యం నిల్వలు పెరిగిపోతున్నాయి. రేషన్ కార్డుదారులు దొడ్డు బియ్యాన్ని తీసుకుంటున్నా.. తినడానికి మాత్రం ఇష్టపడడం లేదు. తమ కోటా బియ్యాన్ని అమ్ముకుంటున్న ఉదంతాలున్నాయి. దీంతో.. రేషన్ కార్డుల ద్వారా కూడా సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. నిజానికి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మిల్లింగ్ చేయిస్తున్న వాటిలో దొడ్డు బియ్యం వాటా 98% ఉండగా.. మిగతా 2%లోపే సన్న బియ్యం ఉంటోంది.

ప్రోత్సాహకంతో రైతుల్లో మార్పు!

సన్నాలను పండించే రైతులకు క్వింటాకు రూ.500

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి ఇలా..!

సంవత్సరం	దొడ్డు ధాన్యం	సన్న ధాన్యం
	(లక్షల మెట్రిక్ టన్నుల్లో)	
2019>20	91.45	86.79
2020>21	93.01	125.51
2021>22	96.26	105.90
2022>23	178.46	79.74
2023>24	174.18	86.26

చొప్పున ప్రోత్సాహకమిస్తామని రేవంత్ సర్కారు ప్రకటించింది. దిగుబడి తక్కువ అనే ఒకేఒక్క కారణంతో సన్నాలకు దూరంగా ఉంటున్న రైతులు.. సర్కారు ప్రోత్సాహకంతో దొడ్డు ధాన్యం జోలికి వెళ్లరని అభిప్రాయపడుతోంది. తక్కువ దిగుబడికి జరిగే లోటును రూ.500 బోనస్ పూడ్చివేస్తుందని సర్కారు భావిస్తోంది. దొడ్డు ధాన్యాన్ని పండించే రైతులు.. సన్నాలవైపు మళ్లితే.. ఇప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులన్నీ తొలగిపోతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అంటే.. డిమాండ్ నేపథ్యంలో ధరలు తగ్గడం, ఆహార భద్రత పథకానికి కూడా సన్నాలను పంపిణీ చేయడంతోపాటు.. దొడ్డు బియ్యం నిల్వల సమస్యను అధిగమించవచ్చని అభిప్రాయపడుతోంది.

సన్నవడ్ల పేరుతో సన్నాయి నొక్కులు

» రాష్ట్రంలో 85శాతం దొడ్డు రకమే.. ఆ సోయి సర్కార్‌కు లేదు

» అధికారం కోసం కాంగ్రెస్ 420 హామీలు: కేటీఆర్



నల్లగొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సన్నవడ్లకే ఇస్తానంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో 80 నుంచి 85 శాతం దొడ్డురకం వడ్లే పండుతాయన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదన్నారు. రైతులను మోసం చేసిన సన్నాసి ప్రభుత్వానికి బుద్ధివచ్చేలా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీర్పునివ్వాలని గ్రాడ్యుయేట్లను కోరారు. మంగళవారం నల్లగొండ, దేవరకొండ , మిర్యాలగూడ, హాలియాలో బీఆర్ఎస్ నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఆరు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఇంటర్వ్యూలు చేయకుండా ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమో సీఎం చెప్పాలన్నారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించినట్టుగా రెండు లక్షల ఉద్యోగాలు ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కల్పించినట్టు నిరూపిస్తే (ఎమ్మెల్యే పదవికి) రాజీనామా చేసేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రేవంత్ ప్రభుత్వం అయిదు నెలల్లోనే అయిదేళ్ల అపఖ్యాతిని మూటగట్టుకుందని దుయ్యబట్టారు. ఈ ఉప ఎన్నిక బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి.. విదేశాల్లో ఉన్నత విద్య చదవి, ఉన్నత ఉద్యోగాలు వదులుకుని తెలంగాణ ప్రజల కోసం పనిచేయడానికి ముందుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ మాత్రం యూట్యూబర్‌ని, మీడియాని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్, చీటింగ్‌లకు పాల్పడ్డ వ్యక్తిని అభ్యర్థిగా నిలబెట్టిందని విమర్శలు గుప్పించారు. నల్లగొండకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఆలోచించాలని కోరారు.

వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు కుట్ర

» 90% పండే దొడ్డు వడ్లకు ఎందుకివ్వరు?: హరీశ్ రావు



హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వడ్లకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట మార్చారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో 90 శాతం పండే దొడ్డు రకం వడ్లకు బోనస్ ఇవ్వకుండా.. కేవలం 10 శాతం పండే సన్న రకాలకు మాత్రమే ఇస్తామని చెప్పడం ద్వారా.. దొడ్డు వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పండే 1.20 కోట్ల టన్నుల వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలంటే రూ.6 వేల కోట్లు వెచ్చించాలని తెలిపారు. సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తే రూ.500 కోట్లు అవుతుందని.. తద్వారా రైతులకు రూ.5,500 కోట్లు ఇవ్వకుండా మోసం చేసే కుట్ర జరుగుతోందని వివరించారు. వడ్ల బోనస్‌పై కేబినెట్ నిర్ణయాన్ని ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి.. తర్వాత ఆ మాటే అనలేదని కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు వడ్ల విషయంలోనూ మాట తప్పుతున్నారని అన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చే వరకు వదలబోమని, రైతాంగాన్ని ఏకం చేసి పోరాడతామని హెచ్చరించారు. రైతు భరోసా కింద ఇస్తామన్న రూ.15 వేలు ఇవ్వడం లేదని.. కేవలం రూ.5 వేలిచ్చి రూ.2,500 ఎగ్గొట్టారని మండిపడ్డారు. గత బకాయి రూ.2500, వానకాలం పంటకు ఇచ్చే రూ.7500 కలిపి జూన్‌లోపు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది ఇదే సమయానికి తాము 66 లక్షల టన్నుల వరి ధాన్యం కొంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 36 లక్షల టన్నులు మాత్రమే కొన్నదని హరీశ్ తెలిపారు. వడ్ల కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీంతో రైతాంగం ప్రైవేటులో అమ్ముకొని దళారుల చేతిలో నష్టపోతోందన్నారు. పది రోజుల్లో ఈ సీజన్ ముగియనున్న కారణంగా సాకులు చెప్పకుండా.. తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

యూ ట్యాక్స్ ఆరోపణలు అబద్ధం

- మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నా : ఉత్తమ్
- దొడ్డు వడ్లకూ మంచి ధరపై యోచన: కోదండరెడ్డి



హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తూ నిత్యం వార్తల్లో ఉండాలని చూస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. అందులో భాగంగానే తాము యూ ట్యాక్స్ వసూలు చేస్తున్నామంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. కనీస అవగాహన కూడా లేకుండా మహేశ్వర్‌రెడ్డి.. బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం తాను దైవ దర్శనం కోసం వేరే రాష్ట్రానికి వచ్చానని, హైదరాబాద్‌కు వచ్చాక మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు జవాబు చెబుతానని ఒక ప్రకటనలో వెల్లడించారు. కాగా, దొడ్డు వడ్లకూ మంచి ధర కోసం సీఎం రేవంత్ ఆలోచిస్తున్నారని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా ఈ నెల 27న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న గ్రాడ్యుయేట్ ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. బీఆర్ఎస్ హయాంలో 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారని.. అలా అయితే ప్రజలు వారిని ఎందుకు ఓడించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్, ఈటల రాజేందర్ భాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.

పరాధీనమైన భూముల్ని స్వాధీనం చేసుకోండి

- ఆలయాల భూములకు జియో ట్యాగింగ్: మంత్రి సురేఖ



హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పరాధీనమైన దేవాలయాల భూములను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారుల్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. విలువైన ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ఆలయాల పేరు మీద పట్టా, పాస్‌బుక్‌లు చేయించాలన్నారు. ఖాళీ స్థలాల్లో ఫంక్షన్‌హాళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడం వల్ల దేవాదాయ శాఖకు ఆదాయం సమకూరుతుందని అధికారులకు మంత్రి సూచించారు. పలు అంశాలపై దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ మంగళవారం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఇక్కడి ఆలయాలకు ఆంధ్రప్రదేశ్‌తోసహా ఇతర రాష్ట్రాల్లో ఉన్న భూముల వివరాలు, కోర్టు కేసులు, ఆక్రమణలో ఉన్న భూముల వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రసాద్ పథకం కింద ఆలయాల్లో పర్యాటక శాఖతో కలిసి చేపడుతున్న కార్యక్రమాలు, దాతల విరాళాలు, ఇతర నిధులతో చేపడుతున్న పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. సీఎస్ఆర్ నిధుల సేకరణకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు. నదీ తీర ఆలయాల్లో జలహారతి, శంఖనాదం వంటి ఆధ్యాత్మిక శోభను పెంచే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఆలయాల్లో భక్తులకు వసతి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయాల చరిత్రను తెలుసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌ను రూపొందించే అంశంపై మంత్రి చర్చించారు. టెండర్లలో పారదర్శకత లోపిస్తే వేటు తప్పదని హెచ్చరించారు.

ఇండియా కూటమికి మద్దతివ్వండి

- ఢిల్లీ తెలుగువారికి మల్లు రవి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో లౌకిక, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి అన్నారు. ఢిల్లీలో స్థిరపడిన తెలుగువారు రాజకీయ పరిణతి కలిగినవారని, వారంతా ప్రజాస్వామ్య రక్షణకు, దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యంతో కూడిన పరిపాలనను అందించేందుకు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. తెలంగాణ భవన్ దగ్గర మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ.. ఢిల్లీలో కాంగ్రెస్, ఆప్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు తెలుగువారు ఓట్లేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు కాంగ్రెస్ అభ్యర్థులు కన్నయ్యకుమార్, ఉదిత్‌రాజ్ తరఫున ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో శాంతిస్థాపనకు విశేష కృషి చేశారన్నారు. దేశ సమగ్రత కోసం తన ప్రాణాలనే అర్పించారని మల్లు రవి కొనియాడారు. అంతకుముందు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వీర భూమి వద్ద నివాళులర్పించారు.

ఏపీ వ్యాప్తంగా రెడ్ అలర్ట్!

- ఓట్ల లెక్కింపు రోజు హింసాత్మక ఘటనలు జరిగే చాన్స్?
- ఈసీ, పోలీసుల అనుమానాలు.. విస్తృతంగా తనిఖీలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ఓట్ల లెక్కింపు రోజు అల్లర్లు జరుగుతాయనే సమాచారంతో ఏపీ పోలీసులు అప్రమత్తం అయ్యారు. ప్రధాన పార్టీలకు చెందిన వ్యక్తులు పరస్పరం దాడులకు దిగే అవకాశం ఉందంటూ నిఘా విభాగం వరుస హెచ్చరికలతో చర్యలకు సిద్ధమయ్యారు. ఈ మేరకు కౌంటింగ్ రోజు హింసాత్మక ఘటనలకు అవకాశం ఇవ్వకుండా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. జిల్లాల్లో ఎక్కడికక్కడ కార్డెన్ సెర్చ్ (తనిఖీలు) చేపట్టి గట్టి చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఈ ఆదేశాలతో ఎస్పీలు... జిల్లాల్లో బృందాలను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకూ ఎలాంటి సెలవుల్లేవంటూ సిబ్బందితో పోలీసు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. పోల్ డే హింస జరిగిన ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించి... ప్రతి ఇల్లూ, ప్రతి మలుపులోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలు ఉన్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని, తాము గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయంటూ ఇళ్ల వద్దకెళ్లి అడుగుతున్నారు. కౌంటింగ్ హిస్టరీ షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తున్నారు. సంఘ విద్రోహశక్తుల కదలికలపై నిఘాపెట్టి ఏ మాత్రం అనుమానం వచ్చినా అరెస్టు చేస్తున్నారు. వారిని దూరంగా ఉండే పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు.

బోనస్‌పై విపక్షాల బోగస్ మాటలు

రాష్ట్రాన్ని నాశనం చేసిన వారే ఇప్పుడు నీతులు చెబుతున్నారు



- ముందుగా సన్న వడ్లకు బోనస్ ఇస్తాం
- దశల వారీగా దొడ్డు వడ్లకు: తుమ్మల

ఖమ్మం/హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): బోనస్ అంటే అర్థం తెలియని పార్టీలు, నాయకులు బోగస్ విమర్శలు చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా పొంతన లేని విమర్శలు చేస్తున్నారని, అప్పులు చేసి రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా ఎలా పాలన సాగిస్తుందన్న ఈర్ష్య వారిలో కనిపిస్తోందన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన పెద్దలు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోరుతూ ఖమ్మంలో నిర్వహించిన ప్రచార సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ బియ్యం, బడి పిల్లలకు మధ్యాహ్నం భోజనం, సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం అందించేందుకు ముందుగా సన్న వడ్లు పండించే రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని క్యాబినెట్ మీటింగ్‌లో ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సన్న వడ్లు సాగు చేసే రైతులకు దిగుబడి తక్కువ.. పెట్టుబడి, నష్టం ఎక్కువ ఉంటుందని అన్నారు. అందుకే మొదట వారికి బోనస్ ఇచ్చి.. తర్వాత దశల వారీగా అన్ని రకాల వడ్లు సాగు చేసే రైతులకు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని.. ఎన్ని కష్టాలు ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని గ్యారెంటీలను అమలు చేస్తోందని చెప్పారు. పదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ మోసం చేశాయని తుమ్మల మండిపడ్డారు.

చేనేత మగ్గాల ఆధునికీకరణకు 400కోట్లు

రాష్ట్రంలోని మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునికీకరణకు 2024-25 బడ్జెట్‌లో బీసీశాఖలో కేటాయించిన రూ.400 కోట్లను వినియోగించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ దగ్గర 23 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో డిప్లొమా, డిగ్రీ ప్రవేశాలకు, పోచంపల్లిలో టెస్కో ద్వారా శానిటరీ న్యాప్కిన్ల ఉత్పత్తి పరిశ్రమను స్థాపించేందుకు, ఉత్పత్తి చేసిన న్యాప్కిన్లను స్వయం సహాయక సంఘాల ద్వారా సరఫరా చేయడానికి ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఆయా ప్రభుత్వ శాఖల నుంచి టెస్కోకు రావాల్సిన పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని పేర్కొన్నారు.

ప్రపంచంతోనే పోటీ

(మొదటిపేజీ తరువాయి)

పెద్దసంఖ్యలో ఉన్నప్పటికీ.. వారికి సరైన ప్రోత్సాహం, సహకారం లేదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చేనేత కార్మికుల ఆదాయం పెంచడం, వారికి నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించడం, ఈ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం వంటి అంశాలతో కొత్త పాలసీ ఉండాలని సూచించారు. ఇక్కడి చేనేత ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఉండాలన్నారు. రాష్ట్రంలో వేలాది కుటుంబాలు తరతరాలుగా ఈ రంగాన్నే నమ్ముకుని జీవిస్తున్నాయని, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే చేనేత రంగం అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు టెక్స్‌టైల్ పాలసీని సైతం సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు పూర్తిస్థాయి పారిశ్రామిక విధానాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయని, పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించేలా కొత్త విధానాలు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జీమల్హార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఏడు కొత్త పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం ప్రకటించనుంది.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ తదితరులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

బేగంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ మంత్రి జానారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. నేతలంతా మంగళవారం సోమాజిగూడ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి.. అంజలి ఘటించారు. ప్రధానిగా దేశానికి రాజీవ్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. గాంధీభవన్‌లో రాజీవ్ చిత్రపటానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళులర్పించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్.. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ చేపట్టిన కార్యాచరణ వల్లనే దేశం సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులను సాధించిందన్నారు. ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క.. రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

రాష్ట్ర గేయానికి కీరవాణి స్వరకల్పన

సీఎంను కలిసి సూచనలు తీసుకున్న అందెశ్రీ, కీరవాణి

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' గేయానికి ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి స్వరకల్పన చేయనున్నారు. ఈ పాటను రాష్ట్ర గేయంగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పాటను ప్రభుత్వ కార్యక్రమాల్లో, ఇతరచోట్లా వాడుకునేలా తీర్చిదిద్దుతున్నారు. దీనికి అందెశ్రీ కోరిక మేరకు కీరవాణి స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో కీరవాణి, అందెశ్రీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ భేటీ అయ్యారు. పాట నిడివి, ఇతర అంశాలపై సీఎం సూచనలు తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీపీఆర్వో అయోధ్య రెడ్డి కూడా పాల్గొన్నారు.

తిరుమలలో సీఎం..

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. సీఎం అయ్యాక మొదటిసారిగా రేవంత్ కుటుంబసమేతంగా తిరుమలకు వచ్చారు. తిరుమలలోని రచన అతిథిగృహానికి మంగళవారం రాత్రి 7.20 గంటలకు చేరుకున్న రేవంత్‌రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బస చేయనున్న ఆయన మనవడి పుట్టు వెంట్రుకుల మొక్కు తీర్చుకుని బుధవారం ఉదయం 8.15 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. తిరిగి అతిథిగృహానికి చేరుకుని కొంతసమయం విశ్రాంతి అనంతరం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమవుతారు.



బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- రాగల 3 రోజులు అక్కడక్కడ వర్షాలు
- వడదెబ్బతో ఇద్దరి మృతి

హైదరాబాద్/తంగళ్లపల్లి/సుల్తానాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 3.1 కి.మీ. ఎత్తులో ఉందని తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం అదే ప్రాంతంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అల్పపీడనం ఈశాన్య దిశలో కదిలి ఈ నెల 24 నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. తర్వాత ఈ వాయుగుండం ఈశాన్య దిక్కులోనే కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా, రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతుండగా మరి కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా అర్లీలో అత్యధికంగా 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లికి చెందిన రైతు పోలాడి నర్సింగరావు(70) వడదెబ్బతో మృతిచెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాలరావు పల్లెకు చెందిన ములిగే అంతయ్య(50) వడదెబ్బతో సోమవారం రాత్రి చనిపోయాడు. మంగళవారం ఉదయం అతడి అంతిమ యాత్ర నిర్వహిస్తుండగా డప్పు కొడుతున్న ఎడ్ల శంకరయ్య(55) గుండెపోటుతో కన్ను మూశాడు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు టీజేఎస్ మద్దతు

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టీజేఎస్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. పదేళ్ల పాలనలో విధ్వంసం సృష్టించిన బీఆర్ఎస్‌ను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం కక్కిన.. విభజన హామీలను అమలు చేయని బీజేపీని ఓడించేందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. తమ మద్దతు కోరుతూ కాంగ్రెస్ లేఖ రాసిందని తెలిపింది. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరింది. ఈ మేరకు టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఈ నియోజకవర్గానికి గతంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, టీజేఎస్ నుంచి ఆ పార్టీ అధినేత కోదండరాం పోటీ చేశారు. ఆ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోదండరాంపై తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. విపక్ష ఓటు కోదండరాం, తీన్మార్ మల్లన్న మధ్యలో చీలిపోవడమూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలవడానికి ఒక కారణంగా చెబుతారు. ప్రస్తుత ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న పోటీ చేస్తుండగా మద్దతు ఇవ్వడంపై తర్జన భర్జన పడిన టీజేఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం.. చివరికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆగస్టులో టెండర్లు!

(మొదటి పేజీ తరువాయి)



రావడం లేదు. ఈ కారణంగా ఓ దశలో అలైన్‌మెంట్ మార్చాలని అధికారులు భావించారు. అయితే.. ముందుగా ఎంచుకున్న అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండడంతో.. అటవీ, ఇతర భూముల సమస్యను అధిగమించే దిశలో చర్యలు కొనసాగుతున్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మాత్రం రైతుల నుంచి ఆందోళనలు ఎదురయ్యాయి. తొలుత సరిహద్దు రాళ్లను పాతిన ప్రాంతాల నుంచి కాకుండా.. తమ పొలాల్లోంచి ఆర్‌ఆర్‌ఆర్ వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చారంటూ వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో అక్కడ భూసేకరణ పెండింగ్‌లో ఉంది. నిజానికి 90% భూసేకరణ పూర్తయితే తప్ప.. ఎన్‌హెచ్‌ఏఐ నిర్మాణ పనులకు ముందుకు రాదు. అయితే.. ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో మాత్రం.. ఇప్పటి వరకు సేకరించిన భూమిలో పనులను ప్రారంభిస్తే.. వివాదాలను సమాంతరంగా పరిష్కరించుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఆరు ప్యాకేజీల్లో పనులు

ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం 161 కిలోమీటర్లను అధికారులు ఆరు ప్యాకేజీలుగా విభజించారు. వీటిల్లో మొదటి ప్యాకేజీలో 34.5 కి.మీ., రెండో ప్యాకేజీలో 26 కి.మీ., మూడో ప్యాకేజీలో 23 కి.మీ., నాలుగో ప్యాకేజీలో 29 కి.మీ., ఐదో ప్యాకేజీలో 31.1 కి.మీ., ఆరో ప్యాకేజీలో 17.9 కి.మీ ఉన్నాయి. ఈ ప్యాకేజీ పనులకు ఆగస్టు రెండో వారంలో టెండర్లను ఆహ్వానించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూసేకరణ పూర్తయిన చోట్ల ఇప్పటికే అలైన్‌మెంట్ సిద్ధమవ్వగా.. రైతులు, భూయజమానులకు నష్టపరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వీలైనంత వరకు ఖరారు చేసి, అందజేయాలని అధికారులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే సర్వే, భూసేకరణ వంటి పనులు పూర్తయినా.. నష్టపరిహారం పెండింగ్‌లో ఉండడంతో పనుల్లో ఆలస్యం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవ్వగానే.. సీఎం రేవంత్‌రెడ్డి, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ అంశంపై దృష్టిసారించారు. మూడేళ్లలో ఆర్‌ఆర్‌ఆర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని పలు సందర్భాల్లో ప్రకటించారు. యుటిలిటీ చార్జీల విషయంలో ఏర్పడ్డ ఆటంకాలను కూడా తొలగించేలా కేంద్రంతో చర్చలు జరిపారు. ఆ సమస్యను పరిష్కరించారు. ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, నష్టపరిహారంపై దృష్టిసారించారు.


పరిహారం చెల్లింపులకు హడ్కో రుణం

ఉత్తర భాగం ఆర్‌ఆర్‌ఆర్ పూర్తవ్వడానికి 1,940 హెక్టార్ల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.14 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. ఇందులో భూపరిహారానికే రూ.5,200 కోట్లు మేర అవసరం ఉంటుంది. అయితే.. ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌హెచ్‌ఏఐ సేకరించే భూములకు సంబంధించిన పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం 50% మేర భరించాల్సి ఉంటుంది. ఆ హామీతోనే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి ముందడుగు పడేలా గత సర్కారు చర్యలు తీసుకుంది. 2018 ఆగస్టు 29న అప్పటి సీఎం కేసీఆర్ కేంద్ర మంత్రి గడ్కరీకి రాసిన లేఖలో ఇదే అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,600 కోట్ల మేర పరిహారభారాన్ని మోయాల్సి ఉంటుంది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు.. ఆ వాటాను బ్యాంకుల ద్వారా ఒకేసారి రుణంగా తీసుకోవాలని నిర్ణయించింది. తొలుత నాబార్డు రుణంపై దృష్టిసారించినా.. వడ్డీ ఎక్కువ కావడం వల్ల హడ్కో వైపు దృష్టి సారించారు. హడ్కోకు సమర్పించేందుకు డీపీఆర్, ఇతర వివరాలను సిద్ధం చేసినట్లు సమాచారం. హడ్కో రుణం విడుదలవ్వగానే.. చకచకా నష్టపరిహారం చెల్లించి, ప్రాజెక్టు పనులు వడివడిగా సాగేలా చర్యలు తీసుకుంటోంది.

దేవాదాయానికి సౌరశక్తి

పడావు భూముల్లో సోలార్ విద్యుదుత్పత్తి..దేవాదాయ శాఖ నిర్ణయం.. త్వరలో అమలు

- పైసా ఖర్చు లేకుండానే.. సౌరశక్తితో ఆదాయం
- రెడ్‌కోపై వనరుల కల్పన బాధ్యత
- ఆదాయంలో రెడ్‌కో-దేవాదాయానికి వాటా
- 720 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- తొలి దశలో 230 ఎకరాల్లో విద్యుదుత్పత్తి



హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): "ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కరా".. "మిత్రస్య చర్షణీ ధ్రుత శ్రవో దేవస్య సానసీం!".. అంటూ సూర్యారాధన చేసే దేవాలయాలు.. ఇకపై ఆ భానుడి శక్తితో ఆదాయాన్ని సమకూర్చుకోనున్నాయి. అంతేకాదు.. ఒక్కదెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా.. ఆదాయంతోపాటు, విలువైన దేవాలయ భూములను కాపాడుకోనుంది. ఇందుకోసం దేవాలయాల భూముల్లో పడావుగా ఉన్న వాటిలో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించింది. తెలంగాణ పునరుత్పాదక విద్యుత్తు అభివృద్ధి సంస్థ(టీజీరెడ్కో) ఇందుకు సహకారాన్ని అందించనుంది.

ఆదాయం + భూములకు భద్రత

దేవాదాయశాఖకు రాష్ట్రంలో 15 వేల ఎకరాల భూములున్నాయి. వాటిల్లో 1,100ఎకరాల దాకా ఆక్రమణల్లో ఉన్నాయి. మరో 2వేల ఎకరాలను లీజుకు ఇవ్వగా.. 700ఎకరాల భూవివాదాల్లో ఉంది. మిగతా భూముల్లో వ్యవసాయ యోగ్యం కాని.. రాబోయే 5-10 ఏళ్ల వరకు వాటితో అవసరం లేని, భూ ధరలు ఎక్కువగా ఉండి.. ఆక్రమణలకు ఆస్కారం ఉన్న వాటిని క్రమంగా సౌర విద్యుదుత్పత్తికి వినియోగించాలని నిర్ణయించింది. సిద్దిపేట, మెదక్, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లోని 22 ఆలయాలకు సంబంధించి పడావుగా ఉన్న 720 ఎకరాల్లో(విద్యుత్తు సబ్-స్టేషన్లకు 1, 2 కిలోమీటర్ల దూరంలో ఉన్నవి) సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలను సిద్ధం చేసింది. తొలి దశలో 230 ఎకరాల్లో వీటిని ప్రారంభించడానికి కసరత్తు చేస్తోంది.

ఖర్చు కొంతే.. ఆదాయమే ఆదాయం

230 ఎకరాల్లో సౌర ఫలకాలను ఏర్పాటు చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పనే.! నాణ్యమైన ప్యానెళ్లను ఏర్పాటు చేస్తే.. 20-25 సంవత్సరాల దాకా పనిచేస్తాయి. తొలి ఐదేళ్లలోనే పెట్టుబడి వెనక్కి వస్తుంది. అయితే.. సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు దేవాదాయ శాఖ పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా.. టీజీరెడ్కో ముందుకు వచ్చింది. విద్యుత్తు పంపిణీ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవడం, నెట్‌మీటర్ల ఖర్చు వరకే దేవాదాయశాఖ బాధ్యత. సౌర విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు వనరులను రెడ్కో సమకూరుస్తుంది. ఈ కేంద్రాలు ప్రారంభమయ్యాక వచ్చే ఆదాయంలో దేవాదాయ శాఖకు, రెడ్కోకు వాటా ఉంటుంది. అంటే.. పెద్దగా ఖర్చు చేయకపోయినా.. ఆదాయానికి ఆదాయంతోపాటు.. భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని దేవాదాయ శాఖ భావిస్తోంది.

ఇతర మార్గాలు కూడా..

సౌర విద్యుత్తుతోపాటు.. పడావుగా ఉన్న భూములు, హైవేలకు ఆనుకుని ఉన్న స్థలాల ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే దిశలో దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అవసరమైన చోట్ల కల్యాణ మండపాలను నిర్మించాలని భావిస్తోంది. హైవేలను ఆనుకుని ఉన్న భూముల్లో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే జైళ్లశాఖ, పోలీసు విభాగం, ఆర్టీసీ కూడా ఖాళీగా ఉన్న తమ స్థలాల్లో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసి, ఎలాంటి నష్టాలు లేకుండా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న విషయం తెలిసిందే.!

రాష్ట్రంలో యూ ట్యాక్స్ బాదుడు

ధాన్యం కొట్టేసిన మిల్లర్ల నుంచి 500 కోట్ల వసూళ్లు.. అందులో నుంచి ఢిల్లీకి 100 కోట్లు

- ఉత్తమ్, అధికారులపై ఏలేటి ఆరోపణలు



హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల నుంచి తాలు, తరుగు, తేమ పేరిట ఎక్కువ ధాన్యం తూకం వేసిన మిల్లర్లు యూ ట్యాక్స్ పేరుతో మంత్రికి, అధికారులకు చెల్లింపులు చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ధాన్యం కొనుగోలులో క్వింటాకు 10-12 కిలోల చొప్పున ఎక్కువ తూకం వేస్తున్నారని, ఈ ప్రక్రియలో వసూలవుతున్న రూ.వందల కోట్లు ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కమిషనర్ చౌహాన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇటీవల రూ.500 కోట్లు చేతులు మారితే, అందులో రూ.100 కోట్లు ఎన్నికల ఫండ్ పేరిట ఢిల్లీకి పంపించిన మాట వాస్తవం కాదా..? అని ఉత్తమ్‌ను నిలదీశారు. సీఎం రేసులో తాను కూడా ఉన్నానని చెప్పుకోవడానికి ఉత్తమ్ ఈ మొత్తాన్ని ఢిల్లీకి పంపించారని ఆరోపించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ధాన్యాన్ని ఎక్కువ తూకం వేయడంతో పాటు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్ల నుంచి అనధికారిక జరిమానా పేరిట రాష్ట్రంలో రూ.950 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. డీఫాల్టర్ మిల్లర్లకు సీఎంఆర్ కోటా ఎలా ఇచ్చారో కమిషనర్ చౌహాన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.వేల కోట్ల ధాన్యం మిల్లర్ల వద్ద ఉన్నా.. మళ్లీ వారికే ధాన్యం ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సీఎంఆర్ ద్వారా రావాల్సిన బియ్యం విలువ సుమారు రూ.25వేల కోట్లు అని, మిల్లర్ల వద్ద ఉన్న ఈ ధాన్యానికి ప్రభుత్వం వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోందని దుయ్యబట్టారు. గడచిన మూడేళ్లుగా ధాన్యం సేకరించి, సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని నిలదీశారు. ఇలాంటి మిల్లర్లపై రూ.450 కోట్లు రశీదు లేని జరిమానా విధించారని ఆరోపించారు.

వారాణసీలో వార్ వన్‌సైడే: సంజయ్

వారాణసీలో వార్ వన్ సైడే ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. వచ్చే నెల 1న జరిగే ఎన్నికల్లో అత్యధిక ఓట్లు ప్రధాని మోదీకే వస్తాయని తెలిపారు. మంగళవారం సంజయ్ వారాణసీలో తెలుగు ప్రజలు ఎక్కువ సంఖ్యలో నివసించే పాండే హవేలీ, సోనార్‌పురలో ఎన్నికల ప్రచారం చేశారు. కాగా, ఉత్తరాదిలో బీజేపీ గెలుపు కోసం దక్షిణాది నేతలంతా ప్రచారం చేస్తున్నారని కర్ణాటక, తమిళనాడు బీజేపీ కో ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు.


మేడిగడ్డపై జియోట్యూబ్ వాల్!

జియోట్యూబ్ చుట్టూ గ్యాబియన్ బాక్సుల ఏర్పాటు.. 500 మీటర్ల పొడవు.. 2.5 మీటర్ల ఎత్తుతో తాత్కాలిక కట్ట

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కట్ట నిర్మాణం
- రూ.10 కోట్ల వ్యయం అంచనా
- నవంబరులో ప్రారంభం.. నెలలో పూర్తి
- మేడిగడ్డ మరమ్మతు పనులు వచ్చే ఏడాది జూన్‌లో పూర్తయ్యే చాన్స్
- నేడు ఇరిగేషన్ అధికారులతో జియో ట్యూబ్ సంస్థల ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో దానికి ఎగువ భాగంలో జియోట్యూబ్ టెక్నాలజీతో కట్టను నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. జియోట్యూబ్ టెక్నాలజీలో.. ఇసుకను నింపిన ట్యూబ్ చుట్టూ రక్షణగా గ్యాబియన్ బాక్సులు (రాళ్లతో నింపిన కంచె) ఏర్పాటు చేయనున్నారు. పలు దేశాల్లో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దేశంలో ప్రధానంగా బ్రహ్మపుత్ర బేసిన్‌లో వరదల నివారణకు కరకట్టలుగా జియోట్యూబ్‌లను వినియోగిస్తున్నారు. గోదావరి వరదల నివారణపై అధ్యయనం చేయడానికి తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు బ్రహ్మపుత్ర బేసిన్‌లో పర్యటించిన సమయంలో దీనిని గుర్తించారు. ఇప్పుడు మేడిగడ్డకు ఎగువన వాటిని నిర్మించాలని ప్రతిపాదించారు. మేడిగడ్డ బ్యారేజీలో నిల్వ చేసే నీటిని ఎత్తిపోయడానికిగాను బ్యారేజీకి 17 కిలోమీటర్ల దూరంలో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. సరిగ్గా ఈ పంప్‌హౌస్ వద్దే జియోట్యూబ్ కట్టను నిర్మించి అక్కడి నుంచే నీటిని పంప్‌హౌస్‌కు మళ్లించనున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రాంతంలో గోదావరి నది 500 మీటర్ల పొడవు దాకా ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో 500 మీటర్ల పొడవు, 2.5 మీటర్ల ఎత్తుతో కట్టను నిర్మించనున్నారు. దీనికోసం రూ.10 కోట్ల దాకా వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. సాధారణంగా గోదావరికి అక్టోబరు-నవంబరు దాకా భారీగా వరదలు ఉంటాయి. ఆ సమయంలో బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయకుండా.. వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదులుతుంటారు. ఆ సమయంలో వచ్చే భారీ వరదను అడ్డుకొని, నింపే సామర్థ్యం బ్యారేజీలకు ఉండదు. బ్యారేజీల నిర్మాణం కూడా వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు పంపిస్తూ.. వరద తగ్గుముఖం పట్టాక నీటిని నిల్వ చేసి మళ్లించడానికి ఉద్దేశించిందే. కానీ, మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న నేపథ్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టడానికి నవంబరు తర్వాతే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది నవంబరులో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తే.. 2025 జూన్‌లోపు పూర్తయ్యే అవకాశాలుంటాయి. దీంతో ఈలోగా జియోట్యూబ్ టెక్నాలజీతో తాత్కాలిక కట్టను నిర్మించి, యాసంగి అవసరాలకు నీటిని వినియోగించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.


జియోట్యూబ్ మోడల్



వరదలు తగ్గుముఖం పట్టాక కట్ట నిర్మాణం..

గోదావరికి వరదలు ఏటా జూన్ నెలాఖరు, జూలైలో మొదలై అక్టోబరు, నవంబరు దాకా కొనసాగుతాయి. దీంతో అక్టోబరు, నవంబరులో వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత.. తాత్కాలిక జియో ట్యూబ్ కట్ట నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఇసుక నింపిన ట్యూబులను మధ్యలో పేర్చి, చుట్టూ రాళ్లతో నింపిన ఇనుప కంచెల బాక్సులను రక్షణగా ఏర్పాటు చేయనున్నారు. ఈ టెక్నాలజీతో కలిగే ప్రయోజనంపై బుధవారం జియో ట్యూబ్ సంస్థలకు చెందిన ప్రతినిధులు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం కానున్నారు. కట్ట నిర్మాణం కోసం అయ్యే వ్యయం అంచనాలు తెప్పించుకొని, బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్ (బీవోసీఈ)లో చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలని నీటిపారుదల శాఖ యోచిస్తోంది. కాగా, పంప్‌హౌస్ వద్దే 2.5 మీటర్లతో కట్ట నిర్మిస్తే.. పంపులకు అవసరమైన నీరు అందుతుందని అధికారులు అంచనాకు వచ్చారు. ప్రాణహిత నది గోదావరిలో కలిసే చోట దిగువనే కన్నెపల్లి పంప్‌హౌస్ ఉంది. దీనికి వరదల సమయంలో నేరుగా నీరందే అవకాశం ఉన్నప్పటికీ.. వరదలు తగ్గుముఖం పట్టగానే మేడిగడ్డలో నిల్వ చేసి.. బ్యాక్ వాటర్‌ను పంపింగ్ చేసేవారు. కానీ, మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ ఇప్పట్లో సాధ్యం కాకపోవడంతో జియో ట్యూబ్ టెక్నాలజీతో కట్ట నిర్మాణం చేపడుతున్నారు. అంతా సవ్యంగా జరిగి నవంబరులో నిర్మాణ పనులు ప్రారంభిస్తే.. డిసెంబరులో పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. 2025 జూన్ లేదా జూలై వరకు పంపింగ్ పూర్తి చేశాక.. ఈ కట్టను తొలగిస్తారు. ఏటా జూన్‌లో లేదా జూలైలో భారీ వరదలు వస్తే.. తాత్కాలిక కట్ట అంతా కొట్టుకుపోయే ప్రమాదం ఉండటమే ఇందుకు కారణం. ఈలోగా మేడిగడ్డ పునరుద్ధరణ పూర్తికాకపోతే తొలగించిన ట్యూబ్‌లు, గ్యాబియన్ బాక్సులతో మళ్లీ కట్టను నిర్మిస్తారు. తొలగించి..మళ్లీ మళ్లీ వినియోగించుకునే అవకాశంతోపాటు దాదాపు 30-40 ఏళ్లపాటు ట్యూబ్‌లను వాడుకునే వెసులుబాటు ఉండడమే ఈ టెక్నాలజీ ప్రత్యేకత అని అధికారులు తెలిపారు. ఆస్ట్రేలియాతో పాటు వివిధ దేశాల్లో వీటి వినియోగం సమర్థంగా ఉండటంతో రాష్ట్రంలోనూ మేడిగడ్డలో వీటిని వినియోగించాలని నిర్ణయించారు.

ఆ రెండు బ్యారేజీలపైనా ఫుల్ ఫోకస్

కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపైనా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది. ఈ సీజన్‌లో వీటి మరమ్మతులు పూర్తిచేసి, అక్టోబరులో ప్రధాన గోదావరికి వరద తగ్గుముఖం పట్టిన తర్వాత బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఆ సమయంలో అన్నారంలో 11 మీటర్ల దాకా, సుందిళ్లలో 9 మీటర్ల దాకా నీటిని నిల్వ చేసుకుంటే పంపింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రధానంగా యాసంగి పంటల సాగుతోపాటు వేసవిలో తాగునీటి అవసరాలకు ఈ నీటిని వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

బ్యారేజీకి తాత్కాలిక మరమ్మతులు..

తాత్కాలిక కట్ట నిర్మాణం జరిపేలోగానే మేడిగడ్డ బ్యారేజీకి తాత్కాలిక మరమ్మతులు (పునాది కింద బొరియలు మూసే పని) చేపట్టనున్నారు. బ్యారేజీ సీపేజీలకు ఈ బొరియలే కారణమని అధికారులు ఇప్పటికే గుర్తించారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్), ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ) పరీక్షల నివేదికలు ప్రభుత్వం వద్ద ఉండటంతో వాటి ఆధారంగా బ్యారేజీకి తాత్కాలిక మరమ్మతులు చేయనున్నారు. కాగా, బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోవడంతో ఆ బ్లాకు స్థానంలో కొత్త బ్లాకు నిర్మించాలా? లేక కుంగిన పిల్లర్లు తొలగించి, కొత్త పిల్లర్లు నిర్మించాలా? అనే దానిపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల పూర్తి నివేదికలో తేలనుంది. అంతేకాకుండా బ్యారేజీల స్థితిగతులపై కేంద్ర సంస్థలు చేసే అధ్యయనం ద్వారా కూడా స్పష్టత రానుంది.

హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడిగా యాకూబ్

- ఉపాధ్యక్షుడిగా బాల్‌రెడ్డి.. ఏకగ్రీవంగా ఎన్నిక
- సొసైటీ గత లావాదేవీలపై విచారణ కమిటీకి తీర్మానం!



హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడిగా ప్రముఖ కవి యాకూబ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సర్వసభ్య సమావేశం మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. సొసైటీకి ఎన్నికలు నిర్వహించగా.. అధ్యక్షుడిగా యాకూబ్, ఉపాధ్యక్షుడిగా మలుపు ప్రచురణకర్త బాల్‌రెడ్డి, కోశాధికారిగా నవచేతన ప్రతినిధి నారాయణరెడ్డిలతో పాటు సహాయ కార్యదర్శులుగా మంచి పుస్తకం సురేశ్, సూరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ప్రధాన కార్యదర్శి నవతెలంగాణ మేనేజర్ వాసు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రచురణ సంస్థల ప్రతినిధులు జనార్దన్ గుప్తా, విజయరావు, మధుకర్, కోటేశ్వరరావు, శ్రీకాంత్, భూమి శ్రీనివాస్, నవోదయ సాంబశివరావు, కుమార్.. ఈ ఎనిమిది మందితో బుక్ ఫెయిర్ సొసైటీ కార్యనిర్వాహక విభాగం ఏర్పాటైనట్లు తెలిపారు. ఎమెస్కో విజయకుమార్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో బుక్ ఫెయిర్ సొసైటీ ఖాతాలకు సంబంధించిన పలు అంశాలు చర్చకు రావడంతో.. బుక్ ఫెయిర్ సొసైటీ గత లావాదేవీలపైన ప్రత్యేక కమిటీతో విచారణ జరిపించాలని సమావేశంలో తీర్మానించినట్లు సమాచారం.

జూన్ 19న డాక్ అదాలత్

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు జూన్ 19న ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రస్థాయిలో 'డాక్ అదాలత్'ను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తపాలాశాఖ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను జూన్ 7 లోగా హైదరాబాద్‌లోని ఆబిడ్స్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయంలో సహాయ సంచాలకులు ఎస్.రంగారావుకు పంపాలని, ఫిర్యాదులపై స్పష్టంగా 'డాక్ అదాలత్' అని రాయాలని వారు చెప్పారు. ఫిర్యాదుదారులు మొబైల్‌నంబర్, ఈ-మెయిల్ అడ్రస్ తెలియజేసిన పక్షంలో 'డాక్ అదాలత్' రోజున సంప్రదించి సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలియజేశారు.

గత సర్కారు తీరుతో బతుకులు చిన్నాభిన్నం

- పూర్వపు వీఆర్వోల సంఘం

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): వీఆర్వో వ్యవస్థ రద్దుతో తమ జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని, గత ప్రభుత్వ ప్రయోగాల వల్ల సమస్యల వలయంలో చిక్కుకున్నామని పూర్వపు వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరికె ఉపేంద్ర పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం విజ్ఞప్తి చేశారు.భద్రాది జీసీసీలో 22 నెలలుగా వేతనాలు అందడంలేదని, ఉద్యోగ భద్రత, పదోన్నతులు కరువై తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూశాఖలో ఉద్యోగ అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని కౌన్సెలింగ్ ద్వారా మాతృశాఖలోకి తీసుకోవాలని, సర్వీస్, పే ప్రొటెక్షన్ కల్పించి కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు.

చిటారుకొమ్మన చింత చిగురు ధర

- కిలో రూ.వెయ్యి దాక పలుకుతున్న రేటు



సంగారెడ్డి టౌన్, మే 21: ఇగురు పెట్టుకుని తిన్నా.. ఎండు చేపల కూరలో వాడినా.. పప్పులో కలిపినా.. మటన్‌తో పాటు ఉడికించినా తనదైన ప్రత్యేకతతో వంటకు రుచి అందించే చింత చిగురు ధర చిటారుకొమ్మన నిలిచింది. పుల్లపుల్లగా ఉన్నప్పటికీ కూరల్లో అద్భుతమైన కాంబినేషన్‌గా నిలిచే ఈ చిగురు రేటు పైపైకి చేరుతోంది. ఏటా ఇదే సీజన్‌లో చింత చెట్ల ఆకులు రాలిపోయాక వచ్చే చిగురును కొమ్మల పైకెక్కి కోసి మార్కెట్లకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గ్రామాల్లో విరివిగా దొరికినా.. పట్టణాలు, నగర వాసులకు మాత్రం అది 'చింతాకే'. నెల కిందట హైదరాబాద్ మెహదీపట్నం రైతు బజార్‌లో కిలో రూ.700 పలికిన చింత చిగురు ప్రస్తుతం రూ.800 పైనే ఉంది. విడిగా అయితే 100 గ్రాములను రూ.100 చొప్పున అమ్ముతున్నారు. మంగళవారం సంగారెడ్డిలోని మార్కెట్‌కు పుల్కల్ మండలం గొంగ్లూర్ తండాకు చెందిన బుజ్జి అనే మహిళ చింత చిగురు తీసుకురాగా కొనేందుకు జనం ఆసక్తి కనబరిచారు. అయితే, ధర విని.. అమ్మో అని ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.300 ఉంది. మటన్ రేటు రూ.850 పైనే. వీటికి పోటీనా అన్నట్లు చింత చిగురు పరుగులు పెడుతోంది.

రేపే ఎడ్‌సెట్.. ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం ఎడ్‌సెట్ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఎడ్‌సెట్ కోసం మొత్తం 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. మొదటి సెషన్‌ను ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, రెండవ సెషన్‌ను మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారు. ఎడ్‌సెట్ కోసం 79 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీలో కర్నూలు, విజయవాడల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ఫోన్ల రికవరీలో టాప్-2లో తెలంగాణ

- 13 నెలల్లో 30 వేలకుపైగా ఫోన్లు స్వాధీనం

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): పోయిన సెల్‌ఫోన్లు తిరిగి స్వాధీనం చేసుకుని అసలు యజమానులకు అప్పగించడంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరం ఏప్రిల్ 19న సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 30,049 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని అదనపు డీజీపీ(ఇన్‌చార్జి సీఐడీ) మహేశ్ భగవత్ మంగళవారం తెలిపారు. సగటున ప్రతి రోజు 76 సెల్‌ఫోన్లు రికవరీ చేస్తున్నట్లు వెల్లడించారు. సెల్‌ఫోన్ల రికవరీలో కర్ణాటక మొదటి స్థానంలో ఉండగా తెలంగాణ రెండో స్థానంలో ఉందని, ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ఉన్నట్లు మహేశ్ భగవత్ తెలిపారు. సీఐడీ ఎస్పీ డా. లావణ్య సంబంధిత విభాగాలతో నిరంతరం సమన్వయం చేసుకుని సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు.

మీరు సరైనది కొనుగోలు చేస్తున్నారా?

- ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ వినూత్న ప్రచారం



ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఫ్రీడమ్ ఆయిల్స్ ప్రతినిధులు

హైదరాబాద్, మే 21: ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్‌ను ఉత్పత్తి చేస్తున్న జెమినీ ఎడిబుల్స్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ వినూత్న తరహాలో ప్రచారం చేస్తోంది. మీరు సరైనదే కొనుగోలు చేస్తున్నారా? అని ప్రశ్నిస్తూ వినియోగదారులను అప్రమత్తం చేస్తోంది. ఒక లీటర్ ప్యాకెట్‌లో కచ్చితంగా 910 గ్రాముల నూనె ఉండాలని, ఆ విధంగా ఉన్న నూనెలనే కొనుగోలు చేయాలని కోరుతోంది. కానీ, కొన్ని బ్రాండ్లు ఒక లీటర్ ప్యాకెట్ పేరిట 850-870 గ్రాముల నూనెను విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నాయని, అలాంటి వాటిని కొని మోసపోవద్దని అవగాహన కల్పిస్తోంది. ఈ సందర్భంగా జెమిని ఎడిబుల్స్ ఫ్యాట్స్ ఇండియా సంస్థ సేల్స్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తాము చేపట్టిన ప్రచారం ద్వారా వినియోగదారుల హక్కుల గురించి తెలియజేస్తున్నామని చెప్పారు. వంటనూనెలను కొనుగోలు చేసే ముందు ప్రతి ఒక్కరూ పౌచ్‌పై వివరాలను చూడాలని కోరారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అమలుకు కమిటీ

- ఈఎన్‌సీ చైర్మన్‌గా నలుగురు సభ్యులు
- మరమ్మతులను పర్యవేక్షించనున్న కమిటీ
- కేంద్ర సంస్థలతో బ్యారేజీల అధ్యయనం
- నేడు రాష్ట్రానికి సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులు

హైదరాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు వీలుగా జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన మధ్యంతర నివేదికను అమలు చేసేందుకు ప్రభుత్వం నలుగురు అధికారులతో కమిటీని నియమించింది. బ్యారేజీలపై అధ్యయనాలతోపాటు వాటి మరమ్మతు పనులను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సభ్యులుగా ఈఎన్‌సీ(ఓఅండ్ఎం), సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్ ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా రామగుండం ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ వ్యవహరిస్తారు. అయితే ఇందులో నిపుణులను కూడా సభ్యులుగా నియమించుకునే అవకాశాన్ని కమిటీ చైర్మన్‌కు ఇస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. వానాకాలం వచ్చేలోపు బ్యారేజీలపై అధ్యయనం/పరీక్షలు పూర్తిచేసి, బ్యారేజీల రక్షణ కోసం తగిన మరమ్మతులు చేయాలని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, బ్యారేజీల రక్షణ కోసం తీసుకునే తాత్కాలిక పనులను ఈ కమిటీ సమన్వయం చేసుకోనుంది. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయో నిగ్గు తేల్చడానికిగాను వాటిపై భూ భౌతిక, భూ సాంకేతిక పరీక్షలు చేయించాలన్న ఎన్‌డీఎస్‌ఏ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సంస్థలను ఆశ్రయించింది. ఢిల్లీలోని కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం (సీఎస్ఎంఆర్ఎస్), పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్తు పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ)తో బ్యారేజీలపై అధ్యయనం చేయించాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. కాగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. దీంతో పుణెలోని సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు నిపుణులు బుధవారం రాష్ట్రానికి రానున్నారు. తొలుత వారు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై.. ఆ తరువాత బ్యారేజీల పరిస్థితిపై అధ్యయనం చేపడతారు. మరోవైపు సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన నిపుణులు కూడా రెండు రోజుల్లో రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. మరోవైపు బ్యారేజీల వద్ద మరమ్మతు పనులు ఊపందుకున్నాయి. సీసీ బ్లాకులు, అప్రాన్లను సరిచేసే పనులు జరుగుతున్నాయి. వరదకు అడ్డంగా ఉన్న ఇసుకను కూడా తరలిస్తున్నారు.

'రేవ్' మూలాలు విజయవాడలో..

- ప్రధాన నిందితుడు వాసు క్రికెట్ బుకీ
- బెజవాడలో అతిపెద్ద బుకీల నెట్‌వర్క్
- ఆయనపై రెండు కేసులు నమోదు

విజయవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారం అటు తెలుగు సినీ పరిశ్రమతోపాటు తెలుగు రాష్ట్రాలనూ కుదిపేస్తోంది. తాజాగా ఇందులో విజయవాడ మూలాలు వెలుగులోకి వచ్చాయి. రేవ్ పార్టీకి సూత్రధారి అయిన వాసు అలియాస్ లంకపల్లి వాసు విజయవాడ వాసి. కొత్తపేటలోని ఆంజనేయవాగుకు చెందిన వాసు.. హైదరాబాద్, బెంగళూరు నుంచి క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటాడు. విజయవాడలోనూ అతిపెద్ద బుకీల నెట్‌వర్క్‌ను విస్తరించాడు. వాసు ఆదాయానికి బెట్టింగ్‌లే ప్రధాన కారణమైనప్పటికీ పైకి మాత్రం వ్యాపారం, ఫార్మా రంగాల పేర్లను ఉపయోగించుకుంటున్నాడు. పుట్టినరోజు సందర్భంగా వాసు స్వయంగా బెంగళూరులోని ఫాంహౌస్‌లో పార్టీ ఏర్పాటు చేయగా.. విజయవాడకు చెందిన నలుగురు ప్రధాన బుకీలు మిగిలిన ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తోంది. కొంతకాలంగా హైదరాబాద్‌లోనే మకాం వేసిన వాసు అక్కడి నుంచే మొత్తం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. బెంగళూరులో పోలీసులకు చిక్కిన వాళ్లంతా తమ స్వస్థలం హైదరాబాద్ అని చెప్పారు. విజయవాడకు చెందిన వాళ్లు కూడా అదే పేరును వాడుకున్నారు. బెంగళూరు ఘటనపై రేవ్ పార్టీ కేసును బెంగళూరు పోలీసులు, డ్రగ్స్ కేసును నార్కోటిక్ విభాగ పోలీసులు నమోదు చేశారు. ఈ రెండింటిలోను వాసు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. విజయవాడ, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని కొంతమంది పోలీసులతో వాసు అండ్ గ్యాంగ్‌కు మంచి స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నట్టు వినికిడి. అదేవిధంగా ఆయన అనుచరులు విజయవాడలోని కొంత మంది పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెంగళూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లలో పోలీసుల నంబర్లు కూడా ఉన్నాయని తేలింది.

రేవ్‌పార్టీలో తెలుగు నటి

ప్రకటించిన బెంగళూరు పోలీస్ కమిషనర్

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటి ఉన్నట్టు నగర పోలీసు కమిషనర్ దయానంద్ ప్రకటించారు. కమిషనరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవ్ పార్టీలో 101 మంది పాల్గొన్నారని వెల్లడించారు. ఈ పార్టీలో ప్రజా ప్రతినిధులు ఎవరూ లేరని చెప్పారు. తాను హైదరాబాద్‌లోని ఓ ఫాం హౌస్‌లో ఉన్నట్లు సినీ నటి విడుదల చేసిన వీడియోపై ఆయన స్పందిస్తూ.. సదరు తెలుగు నటి ఇక్కడే ఉన్నారని, ఆమె డ్రగ్స్ తీసుకున్నారా లేదా అనేది నిర్ధారణ కాలేదని అన్నారు. పార్టీలో పాల్గొన్న 101 మంది రక్త నమూనాలను సేకరించామని, త్వరలోనే నివేదికలు వస్తాయని తెలిపారు. రేవ్ పార్టీకి సంబంధించి వి రణధీర్, మహమ్మద్ అబూబక్కర్ సిద్ధిక్, ఎల్ వాసు, వైఎం అరుణ్‌కుమార్, నాగబాబు (32)ను అరెస్టు చేశామని తెలిపారు.

ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్‌లు

పది వర్సిటీలకు నియామకం.. వచ్చే నెల 15లోపు కొత్త వీసీలు

హైదరాబాద్, తార్నాక, వరంగల్ ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఐఏఎస్ అధికారులు వచ్చే నెల 15వ తేదీ వరకు ఆయా యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా కొనసాగనున్నారు. ఆలోపే పూర్తిస్థాయి వీసీలను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దాంతో ఐఏఎస్‌లను ఇన్‌చార్జి వీసీలుగా నియమించారు. వీరిలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారు. ఉస్మానియా వర్సిటీకి దాన కిషోర్, కాకతీయ యూనివర్సిటీకి వాకాటి కరుణ, అంబేద్కర్ వర్సిటీకి రిజ్వీ, తెలుగు వర్సిటీకి శైలజా రామయ్యర్, జేఎన్‌టీయూకి బుర్రా వెంకటేశం, తెలంగాణ యూనివర్సిటీకి సందీప్ కుమార్ సుల్తానియా, శాతవాహనకు సురేంద్ర మోహన్, మహాత్మగాంధీ యూనివర్సిటీకి నవీన్ విట్టల్, జేఎన్ఏఎఫ్‌కు జయేష్ రంజన్, పాలమూరుకు నదీమ్ అహ్మద్ లను నియమించారు. కాగా, యూనివర్సిటీలకు కొత్త వీసీలను ఎంపిక చేయడం కోసం ఇప్పటికే సెర్చ్ కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. త్వరలోనే ఈ సెర్చ్ కమిటీలు సమావేశమై కొత్త వీసీల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నాయి. వీసీల పదవి కాలం ముగిసేలోపే కొత్త వీసీలను నియమించాలని ప్రభుత్వం భావించి గతంలోనే నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆసక్తి గల ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించారు. అయితే.. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా, ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్న నేపథ్యంలో సెర్చ్ కమిటీలు త్వరలో సమావేశమై కొత్త వీసీల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నాయి.

కేయూలో కీలక ఫైళ్లు మాయం!

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ తాటికొండ రమేష్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. మంగళవారం పరిపాలన భవనం ఎదుట వీసీ రమేష్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ఆయన అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని.. మంగళవారంతో వీసీగా పదవీకాలం ముగియడంతో కొన్ని ముఖ్యమైన ఫైళ్లు మాయం చేశారని ఆరోపించారు. వీసీ రమేష్ లాడ్జి నుంచి కీలక ఫైళ్లు మాయమైనట్లు అసోసియేషన్ ఆఫ్ అకుట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు ఆయన అసోసియేషన్ సభ్యులతో కలిసి రిజిస్ట్రార్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఉస్మానియా వర్సిటీ వీసీ రవీందర్ నియంతృత్వ పాలన ముగిసిందని బహుజన విద్యార్థి సంఘాల నాయకులు, ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో మిఠాయిలు పంచుతూ ఉండగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మూడేళ్లుగా రవీందర్ ఓయూలో అభివృద్ధి పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విద్యార్థి నేతలు ఆరోపించారు.

పిన్నెల్లి అరాచకం..

- స్వయంగా ఈవీఎం ధ్వంసం చేసిన ఎమ్మెల్యే
- పల్నాడు జిల్లా పాల్వాయి గేట్‌లో ఘటన
- సీసీ కెమెరాలో రికార్డయిన విధ్వంసం

గుంటూరు/అమరావతి-ఆంధ్రజ్యోతి/మాచర్ల, మే 21: పోలింగ్ రోజున పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు ఒక్కొక్కటీ వెలుగుచూస్తున్నాయి. ఈ నెల 13న రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటులో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుండగా.. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో పిన్నెల్లి బరితెగించారు. గ్రామంలోని 202వ నంబర్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటుపై ఆయన, ఆయన అనుచరులు దాడి చేశారు. అలాగే మరో ఏడు పోలింగ్ కేంద్రాల్లోనూ పిన్నెల్లి ఇలాగే ఈవీఎంలు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఆ ఏజెంట్‌పై అదే రోజు పోలింగ్ బూత్ బయటే గొడ్డలితో దాడి చేశారు. 202వ బూత్ వీడియో మంగళవారం రాత్రి వెలుగు చూసింది. దీనిపై ఈసీ తీవ్రంగా స్పందించింది. అన్ని పోలింగ్ కేంద్రాల వీడియో ఫుటేజీని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారులు పోలీసులకు అప్పగించారని.. విచారణ అనంతరం పిన్నెల్లిని నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు తమకు తెలియజేశారని సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా కార్యాలయం మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈవీఎంల ధ్వంసంలో ప్రమేయం ఉన్నవారందరిపైనా కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా డీజీపీకి సీఈవో సూచించాలని పేర్కొంది. అయితే సిట్ రంగంలోకి దిగాక పోలీసులు పిన్నెల్లిపై కేసు పెట్టారా.. అంతకుముందే నమోదుచేశారా అన్న విషయంలో స్పష్టత లేదు. కాగా.. పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని ఈ నెల 14న పోలీసులు గృహనిర్బంధం చేశారు. కానీ అర్ధరాత్రి వారిరువురూ పరారైనా పోలీసులు చోద్యం చూశారన్న విమర్శలున్నాయి.

రామేశ్వరం కేఫ్ పేలుడు కేసు.. వికారాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు

- ఎన్ఐఏ అదుపులో అనుమానితుడు
- మరో నాలుగు రాష్ట్రాల్లోనూ తనిఖీలు
- 11 మంది అదుపులోకి.. కీలక పత్రాలు సీజ్

హైదరాబాద్/రాయదుర్గం/బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రత్యేక బృందాలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి 4 రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న అనుమానితుడిని వికారాబాద్‌లో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడు కేసులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు అనుమానిస్తున్న ముసావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ తాహను కోల్‌కతాలో ఎన్ఐఏ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తదుపరి దర్యాప్తులో షాజిబ్, మతీన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎన్ఐఏ బృందాలు మంగళవారం సోదాలు చేపట్టాయి. వికారాబాద్‌లో ఎన్ఐఏ అదుపులోకి తీసుకున్న వ్యక్తి పుణెకు చెందిన పండ్ల వ్యాపారి అని, అతని స్వస్థలం నాందేడ్ అని అధికారులు వివరించారు. రామేశ్వరం కేఫ్ పేలుడు తర్వాత ఆయన వికారాబాద్‌లో తలదాచుకుంటున్నట్లు గుర్తించామన్నారు. గతంలోనూ ఉగ్రవాద కేసులతో అతడికి సంబంధాలున్నాయని, కర్ణాటక పోలీసులు నమోదు చేసిన ఉగ్రవాద కేసులో శిక్ష కూడా పడ్డట్లు వివరించారు.

రాయదుర్గంతో లింకులు

తాజా తనిఖీలు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాయదుర్గంలోనూ జరిగాయి. అక్కడ సోహెల్ అనే యువకుడిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సోహెల్‌కు.. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఎన్ఐఏ ఆధారాలను సేకరించింది. సోహెల్ తండ్రి అబ్దుల్లా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, రిటైర్ అయ్యారు. సోహెల్ బెంగళూరులో టెకీగా పనిచేస్తున్నా.. కొవిడ్ సమయం నుంచి వర్క్-ఫ్రమ్-హోమ్ చేస్తున్నారు. అంతకు ముందు బెంగళూరులో ఉన్నప్పుడు కూడా ఉగ్రవాద సంస్థలకు చెందిన వారి రూమ్‌లలో ఉండేవాడు. సోహిల్ రెండేళ్ల క్రితం హజ్ యాత్రకు వెళ్లొచ్చారు. సౌదీలో అతనికి ఉగ్రవాద సంస్థల నేతలతో పరిచయాలేర్పడ్డాయి. వారితో వాట్సా‌ప్‌లో చాటింగ్ కొనసాగించారు. సోహిల్ సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామని ఎన్ఐఏ అధికారులు వివరించారు.

కర్ణాటక, తమిళనాడు, కేరళల్లో..

ఎన్ఐఏ అధికారులు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనూ మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బెంగళూరులోని కుమారస్వామి లేఅవుట్, బసవశంకరి ప్రాంతాల్లో నాలుగు చోట్ల ఎన్ఐఏ దాడులు జరిగాయి. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో వైద్యులు డాక్టర్ జాఫర్ ఇక్బాల్, డాక్టర్ నయీం సాదిక్ నివాసాల్లో తనిఖీలు చేశారు. మొత్తమ్మీద దక్షిణాది రాష్ట్రాల్లో జరిపిన సోదాల సందర్భంగా 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొందరు 2012 బెంగళూరు, హుబ్లీ ఉగ్రవాద కుట్ర కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు వివరించారు. ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 22 మే 2024
diksuchi@andhrajyothy.com



ఐజీడీటీయూడబ్ల్యూలో పీజీ, పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమన్(ఐజీడీటీయూడబ్ల్యూ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. పీజీలో ఎంటెక్, ఎంప్లాన్, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆసక్తిగల మహిళలు జూన్ 7 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

- దరఖాస్తు ఫీజు రూ.1000
- వెబ్‌సైట్: igdtuw.ac.in

ఎంటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 86 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) 25, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ 25, ఐటీ(సైబర్ సెక్యూరిటీ) 18, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(వీఎల్ఎస్ఐ డిజైన్) 18 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ/ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్/ ఫిజిక్స్/మేథ్స్/స్టాటిస్టిక్స్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంప్లాన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్ అర్బన్ ప్లానింగ్. మొత్తం 13 సీట్లు ఉన్నాయి. కనీసం 60 శాతం మార్కులతో బీఆర్క్/బీ ప్లానింగ్ లేదా సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(సోషియాలజీ); (ఎంఏ/ఎమ్మెస్సీ)(జాగ్రఫీ/ఎకనామిక్స్) ఉత్తీర్ణులు కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **వయసు:** 2024 సెప్టెంబరు 30 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో సీయూఈటీ ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు.
- **మొదటి కౌన్సెలింగ్:** జూన్ 18
- **రెండో కౌన్సెలింగ్:** జూలై 2

ఎంసీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో 76 సీట్లు ఉన్నాయి. మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బీసీఏ/బీఐటీ/బీఐఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. డిగ్రీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అభ్యర్థులకు ప్రవేశం కల్పిస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో సీయూఈటీ స్కోర్ ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 14 నుంచి
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 26
- **మొదటి కౌన్సెలింగ్:** జూలై 1
- **రెండో కౌన్సెలింగ్:** జూలై 8
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 10

పీహెచ్‌డీ

- ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ సౌకర్యం కల్పిస్తారు. వీరికి నెలకు రూ.10,000ల చొప్పున అయిదేళ్లపాటు స్టయిపెండ్ ఇస్తారు. బోధన నైపుణ్యం ఉన్నవారిని జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్‌లుగా నియమిస్తారు. వీరికి మొదట నెలకు రూ.38,440, తరవాత నెలకు రూ.43,400ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్ పేపర్ సబ్మిట్ చేసి పేటెంట్ పొందినవారికి క్యాష్ ప్రైజ్ కింద రూ.5,00,000 ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: మొత్తం 117 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 16, ఐటీ/కంప్యూటర్ అప్లికేషన్స్ 28, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ 5, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 16, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్ 29, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ 5, ఫిజిక్స్ 10, కెమిస్ట్రీ 4, మేథమెటిక్స్ 1, మేనేజ్‌మెంట్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంజనీరింగ్ స్పెషలైజేషన్లకు సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌కు బీఎస్సీ(మేథ్స్, సైన్సెస్) డిగ్రీతోపాటు ఎంసీఏ పూర్తిచేసి ఉండాలి. సైన్స్ స్పెషలైజేషన్లకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీ; ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌కు కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ/75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్) పూర్తిచేసి ఉండాలి. మేనేజ్‌మెంట్ విభాగానికి కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/టెక్నాలజీ/కామర్స్/ఎకనామిక్స్/బిహేవియరల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి.

ఎంపిక: అభ్యర్థులు రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్టు రాయాల్సి ఉంటుంది. ఇందులో 50 శాతం ప్రశ్నలను రీసెర్చ్ మెథడాలజీ నుంచి, మిగిలిన ప్రశ్నలను సంబంధిత సబ్జెక్టు నుంచి అడుగుతారు. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. సంస్థలో ఫుల్ టైమ్ బోధన సిబ్బందిగా పనిచేస్తున్నవారు, స్పాన్సర్డ్ అభ్యర్థులు, యూజీసీ/సీఎస్ఐఆర్ నుంచి జేఆర్ఎఫ్/నెట్ లేదా గేట్ వ్యాలిడ్ స్కోరు ఉన్న అభ్యర్థులు రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్టు రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం


- **రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఆర్ఏటీ) తేదీ:** జూన్ 26
- **ఆర్ఏటీ ఫలితాలు విడుదల:** జూలై 1
- **ఇంటర్వ్యూకి అర్హులైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** జూలై 3
- **ఇంటర్వ్యూలు:** జూలై 8 నుంచి 11 వరకు
- **పీహెచ్‌డీకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 22

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

ఖాళీలు 90

జనవరి 2025లో ప్రారంభమయ్యే 52వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశానికి ఇండియన్ ఆర్మీ దరఖాస్తులు కోరుతోంది. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన వారికి బీటెక్ కోర్సు, లెఫ్టినెంట్ కొలువులకు ఉచిత శిక్షణ ఇస్తారు.

- టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 52వ కోర్సు(టీఈఎస్)-జనవరి 2025



అర్హత: కనీసం 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతో పాటు జేఈఈ(మెయిన్స్) 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 16.5 నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

కోర్సు శిక్షణ: మొత్తం ఐదేళ్ల కోర్సు శిక్షణ కొనసాగుతుంది. ఇందులో ఏడాదిపాటు బేసిక్ మిలిటరీ ట్రెయినింగ్, నాలుగేళ్ల టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్) డిగ్రీ అందజేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in/

ఐఐటీఎంలో ప్రాజెక్ట్ పోస్టులు

ఖాళీలు 65

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ(ఐఐటీఎం)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రాజెక్ట్ సైంటిస్ట్-3: 4 పోస్టులు
2. ప్రాజెక్ట్ సైంటిస్ట్-2: 11 పోస్టులు
3. ప్రాజెక్ట్ సైంటిస్ట్-1: 4 పోస్టులు
4. ట్రెయినింగ్ కో ఆర్డినేటర్: 1 పోస్టు
5. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 2 పోస్టులు
6. ప్రాజెక్ట్ అసోసియేట్-2: 08 పోస్టులు
7. ప్రాజెక్ట్ అసోసియేట్-1: 33 పోస్టులు
8. రీసెర్చ్ అసోసియేట్(డీప్ ఓషియన్ మిషన్): 2 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, నెట్/సీఎస్ఐఆర్-యూజీసీ/గేట్ స్కోరుతోపాటు పని అనుభవం అవసరం.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 18

వెబ్‌సైట్: https://www.tropmet.res.in/

కొచ్చిన్ షిప్‌యార్డులో జనరల్ వర్కర్లు

ఖాళీలు 15

కొచ్చిన్ షిప్‌యార్డు లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన జనరల్ వర్కర్(క్యాంటీన్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: 7వ తరగతి, ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫుడ్ ప్రొడక్షన్/ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీస్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు లేదా గుర్తింపు పొందిన సంస్థ నుంచి క్యాటరింగ్ అండ్ రెస్టారెంట్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఒకేషనల్ సర్టిఫికెట్ ఉత్తీర్ణులై ఉండాలి. మలయాళ భాషలో పరిజ్ఞానంతోపాటు సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 మే 22 నాటికి 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత, ప్రాక్టికల్ పరీక్షలు తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 22

వెబ్‌సైట్: cochinshipyard.in/

SCHOLARSHIP ALERT

NextGen Edu Scholarship 2024-25

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).



Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1

buddy4study.com

లిటిల్స్




మీకు తెలుసా?

- చిలుక జాతికి చెందిన ఈపక్షిని రెయిన్‌బో లోరీకీట్స్ అంటారు ఇది ఇంద్రధనుస్సు రంగులమయంగా ఉంటుంది.
- పొడవు 30 సెం.మీ. వరకు ఉంటుంది. బరువు 75 గ్రాముల నుంచి 157 గ్రాములు ఉంటుంది. వింగ్ స్పాన్ 24 సెం.మీ. వరకూ ఉంటుంది.
- ఈ చిలుకలు ఎక్కువగా ఆస్ట్రేలియాలో కనిపిస్తాయి.
- నారింజ, నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు పచ్చ.. రంగులు వేసినట్లుండే ఈ పక్షి ఎక్కువగా పండ్లు, ద్రాక్ష, యాపిల్స్, నట్స్ తినటానికి ఇష్టపడుతుంది.
- వీటి ముక్కు, కాలి గోళ్లు బలమైనవి. ముక్కు సాయంతో చెట్టు మీద కిందికి వేలాడగలదు.
- చెట్టు తొర్రల్లో, చెట్ల పైన, రాళ్ల మధ్య ఇవి గూడు కట్టుకుంటాయి.



- రెండు గుడ్లు మాత్రమే పెడతాయి. ఇరవై ఐదు రోజుల పాటు తల్లి పక్షి మాత్రమే గూటిలో ఉంటుంది.
- ఇవి మాట్లాడటంలో, కొత్త పదాలను నేర్చుకోవటంలో ముందుంటాయి. మనుషులతో ఫ్రెండ్లీగా, ప్రేమగా ఉంటాయి.
- ఇవి పెంపుడు పక్షులు. అయితే ఆస్ట్రేలియాలో వీటిని పెంచుకోవటం నేరం.
- వందలుగా గుంపులు వస్తాయి. ఇవి గట్టిగా అరుస్తాయి. జనాలను డిస్టర్బ్ చేస్తుంటాయి.
- వీటి జీవనకాలం 30 సంవత్సరాలు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



ఎన్ని చేపలు ఉన్నాయి?



డైలీ సుడోకు - 313

			3				8	
		2		4			9	
	8			7				3
5				3		8		
8		3	4		9	2		6
		6		5				4
7				6			2	
	4			2		6		
	6				1			

సుడోకు - 312 సమాధానం

8	3	6	7	2	9	4	1	5
9	5	2	4	1	6	8	7	3
7	1	4	8	3	5	9	2	6
1	7	5	9	6	8	3	4	2
3	2	8	1	7	4	6	5	9
4	6	9	3	5	2	1	8	7
5	8	7	6	4	3	2	9	1
2	9	3	5	8	1	7	6	4
6	4	1	2	9	7	5	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.